వార్త
తెలుగు జాతీయ దినపత్రిక



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్ : fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 145 పేజీలు: 10+4 వెల: 6.50


భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం

నిర్మాణంలోని గోడౌన్ కూలి 8 మంది మృతి

5



## 12 మంది కేంద్ర మంత్రులు ఔట్?

ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించే అవకాశం

### ఇద్దరు సీనియర్లకు గవర్నర్ పదవులు..

### రేపోమాపో మంత్రివర్గ విస్తరణ!

**న్యూఢిల్లీ,జూన్ 24:** ప్రధాని మోడీ 4.0 టార్గెట్‌గా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం పార్టీలో కీలక మార్పులకు సిద్ధం అయ్యారు. కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో పాటుగా ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. 12 మంది మంత్రుల తొలగింపు దాదాపు ఖరారైంది. ఇద్దరు సీనియర్లకు గవర్నర్ పదవులు ఇవ్వనున్నారు. ఇప్పటికే రాష్ట్రపతిని కలిసిన ప్రధాని కేంద్ర కేబినెట్ ప్రక్షాళన పైన సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కసరత్తు వేగవంతం అయింది. మంగళవారం సాయంత్రం ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుని కీలక సమాలోచనలు జరిపారు. మరోవైపు ఇద్దరు కేంద్రమంత్రుల రాజ్యసభ పదవీకాలం ముగిసినా వారిని తిరిగి ఎంపిక చేయలేదు. వీరిలో ఒకరు బుధవారం మంత్రి పదవికి రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్య వస్థీకరణ ఈనెల 26 లేదా 27న ఉండేఅవకాశం ఉందని తెలుస్తోంది. కేంద్ర క్యాబినెట్ భేటీలో పార్లమెంట్ సమావేశాలపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కేరళకు చెందిన కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ బుధవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ పదవీకాలం ఈ నెల 21న ముగిసింది. ఆయనను కేంద్రం తిరిగి నామినేట్ చేయలేదు. మరోవైపు రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ రాజ్యసభ పదవీకాలం కూడా ఈనెల 21నే ముగియగా ఆమెను కూడా

>>2




## 'సర్'పై అప్రమత్తం

### ఇన్‌చార్జి మంత్రులు బాధ్యతగా వ్యవహరించాలి

### జూమ్‌సమావేశంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్24:** రాష్ట్రంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ఎలాంటి నిరక్ష్యం జరిగినా

>>2

# 'తుంగ' నీరు రావాలి



తుంగభద్ర జలాలపై జరిపిన సమీక్షలో సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

### 15.9 టిఎంసిలలో ఐదారే వస్తోంది..

### పక్కరాష్ట్రాలకు చెప్పి కేంద్ర సర్కార్ మిగులు నీటిని ఇప్పించాలి..

### తుంగభద్ర, ఆర్డీఎస్, నదీ జలాల వివాదాలపై సమీక్ష జరిపిన సిఎం రేవంత్‌రెడ్డి

### నేడు కర్ణాటకకు ముఖ్యమంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్24:** తుంగభద్ర నుంచి మన రాష్ట్రానికి రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి.. భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయ సాధనకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుంగభద్ర డ్యామ్, నది ప్రవాహం నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉంది. ఇప్పుడు అయిదారు టీఎంసీలకు మించి రావడం లేదని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ కింద జోగులాంబ గద్వాల జిల్లాలో దాదాపు 75 గ్రామాల్లో 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉంది. మూడు రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక నీటి వాటాల సమర్ధ వినియోగానికి కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) సారథ్యంలో తుంగభద్ర బోర్డ్ ను పటిష్టం చేయాలని కోరారు. బుధవారం సాయంత్రం జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్,ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఆర్డీఎస్ ఆనకట్ట ప్రమాదకరంగా మారిందని, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన పనులను అత్యవసరంగా గుర్తించాలని కోరారు. రాజోలి బండ డైవర్సన్ కెనాల్ ఆధునికీకరణకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ.59 కోట్లు డిపాజిట్ చేసిందని, పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని అన్నారు. ప్యాకేజీ 1,2 పనులు ఇప్పటికీ చేపట్టలేదని, ప్యాకేజీ 3, 4 పనులు మాత్రం పూర్తి అయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

>>2

### సిఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

2



2

### బాల్క సుమన్‌కు బెయిల్ నేడు విడుదల



### ఇప్పటికే లోటుతో నైరుతి

### 2027 రుతుపవనాలకూ తప్పని ముప్పు

### తీవ్ర ప్రతికూల ప్రభావానికి అవకాశం

## ఫిబ్రవరి వరకు ఎల్ నినో!

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** మధ్యపసిఫిక్ మహాసముద్రంలో కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావం కారణంగా భారతదేశంలో నైరుతి రుతుపవన కాలం ఇప్పటికే తీవ్ర లోటుతో ప్రారంభమైంది. ఈ ప్రభావం ఇప్పట్లో తొలగిపోయేలా కనిపించడం లేదు. ఈ ఎల్ నినోతో జరుగుతున్న వాతావరణ మార్పులు 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉంది. ఎల్ నినో యొక్క ఈ సుదీర్ఘ ప్రభావం మత్స్య పరిశ్రమ, బంగాళాఖాతం మరియు అరేబియా సముద్రాల స్థితిపై ప్రభావం చూపడమే కాకుండా, తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందనే

>>2



## రికార్డు స్థాయిలో సంక్షేమం

### గత ప్రభుత్వ అప్పులకు యేటా రూ.76 వేల కోట్లు కడుతున్నాం: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. తెలంగాణరాష్ట్రాన్ని ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుతోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలను అందించాలన్న దృఢ సంకల్పంతో

>>2






ముంబయిలో బుధవారం కురిసిన భారీ వర్షానికి నడుములోతు నీటిలో ప్రయాణిస్తున్న బైకర్

# ఫిబ్రవరి వరకు ఎల్ నినో!

>> హెచ్చరికలు చోటు చేసుకున్నాయి. ఈ ఎల్ నినో ప్రభావం 2027 భారత రుతుపవన కాలంపై ప్రతికూల ప్రభావం పడే తీవ్రమైన అవకాశం ఉంది. భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం (ఇన్‌కోయిస్) తన తన మొట్టమొదటి ఎల్ నినో బులెటిన్‌లో, ఎల్ నినో "జూన్ 2026 నుండి ఫిబ్రవరి 2027 వరకు" ఆధిపత్యంలో కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. ఇలా జరగడానికి 7090 శాతం సంభావ్యత ఉందని, అయితే ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ పరిస్థితులు తటస్థ దశకు తిరిగి రావడానికి 10 నుండి 30 శాతం అవకాశం ఉందని ఇన్‌కోయిస్ తెలిపింది. ఎల్ నినో వేసవి కాలం వరకు కొనసాగడం అనేది, ఆ తర్వాత వచ్చే రుతుపవనాలకు కూడా వర్తిస్తుందని తెలిపింది. సముద్రంలోనూ, వాతావరణ వ్యవస్థలలోనూ పరిస్థితులు అంత త్వరగా మారవని, కచ్చితంగా ఏమీ చెప్పలేనప్పటికీ, 2027 రుతుపవన కాలం కూడా దెబ్బతినే అవకాశాన్ని కొట్టిపారేయలేం అని పేర్కొంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల వల్ల ఇది చాలావరకు సంభవించే అవకాశం ఉందని వెల్లడించింది. ఇంకోయిస్ ప్రకటించిన ఎల్ నినో బులెటిన్‌ల శ్రేణిలో మొదటి దానిలో, తాము రూపొందించిన డీప్ లెర్నింగ్ వాతావరణ నమూనాలు 15 నెలల ముందస్తు అంచనా వరకు నినో 3.4 సూచికను నైపుణ్యంగా అంచనా వేస్తాయని ఆ పరిశోధనా సంస్థ పేర్కొంది. జూన్ 2026 నుండి ఫిబ్రవరి 2027 వరకు ఉన్న అంచనా కాలంలో, ఎల్ నినో ప్రధానమైన తీవ్ర దశగా ఉంటుందని భావిస్తున్నారు. ఎల్ నినో కొనసాగడం వల్ల ఉత్తర హిందూ మహాసముద్రం అంతటా సముద్ర పరిస్థితులు ప్రభావితం అవుతాయని అంచనా వేయబడింది. దీని ఫలితంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం, పై సముద్రపు పొరల్లో ఉష్ణం అధికమవడం, పొరల విభజన బలపడటం, మరియు సముద్ర ఉష్ణ తరంగాలు సంభవించే అవకాశం పెరగడం వంటివి జరుగుతాయని స్పష్టం చేసింది. ఈ పరిస్థితులు బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని సముద్ర జీవావరణ వ్యవస్థలు, మత్స్య సంపద, మరియు తీరప్రాంత పర్యావరణాలను ప్రభావితం చేయవచ్చని ఇంకోయిస్ పేర్కొంది. దీని ప్రభావంతో రాబోయే చేపల వేట కాలంలో బంగాళాఖాతంలో అధిక గాలులు, సముద్ర పరిస్థితులు ఏర్పడవచ్చుని చెప్పింఇ. దీనివల్ల రెండు రకాల చేపల వేట తగ్గే అవకాశం ఉంది. సముద్రం వేడెక్కడం వల్ల కొన్ని తీవ్రమైన వాతావరణ సంఘటనలు సంభవించవచ్చు, అదే సమయంలో తీవ్రమైన వాతావరణ పరిస్థితులలో తీరప్రాంతాలు స్థానిక కోత, వరదలు, తుఫాను ఉప్పెన ప్రభావాలను కూడా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. అయితే, మరోవైపు, పశ్చిమ భారత తీరంలోని అరేబియా సముద్రంలో సాపేక్షంగా ప్రశాంతమైన సముద్ర పరిస్థితులు మరియు సుదీర్ఘకాలం పాటు అనుకూల వాతావరణం ఉండే అవకాశం ఉందని ఇంకోయిస్ తెలిపింది.

# రికార్డు స్థాయిలో సంక్షేమం

>> పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వైరాలోలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలను, అప్పులను అధిగమిస్తూ రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అయన స్పష్టంగా ప్రకటించారు. గత ప్రభుత్వం చేసిన అడ్డగోలు అప్పుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని చెప్పారు. పదేళ్ల గత పాలనలో చేసిన అప్పులకు తమ ప్రభుత్వం అసలు వడ్డీతో కలిపి ఏడాదికి రూ.76 వేల కోట్లను కడుతోందని వివరించారు. దశాబ్దాల కిందట నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు వల్ల ఖమ్మం జిల్లా ఆయకట్టలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుంది ఆయన చెప్పారు. సాగర్ ప్రాజెక్టు ఇప్పటికీ అత్యంత ప్రతిష్టంగా రైతులకు సేవ చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం రెండేళ్లలోనే కూలిపోయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడంతోనే అవినీతి ఎంత మేర జరిగిందో అర్థం చేసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వం రూ.లక్షల కోట్లు అప్పు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజలకు, రైతులకు ఆశించిన స్థాయిలో మోలిక వసతులు కల్పించలేదని వ్యాఖ్యానించారు. ఆ అప్పులకు అసలు వడ్డీ కడుతూనే తాము పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా రికార్డు స్థాయిలో పేదలకు ఉచిత విద్యుత్ అమలు అమలు చేస్తునట్లు వెల్లడించారు. దాదాపు 50 లక్షల కుటుంబలకు పైగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు చెప్పారు.

రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతు భరోసా, పండించిన పంటను కొనుగోలు చేయడం వంటి కార్యక్రమాల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృతనిచ్చే ఎంతో పని చేస్తుందని అన్నారు. అందులో భాగంగా మహిళా సంఘాలకు వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలను వడ్డీ లేకుండా ఇవ్వాలని సంకల్పించామన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజక వర్గంలో 200 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ వసతులతో యంగ్ ఇండియా స్కూల్స్‌ని ప్రజా ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. కాగా పాలన అంటే కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన నలుగురు మనుషుల దోపిడీ కాదన్నారు. పాలన అంటే రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజల సంక్షేమం గురించి, వారి భవిష్యత్తు గురించి నిరంతరం ఆలోచించేదన్నారు. ఆ బాధ్యతాయుతమైన పాలనను ఈరోజు తమ ప్రభుత్వం అందిస్తోందన్నారు.

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాలంలో ఎన్నికల ప్రక్రియలో వస్తున్న మార్పులను పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.



ధర్మశాలలో బుధవారం గ్యాస్ కోసం భారీ క్యూలైన్‌లో ప్రజలు

# 12 మంది కేంద్ర మంత్రులు ఔట్?

>> రాజ్యసభకు తిరిగి ఎంపిక చేయలేదు. ఇక కేంద్ర రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష మల్హోత్రాను గత నెలలో ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా నియమించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి చాలా కాలం క్రితమే ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బీజేపీ బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో మంత్రివర్గంలో మరికొందరికి ఉద్వాసన తప్పదని, చాలా మంది కొత్తవారికి అవకాశాలు కల్పిస్తారని చర్చ జరుగుతోంది. నీట్ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను సైతం తప్పించనున్నారు. ఆప్ నుంచి బీజేపీలో చేరిన రాఘవ్ చద్దా తో పాటుగా బీహార్ మాజీ సీఎం నితీశ్ కేబినెట్ లో చేరనున్నారు. పంజాబ్ లో ఉన్న బీజేపీ చీఫ్ నితీన్ నబీన్ హుటా హుటిన ఢిల్లీ చేరుకున్నారు. మిత్రపక్షాలకు ఈ సారి ప్రాధాన్యత పెరిగేలా మార్పులు ఉంటాయని చెబుతున్నారు. దీంతో ఈ రోజు కేంద్ర కేబినెట్ తరువాత కేబినెట్ ప్రక్షాళన పైన పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సిఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్24:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఎన్నికల సమయంలో నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆయనపై నమోదయిన కేసులను రాష్ట్ర హైకోర్టు బుధవారం కొట్టేసింది. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రచారంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఫిర్యాదుతో కేసులు నమోదయ్యాయి. వాటిని కొట్టియాలంటూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో 5వేర్వేరు పిటీషన్లు దాఖలు చేశారు. వీటిని విచారించిన హైకోర్టు ధర్మానం ఐదు కేసులను కొట్టివేసింది. 2018 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి ఎంపీగానూ ఆయన విజయం సాధించారు. దీంతో ఉత్తమ్... ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో హుజూర్‌నగర్ ఉపఎన్నిక అనివార్యమైంది.

## వారం - వర్జ్యం

25-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
ఏకాదశి రా.8.11, స్వాతి సా.4.31
వర్జ్యం : రా.10.45-రా.12.32
ము.ఉ.9.58-ఉ.10.50, 2) మ.3.13-సా.4.05
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. సేవా కార్యక్రమాలలో లాభాలు పొందుతారు. శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** ఉన్నత పదవులలో ఉన్నవారితో పరిచయాలు ఏర్పడతాయి. స్పెకులేషన్స్ లాభిస్తుంది. ఋణాలు తీరుస్తారు.

**మిథునం:** ఎక్కువ అనుకూల వాతావరణం నెలకొని ఉండటం ఆనందానికి కారణం అవుతుంది. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**కర్కాటకం:** నూతన కాంట్రాక్టులు కైవసం చేసుకుంటారు. అనుకున్న పనులు దిగ్విజయంగా నెరవేరుస్తారు.

**సింహం:** దూరపు ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. వాహన సౌఖ్యం.

**కన్య :**శ్రమకు ఓర్చి మీ వంతు సహాయం అందిస్తారు. ఇంటియందు జరిగే శుభకార్యాలలో స్వల్ప విభేదాలు తలెత్తే సూచన.

**తుల:** సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** ఊహించని రీతిలో అవకాశాలు దగ్గరకు వస్తాయి. సద్వినియోగం చేసుకోండి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** ఎవరినీ లెక్కచేయక మీ పనిని సక్రమంగా నిర్వహించి వృత్తిలో లాభపడతారు. మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

**మకరం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఈ రోజు పాతమిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** విదేశీయానానికి చేసే ప్రయత్నాలు అనూహ్యంగా ముందడుగు వేస్తాయి. వాతావరణాన్ని అనుకూలంగా మలచుకుంటారు.

**మీనం:** సాంప్రదాయాలకు విలువనిచ్చి పాతకాలపు మనిషిగా ముద్రపడతారు. మధ్యవర్తిగా పేరు గడిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'సర్'పై అప్రమత్తం

>> పేదలు, బడుగు బలహీన వర్గాలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. బుధవారం జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, బీఎల్‌ఏలు, సర్పంచ్‌లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిరక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఎస్‌ఐఆర్ విషయంలో కొందరు నాయకులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జిల్లాల వారీగా నిర్వహించిన అవగాహన సదస్సులకు చెందిన పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయని, ఎవరెవరు నిరక్ష్యం చేస్తున్నారో పేర్లతో సహా వెల్లడించగలనని, కానీ ఆ పరిస్థితులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

ఎస్‌ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం సూచించారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించిన రేవంత్ రెడ్డి, ఎస్‌ఐఆర్ ప్రక్రియలో నిరక్ష్యం ప్రదర్శిస్తే పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. పేదల ఓట్లు జాబితాల నుంచి తొలగిపోతే వారి హక్కులు దెబ్బతింటాయని, అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఎస్‌ఐఆర్ విషయంలో పార్టీ నిర్ణయాలను పట్టించుకోని ఇన్‌ఛార్జ్‌లను తొలగించి కొత్తవారిని నియమిస్తామని హెచ్చరించారు. తీవ్రమైన ఈ విషయంలో నిరక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించబోమని, పని చేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తే సహించబోమని కూడా స్పష్టం చేశారు. మరో పది రోజులు వేచి చూస్తామని,అప్పటికీ పనితీరులో మార్పు రానట్లయితే చర్యలకు ఉపక్రమిస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో నిరక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గాల్లో ఎలాంటి నిరక్ష్యానికి తావివ్వొద్దని సూచించారు. దేశవ్యాప్తంగా బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాలను గమనించాలని పేర్కొన్నారు. బెంగాల్‌లో టీఎంసీ అప్రమత్తంగా లేకపోవడం వల్ల తీవ్ర నష్టం చవిచూసిందని తెలిపారు. ఇక్కడ కూడా బీజేపీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే అవకాశం ఉన్నట్లు హెచ్చరించారు. అందుకే ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలక పాత్ర పోషించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో ఓటరు జాబితాలను పరిశీలించాలని ఆదేశించారు.

గురువారం నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రతి నాయకుడు చురుగ్గా పాల్గొనాలని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని ఆమె అభివర్ణించారు.రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

# పిటిషన్ వెనక్కి తీసుకోవాలని ఎస్‌బిఐ నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్24:** గత కొన్ని రోజులుగా తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన రాయదుర్గం భూ వివాధం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని ఎస్‌బీఐ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఇదే అంశంపై తాజాగా రాష్ట్ర సీఎస్‌లో చర్చలు జరిగిన ఎస్‌బీఐ.. ఈ సమావేశం అనంతరం యూటర్న్ తీసుకుంది. సర్కారు సూచనలకు సానుకూలంగా స్పందించిన బ్యాంకు.. దీనికి ప్రత్యామ్నాయంగా 2.5 ఎకరాల భూమిని తీసుకునేందుకు అంగీకరించింది.

ఇక తాజాగా జరిగిన ఒప్పందంతో ఎస్బీఐతో ప్రభుత్వ లావాదేవీలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, గ్రాంట్లుతో పాటు లీడ్ బ్యాంకు హోదా కొనసాగించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇక హైకోర్టు తదుపరి విచారణ తర్వాత ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రకటన తర్వాత మరోసారి టీజీఐసీతో ఎస్‌బీఐ సమావేశం కానుంది.

# నేడు ఎస్‌ఎస్‌సి సప్లిమెంటరీ ఫలితాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్24:** తెలంగాణలో టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఎస్‌ఎస్‌సి బోర్డు తెలిపింది. విద్యార్థులు వాట్సాప్ ద్వారా,వెబ్‌సైట్ ద్వారా వేగంగా,సులభంగా తమ ఫలితాలను తెలుసుకోవచ్చు.

# సంగారెడ్డి జిల్లాలో అరుదైన ఖనిజ సంపద

## జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అరుదైన ఖనిజ నిల్వలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లో అరుదైన ఖనిజ సంపదను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) గుర్తించింది. మొగుడంపల్లి మండలం పర్వతాపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఈ ఖనిజ నిక్షేపాలు భారీ స్థాయిలో ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రపంచవ్యాప్తంగా అరుదుగా లభించే ఖనిజాల్లో వెనేడియం కీలకమైంది.

అధిక ధృడత్వం కలిగి ఉక్కు తయారీ, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, దీర్ఘకాలం నిల్వచేసే బ్యాటరీలు, అణు, రక్షణ రంగ పరికరాల తయారీలో దీనిని ఉపయోగిస్తారు. పునరుత్పాదక శక్తి నిల్వల వ్యవస్థకు డిమాండ్ పెరుగుతున్నందున వెనేడియంకు ప్రాధాన్యత పెరుగుతోంది. అలాగే, ఏరోస్పేస్ రంగానికి టైటానియం వెన్నెముకగా మారనుంది. తక్కువ బరువు, అధిక లాభం, తుప్పును నిరోధించే లక్షణాల కారణంగా టైటానియంను అంతరిక్ష నౌకలు, క్షి పణి వ్యవస్థలు, నౌకాదళ పరికరాలు, విమానాల తయారీ, వైద్య పరికరాల తయారీలో వినియోగిస్తారు.

ఈ నేపథ్యంలో ఈ నెల 11న జీఎస్ఐ నిర్వహించిన పరిశోధనలో 800 ఎకరాల్లో 15.25 మిలియన్ టన్నుల వెనేడియం, 87 మిలియన్ టన్నుల అల్యూమినియం లెటరైట్, టైటానియం నిక్షేపాలు ఉన్నట్లు కనుగొన్నారు. కొత్తగా కనుగొన్న ఈ ఖనిజ బ్లాక్‌ను కేంద్ర గనుల మంత్రిత్వశాఖ ఇటీవల ఈవేలం వేసింది. వేలంలో పర్వతాపూర్ బ్లాక్‌ను ఎన్ఎల్‌సీ ఇండియా సంస్థ దక్కించుకున్నట్లు గనుల శాఖ వెల్లడించింది.



అరుణాచల్ కెయి పన్యోర్ జిల్లాలోని నీపో్కా కాలనీ సమీపంలో అకాల వర్షాల మూలంగా కోతకు గురైన రోడ్లు

# 'తుంగ' నీరు రావాలి

>> నిలిచిపోయిన మొదటి రెండు ప్యాకేజీల పనులు వెంటనే చేపట్టాలని గురువారం కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో ముగ్గురు సీఎంలతో జరిగే సమావేశం లో ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడిక నిండిపోవడం వల్ల ఆశించిన విధంగా నీటిని మళ్లింపు సాధ్యం కావడం లేదని ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2004లో నిపుణుల కమిటీ పూడిక తొలిగించాలని సూచించింది. ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు ఇప్పటికి అమలు కాలేదని చర్చ జరిగింది. వెంటనే పూడిక తీసేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారు. పూడిక పేరుకున్న భూభాగం కర్ణాటకలో ఉండటంతో ఆ రాష్ట్ర సహకారం కోరాలని నిర్ణయం తీసుకున్నారు. పూడికతీత తో పాటు 2004లో నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనలను అమలు చేయాలని కేంద్రానికి వినతి పత్రం అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అప్పటి నివేదికకు ఇప్పుడున్న వాస్తవ పరిస్థితిని విశ్లేషించుకోవాలని సూచించారు. వెంటనే పూర్తి వివరాలతో నివేదికను తయారు చేయాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా సాధ్యమైనంత నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు. తుమ్మిళ్ల నుంచి నీటిని వినియోగించుకునేందుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీ పెంచాలని, వీలైనంత వేగంగా పనులను చేపట్టాలని ముఖ్యమంత్రి అదేశించారు. ఇదిలా ఉండగా,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం కర్ణాటక వెళ్లనున్నారు. ఉదయం 11 గంటలకు విజయనగర జిల్లా హోస్‌పేట్‌లో తుంగభద్ర డ్యాం 33 స్పిల్‌వే కొత్త గేట్ల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా వెళ్లనున్నారు. తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల ప్రారంభ కార్యక్రమంలో వీరిరువురు పాల్గొంటారు. అనంతరం మునిరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే ప్రజా సభకు ఆయన హాజరు కానున్నారు.

# బాల్క సుమన్‌కు బెయిల్

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థలతో పాటు రైల్వే ఆస్తులపై విధ్వంసకర వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో వున్న బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ బాల్క సుమన్‌కు హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్ పత్రాలు జైలు అధికారులకు అందడంలో ఆలస్యంఅయిన కారణంగా ఆయన విడుదల గురువారానికి వాయిదా పడింది. గత నెల 26వ తేదీన బిఆర్ఎ స్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో బాల్క సుమన్ సింగరేణి సంస్థలతో పాటు రైల్వే ఆస్తులపై చేసిన విధ్వంసకర వ్యాఖ్యలు సంచల నం రేపడం తెలిసిందే. దీనిపై స్పందించిన కాంగ్రెస్ నాయకులు పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై నాంపల్లి పోలీసు స్టేషన్‌లో సింగరేణి యాజమాన్యం చేసిన ఫిర్యాదుపై బాల్క సుమన్‌పై కేసు నమోదయ్యింది. ఈ కేసు నేపథ్యంలో గత నెల 30వ తేదీన సుమన్‌ను బిఆర్ఎస్ భవన్‌లో పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో బాల్క సుమన్‌ను కస్టడీలోకి తీసుకుని విచారి ంచాలని నాంపల్లి కోర్టులో నాంపల్లి పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ డిస్మిస్ అవగా దీనిని పోలీసు శాఖ హైకోర్టులో సవాల్ చేసింది. ఇదే స మయంలో బాల్క సుమన్‌కు బెయిల్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సోమవారం వాదనలు ముగి యగా బుధవారం నాడు తీర్పు వెలువడింది. పోలీసుల కస్టడీ పిటిషన్ డిస్మిస్ అవగా బాల్క సుమన్‌కు 25 వేల రూపాయల పూచీకత్తుతో రె ండు ష్యూరిటీలతో కూడిన బెయిల్ మంజూరయ్యింది.

## నిఘా విభాగం ఆదేశాల మేరకు కరీంనగర్‌లో 7 సెక్యూరిటీ ఏజెన్సీల మూసివేత

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పోలీసు శాఖ లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న సెక్యూరిటీ ఏజెన్సీలపై పోలీసులు కొరడా ఝ ళిపించడం మొదలు పెట్టారు. తెలంగాణలో పని చేసే ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలకు నిఘా విభాగం మార్గదర్శకాలు జారీ చేయడం తెలిసిం దే. కేంద్రంతో పాటు రాష్ట్ర పోలీసు శాఖ నుంచి కచ్చితంగా లైసెన్స్ పొందాలని, నిబంధనల మేరకు నడచుకోవాలని, ఉద్యోగులకు కార్మిక శాఖ నియమానుసారం వేతనాలు, ఇతర అలవెన్సులు చెల్లించాలని నిఘా విభాగం ఇటీవలే పేర్కొనడం తెలిసిందే. దీనిపై నిఘా విభాగం అదనపు డిజి విజయ్ కుమార్ సెక్యూరిటీ ఏజెన్సీలతో పాటు వీటి నిర్వాహకులతో భేటీ అయి నిబంధనల గురించి వివరించడంతో పాటు ఉల్లంఘనలపై కఠినంగా వుంటామని హెచ్చరించారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No.11/2026-27/SE(North)/EE (North)/DB/GVMC/ Dt:22-06-2026 (Item-01)
Number of Works : 1 Nos (One)
Value of Works (ECV) : Rs.1,20,97,598/-
Downloading Starting Date : 23-06-2026 @ 10.00 P.M.,
Date of Opening Tenders : 08-07-2026 @ 02.00 P.M.,
Further details at http://www.apeprocurement.gov.in
O/o the Superintending Engineer (North), GVMC
For Commissioner, GVMC

NOTICE
MAHADHAN
In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following Imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr. No. | Particulars / Grade | NPK 16-8-34 | NPK 8-52-17 | NPKFe 0-42-47-2.8 | NPKS 30-0-0-5 | NPKS 24-0-12-6 |
|---|---|---|---|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 16 | 8 | 0 | 30 | 24 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 8 | 52 | 42 | 0 | 0 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 34 | 17 | 47 | 0 | 12 |
| 5 | Sulphur (as S) percent by weight, minimum | 0 | 0 | 0 | 5 | 6 |
| 6 | Ferrous Iron (as Fe) percent by weight, minimum | 0 | 0 | 2.8 | 0 | 0 |
| 7 | Total Chloride per cent by weight, maximum | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 |
| 8 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 9 | Sodium as NaCl percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 10 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 |
| 11 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 |
| 12 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 |

Salient Features:
1. 100% Water Soluble.
2. Improves quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar application.
Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.

Manufactured / Imported & Marketed by -
MAHADHAN AGRITECH LIMITED
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036, Maharashtra.
www.mahadhan.co.in

## నిజామాబాద్ అబ్కారీ సూపరింటెండెంట్
# మల్లారెడ్డికి రిమాండు

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో ఎసిబి అధికారులు అరెస్టు చేసిన నిజామాబాద్ జిల్లా అబ్కారీ సూపరింటెండెంట్ మల్లారెడ్డికి నాంపల్లి ఎసిబి కోర్టుల న్యాయమూర్తి రిమాండు విధించారు. అనంతరం ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మంగళవారం మల్లారెడ్డిని అక్ర మాస్తుల కేసులో నిజామాబాద్‌లోని ఆయన కార్యాలయంలో అరెస్టు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా హైదరా బాద్‌తో పాటు నిజామాబాద్ సహా 11 చోట్ల ఆయన బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఎసిబి అధికారులు మూడున్నర కోట్ల రూపాయల అక్రమాస్తులను గుర్తించడం విదితమే. దీని తరువాత ఆయనను వెంటనే హైదరాబాద్‌కు తరలించి ఎసిబి ప్రధాన కార్యాలయంలో విచారించారు. బుధవారం ఉదయం మల్లారెడ్డిని ఎసిబి కోర్టుల న్యాయమూర్తి ఇంటి ఎదుట హాజరు పరచగా కేసును విచారించిన మెజి స్ట్రేట్ నిందితుడికి రెండు వారాల రిమాండు విధించారు. దీని తరువాత మల్లారెడ్డిని ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.



## బాసర ఆలయ చోరుల కోసం
# ప్రత్యేక బృందాల వేట
### ఆరుగురు హోంగార్డులపై వేటు

**దిలావర్‌పూర్, జూన్ 24, ప్రభాతవార్త:** దక్షి ణా భారత దేశంలోనే పుణ్యక్షేత్రమైన నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పరిధిలో ఉన్న మహంకాళి ఆలయంలో మంగళ వారం తెల్లవారు జామున చోరీ జరిగిన విషయం తెలిసిందే. గుర్తుతెలియని దుండగులు ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు సమాచారం. హుండీని తీసు కెళ్లిన దుండగులు అందులోని నగదును కాజేసి, అనంతరం ఖాళీ హుండీని వ్యాస గుడి సమీపంలో వదిలివెళ్లినట్లు గుర్తిం చారు. ఉదయం నిత్యపూజల కోసం ఆలయానికి వచ్చిన అర్చకులు చోరీ జరి గిన విషయాన్ని గమనించి ఆలయ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించి పరిస్థితులను తెలుసుకున్నారు. క్లూస్ టీం సేకరించిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్‌లను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలి స్తున్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తూ దుండగులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ప్రజలు, ఆలయ సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ జానకి షర్మిల విజ్ఞప్తి చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ నాయ కులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు.

## హాస్టల్ బాత్రూంలో యువతి ప్రసవం
### వెంటిలేటర్ నుంచి పడేయడంతో నవజాత శిశువు మృతి

**హైదరాబాద్ (కార్వాన్), జూన్24 ప్రభాతవార్త:** గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో స్థానికంగా ఉన్న ఓ ఉమెన్స్ హాస్టల్లో ఉంటున్న ఓ యువతి ఆ హాస్టల్ వాష్రూమ్లో ప్రసవించి, ఆ తర్వాత అక్కడే ఉన్న వెంటిలేటర్ నుంచి ఆ నవజాత శిశువును విసిరేయడంతో ప్రాణాలు కోల్పోయింది. అప్పుడే పుట్టి కళ్లు కూడా సరిగ్గా తెరవని ఆ అభం శుభం తెలియని పసికందు లోకాన్ని చూడకముందే కనీస మానవత్వం కూడా లేకుండా ఆ తల్లి కాటికి పంపించింది. హాస్టల్లో ఉండే యువతి గర్భం దాల్చి ఆ విష యాన్ని ఎవరికీ చెప్పకుండా దాచింది. ఈ క్రమంలోనే ఆమె అదే హాస్టల్ బాత్రూంలో ప్రసవించింది. దాంతో ఆ పుట్టిన బిడ్డను ఏం చేయాలో తెలి యక ఆతల్లి బాత్రూంలోని వెంటిలేటర్‌లో నుంచి బయటికి విసిరేసింది. ఈ క్రమంలోనే ఆ శిశువుచనిపోయింది. బావ కారణంగానే ఆమె గర్భం దాల్చి నట్లు అనుమానిస్తున్నారు. హాస్టల్ బాత్రూంలో ప్రసవించిన ఆ యువతి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అది గమనించి హాస్టల్ యాజమాన్యం ఆమెను నీలోఫర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హాస్టల్ సిబ్బం ది ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసుల ఆ పసికందు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవ పరీక్ష నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# రాష్ట్రంలో ఎల్‌నినో అనిశ్చితి
## 60 శాతం తగ్గిన పంటలు
## 10.20 లక్షల ఎకరాలకు పడిపోయిన సాగు
### గత యేడాది ఇదే సమయానికి 25.30 లక్షల ఎకరాల్లో నాట్లు

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** ఎల్ నినో ప్రభావం రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ సాగు అనిశ్చితిని ఎదుర్కొంటోంది. రుతుపవనాలు నెమ్మదిగా ప్రవేశించడం, వివిధ జిల్లాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నెల 23వ తేదీ నాటికి మైనస్ 31 శాతం లోటుతో నమోదైన పేలవమైన వర్షపాతం, ఖరీఫ్ పంట కాలంలోని వ్యవసాయ కార్యకలాపాలపై ఇప్పటికే తన ప్రభావాన్ని చూపడం ప్రారంభించింది. గత ఏడాది ఇదే రోజు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25.30 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అయితే ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో అదే రోజుకు ఈ సంఖ్య కేవలం 10.20 లక్షల ఎకరాలకు పడిపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. వరి పంట విషయానికి వస్తే ఇప్పటివరకు సుమారు 10 వేల ఎకరాల్లో మాత్రమే వరి నారుమళ్లు, నాట్లు వేయడం జరిగిందని నివేదికలు సూచిస్తున్నాయి. దీనితో పోలిస్తే, గత సంవత్సరం జూన్ 22 వరకు రైతులు దాదాపు 60 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటివరకు వర్షపాతం తక్కువగా, అడపాదడపాగా ఉన్నప్పటికీ, జూన్ 1 నుండి జూన్ 23 వరకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈ కాలానికి సాధారణంగా కురవాల్సిన 94.6 మి.మీ. వర్షానికి బదులుగా తెలంగాణలో మొత్తం 65.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. గత సంవత్సరం, రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత వర్షాలు ఎడతెరిపి లేకుండా కురిశాయి. ఈ సంవత్సరం, వర్షాల మధ్య అంతరం ఎక్కువగా ఉంది, వర్షపాతం తక్కువగా ఉంది మరియు ఇప్పటివరకు జరిగిన విత్తనాలు ఈ విషయాన్నే ప్రతిబింబిస్తున్నాయి అని అధికారి తెలిపారు. కాగా వ్యవసాయ శాఖ రూపొందించిన ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా 1.35 కోట్ల ఎకరాల్లో వివిధ పంటలు పండించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 69 లక్షల ఎకరాల్లో వరి, 48 లక్షల ఎకరాల్లో పత్తి పండించనున్నారు. అలాగే తక్కువ నీటి తడులు అవసరమైన మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, బఠానీ, సజ్జలు తదితర పంటలను కేవలం 17.66 లక్షల ఎకరాల్లో మాత్రమే పండించాలని అంచనా వేసింది. వీటిలో 7 లక్షలకు పైగా ఎకరాల్లో కంది, 4.96 లక్షల ఎకరాల్లో సోయాబీన్, అలాగే పెసర్లు, మినుములు కూడా సాగు చేయాలని ప్రణాళికలో పేర్కొంది. అయితే ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినట్లయితే ఈ లక్ష్యాలను చేరుకునే అవకాశాలు ఉండవని అధికారులు భావిస్తున్నారు.

# కోట్లల్లో కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు
### బాస్ స్కాం/ సిఇఒ మోసాల పట్ల టిజిసిఎస్‌బి హెచ్చరిక



**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేట్ సంస్థలకు చెందిన డైరక్టర్లు, సీఈఓల పేరిట సైబర్ నేరగాళ్లు ఆయా సంస్థల ఉద్యోగులకు వాట్సాప్ మెసేజ్‌లు, ఈమెయిల్స్ పెడుతూ లక్షల రూపాయల నుంచి కోట్లాది రూపాయలను కాజేస్తున్న ఉదంతాలపై అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) హెచ్చరించింది. ఈ మేర కు టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెం టర్ (14సి) ఈ విషయమై ఇప్పటికే హెచ్చరించిందని ఆమె వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు విదేశాల నుంచి భారత్‌లోని బడా కంపెనీలను, ప్ర భుత్వ రంగ సంస్థలను టార్గెట్ చేస్తూ ఆయా సంస్థల డైరక్టర్లు, సీఈఓల పేర్లు చెబుతూ వారి ఫోటోలు వుంచుతూ వాట్సాప్ మెసేజ్‌లు పం పుతూ వెంటనే డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తున్నారని శిఖా గోయల్ తెలిపారు. ఈ తరహా మోసాలపై గత 20 రోజుల వ్యవధిలో దేశ వా ్యప్తంగా 300 పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని, ఇవి మరింత పెరిగే ప్రమాదం వుందని ఆమె తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఒక పథకం ప్ర కారం అత్యవసర పరిస్థితుల అంశాన్ని చెబుతున్నారని, ఆయా సంస్థలు వాడే అత్యవసర అధికారిక సమాచారం వంటి అంశాలను వాడుతూ మోసాలకు పాల్పడుతున్నట్లు ఆమె తెలిపారు. నేరగాళ్ల పంపే మెసేజ్‌లను కంపెనీల ఉద్యోగులు తెరిస్తే మాల్వేర్ ద్వారా కంప్యూటర్లో ఒక రకమైన సమాచార దోపిడి ఉపకరణం జొరబడుతుందని ఆమె తెలిపారు. దీనివల్ల కొన్నిసార్లు ఆయా సంస్థలు, కంపెనీల రహస్య సమాచారం కూడా చోరీకి గురవుతుందని శిఖా గోయల్ తెలిపారు. అనూహ్యంగా వచ్చే జెడ్ఐపి లేదా ఆర్ఎఆర్ ఫైళ్లను తెరవకూడదని, అర్జంట్ కంప్లయన్స్ లేదా ఇమిడియట్ యాక్షన్ రిక్వైర్డ్ అనే సందేశాలను పట్టిం చుకో వద్దని, అనుమతి ప్రక్రియలను ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయాలని ఆమె సూచించారు. డబ్బుల బదిలీకి సంబంధించిన సూచనలను ఫోన్ లేదా అధికారిక మార్గం ద్వారా మాత్రమే ధృవీకరించుకోవాలని ఆమె తెలిపా రు. అనుమానాస్పద ఫైళ్లు లేదా అటాచ్‌మెంట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దని, వెబ్ వాట్సాప్ లాగిన్ అయిన పరికరాలను తరచూ పరి శీలించి, అవ సరం లేని వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని శిఖా గోయల్ సూచించారు. సాధ్యమైనంత వరకు మల్టీ ఫ్యా క్టర్ అథెంటికేషన్‌ను వాడాలని, సంస్థల్లో అమలవుతున్న పటిష్టమైన ఆర్థిక విధానాలను కచ్చితంగా పాటించాలని ఆమె కోరారు. ఇక బడా కంపెనీలు తమ ఉద్యోగు లకు క్రమం తప్పకుండా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని, ఈ విషయంలో సైబర్ నిపుణుల సేవలనువ వాడుకోవాలని ఆమె కోరారు. ఈ తరహా మోసాల నివారణకు ముందుగా అడ్డగోలు సందేశాలకు స్పందించవద్దని, అటాచ్‌మెంట్లను తెరవవద్దని, సం బంధిత వ్యక్తులతో నేరు గా సంప్రదించి అన్ని విషయాలను ధృవీకరించుకోవాలని, ఏదైనా మోసం జరి గితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఆధా రాలను భద్రపరచాలని శిఖా గోయల్ తెలిపారు.

## ఇరాన్ అణుకేంద్రాల తనిఖీలు తప్పనిసరి: ఐఎఇఎ చీఫ్ గ్రోస్సీ



**టోక్యో,జూన్ 24:** ఇరాన్ అణు కార్యక్రమంపై నెలకొన్న అనిశ్చితికి తెరపడేలా ఐక్యరాజ్యసమితి అణుశక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ రఫేల్ మారియానో గ్రోస్సీ అణుకేంద్రాల తనిఖీలు తప్పనిసరి అని ప్రకటించి సంచలనం సృష్టించారు. అమెరికా ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం ఇరాన్‌లోని అణు ఇంధన శుద్ధి కేంద్రాలను ఐఏఈఏ తనిఖీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అణు కార్యకలాపాల పర్యవేక్షణలో ఐఏఈఏ పాత్ర అత్యంత కీలకమని, తనిఖీలు తప్పనిసరిగా జరుగుతాయని పేర్కొన్నారు. జపాన్‌లోని ఫుకుషిమా దైచీ అణు విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన గ్రోస్సీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై తనిఖీల విషయంలో అమెరికా, ఇరాన్ నుంచి విభిన్న ప్రకటనలు వస్తున్నప్పటికీ, ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇరాన్ అణు కేంద్రాల తనిఖీలపై వస్తున్న సందేహాలకు గ్రోస్సీ సమాధానం ఇచ్చారు. రాజకీయ నాయకుల ప్రకటనలు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉండవచ్చని, అధికారిక ఒప్పందంలోని అంశాలే ముఖ్యమని పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్ అధ్యక్షులు సంతకం చేసిన అవగాహన ఒప్పందంలో అణు పదార్థాలు, అణు కేంద్రాలకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఐఏఈఏ పర్యవేక్షణలోనే జరగాలని స్పష్టంగా ఉందన్నారు. తనిఖీలు జరగకుండా పర్యవేక్షణ సాధ్యం కాదు. రెండు రోజుల్లోనా, వారం రోజుల్లోనా, పది రోజుల్లోనా అనేది ముఖ్యం కాదు. కానీ తనిఖీలు మాత్రం తప్పకుండా జరుగుతాయని గ్రోస్సీ స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద ప్రస్తుతం అధిక స్థాయిలో శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని పాశ్చాత్య దేశాలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ అంచనాల ప్రకారం, ఆ నిల్వలు అవసరమైతే దాదాపు 10 అణు బాంబులు తయారు చేయడానికి సరిపోతాయని నిపుణులు చెబుతున్నారు. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాల కోసమేనని ఇరాన్ ఎప్పటినుంచో చెబుతోంది. ప్రపంచంలో అణ్వాయుధ కార్యక్రమం లేకుండానే 60 శాతం వరకు యురేనియం శుద్ధి చేసిన ఏకైక దేశంగా ఇరాన్ ఉండటం అనుమానాలకు తావిస్తోంది. దీంతో ఐఏఈఏ తనిఖీలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. 2025లో ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య 12 రోజుల పాటు జరిగిన యుద్ధం తర్వాత ఐఏఈఏ తనిఖీలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా యురేనియం శుద్ధి కేంద్రాలకు ఐఏఈఏ అధికారులను అనుమతించలేదు. అక్కడే అధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని భావిస్తున్నారు. అయితే బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం వంటి ఇతరప్రాంతాలను ఐఏఈఏ సందర్శించగలిగింది. కానీ ప్రధాన శుద్ధి కేంద్రాలకు ప్రవేశం లేకపోవడంతో యురేనియం నిల్వల స్థితి, సెంట్రిఫ్యూజ్‌ల పనితీరుపై స్పష్టత లేకుండా పోయింది. ఒప్పందం ప్రకారం ఇరాన్ వద్ద ఉన్న అధిక శుద్ధి యురేనియాన్ని తక్కువ స్థాయికి తగ్గించాలి. దీనిని డౌన్‌బ్లెండింగ్" ప్రక్రియగా పిలుస్తారు. దీనికి ప్రతిగా ఇరాన్ చమురు ఎగుమతులపై ఉన్న అమెరికా మద్దతు గల కొన్ని ఆంక్షలను సడలించేందుకు అంగీకారం కుదిరింది. ఒప్పందం విజయవంతం కావాలంటే ఐఏఈఏ తనిఖీలు అత్యంత కీలకంగా మారాయి. అందుకే గ్రోస్సీ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ట్రేడింగ్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులో అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్టు

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** నగర సైబర్ క్రైం పోలీసులు అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మోసాలకు సంబంధించిన పత్రాలను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు బుధవారం మీడియా కు వెల్లడించారు. నగరానికి చెందిన ఓ బాధితుడిని సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా ట్రేడింగ్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరగా అందుకు అతను అంగీకరించాడు. దీని తరువాత నేరగాళ్లు తెలివిగా వ్యవహరించి అతని నుంచి కోటీ 22 లక్షల 18 వేల రూపాయలను కాజేశారు. అనంతరం బాధితుడు లాభాలు కోరితే మరో 35 లక్షల రూపాయలు ఇవ్వాలని చెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా విచారించిన సైబర్ క్రైం పోలీసులు ఈ గోల్‌మాల్‌లో అనేక మంది వున్నట్లు తేల్చారు. ఇందులో బేగంపేట్, చం పాపేట్, వనపర్తికి చెందిన ముగ్గురితో పాటు ఎపిలోని అనంతపురం, మహారాష్ట్రలోని పర్భణికి చెందిన ఇ ద్దరిని సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందులో బేగంపేట్‌కు చెందిన వ్యక్తి మొదటి నిందితుడుగా తేలింది. మిగతా వారు అతనికి సహకరించారు. వీరంతా నకిలీ వాట్సాప్ సందేశాలు పంపుతూ దేశ వ్యాప్తంగా అమాయకులను దోచుకుంటున్నారని తేలింది. అరెస్టయి న వారిలో ఇద్దరు మ్యూల్ ఖాతాదారులుగా తేలింది. హైదరాబాద్‌లో గల యెస్ బ్యాంకులో ఓ ఖాతాను అరెస్టయిన ఓ నిందితుడు నిర్వహి స్తున్నాడు. ఈ ఖాతా ద్వారా నిందితుడు దేశ వ్యాప్తంగా 26 సైబర్ నేరాలకు పాల్పడినట్లు తేలింది. ఇందులో నాలుగు తెలంగాణలో వున్నాయి. కోటీ పది లక్షల 86 వేల తొమ్మిది రూపాయల లావాదేవీలు జరిగినట్లు తేలింది. ఇదంతా సైబర్ నేరాల తాలుకువేనని తేలింది. సెంట్రల్ బ్యాంకులో గల మరో ఖాతా అరెస్టయిన మరో నిందితుడిది. ఇతను మరో నిందితుడితో కలిసి ఈ ఖాతా ద్వారా దేశ వ్యాప్తంగా 18 కేసుల్లో నేరా లు చేశాడు. ఇందులో తెలంగాణలో వున్నాయి.

ఈ ఖాతాద్వారా మూడు కోట్ల 37 లక్షల రూపాయల నేరపూరిత లావాదేవీలు జరిగాయి. కాగా ఈ కేసులో మరి కొందరు నిందితులు అరెస్టు కావలసి వుందని డిసిపి అరవింద్ బాబు తెలిపారు. అరెస్టయిన ఆరుగురి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రెండు చెక్‌బుక్కులు, మూడు సిం కార్డులు జప్తు చేశారు. పరారీలో వున్న వారి కోసం గాలిస్తున్నారు.

# అణు విద్యుత్ రంగాన్ని విస్తరించేందుకు ఐఐటిహెచ్ శిక్షణ
### ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ బిఎస్ మూర్తి

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** అణు విద్యుత్ రంగాన్ని విస్తరింప చేసేందుకు హైదరాబాద్ ఐఐటీ కీలక నిర్ణయం తీసుకుంది. స్వచ్ఛ ఇంధన ప్రణాళికలలో భాగంగా భారతదేశం అణు విద్యుత్ ఉత్పత్తిని విస్తరించాలని చూస్తున్న నేపథ్యంలో, ఈ రంగంలో పెరుగుతున్న కార్మికశక్తి అవసరాలకు అనుగుణ:గా ఇంజనీర్లు, పరిశ్రమ నిపుణులను సిద్ధం చేసే లక్ష్యంతో ఒక ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఐఐటీ డైరక్టర్ బీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్‌పర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సిఈఈపిఎల్) సహకారంతో అభివృద్ధి చేయబడిన న్యూక్లియర్ టెక్నాలజీ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టిఓపి) ఐఐటి హైదరాబాద్ క్యాంపస్‌లో ఆగస్టు 3న ప్రారంభించనుందని అధికవర్గాలు వెల్లడించాయి. మూడు నెలల పాటు జరిగే ఈ రెసిడెన్షియల్ కోర్సు, పాల్గొనేవారికి అణు విద్యుత్ సాంకేతికతలు, ప్లాంట్ కార్యకలాపాలు, భద్రతా వ్యవస్థలు, నియంత్రణ అవసరాలపై అవగాహన కల్పించడానికి రూపొందించబడింది. ఈ కార్యక్రమం ఇంధన, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పాలుపంచుకునే ఇంజనీర్లు, కన్సల్టెంట్లు, తయారీ రంగ నిపుణులు, విద్యుత్ రంగ సిబ్బంది, ప్రభుత్వ రంగ కార్యనిర్వాహకులు, నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుంది. పాల్గొనేవారికి రియాక్టర్ ఫిజిక్స్, రియాక్టర్ ఇంజనీరింగ్, రేడియేషన్ షీల్డింగ్, అణు భద్రత, వ్యర్థాల నిర్వహణ, పరికరాలు మరియు నియంత్రణ వ్యవస్థలు, థర్మల్ హైడ్రాలిక్స్, నాణ్యత హామీ, అత్యవసర సంసిద్ధత, స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు (ఎస్ఎమ్మార్) వంటి అధునాతన సాంకేతికతలలో శిక్షణ ఇవ్వబడుతుంది. న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సి), భాభా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బిఎఆర్‌సి), న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్), భావిని వంటి అణుశక్తి విభాగ పర్యావరణ వ్యవస్థలోని సంస్థలతో అనుబంధం ఉన్న ఐఐటి హైదరాబాద్ అధ్యాపకులు, అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల భాగస్వామ్యంతో ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనుంది. భారతదేశ ఇంధన భద్రత మరియు స్వచ్ఛ ఇంధన పరివర్తనలో అణుశక్తి మరింత కీలక పాత్ర పోషిస్తుందని, ఈ రంగం భవిష్యత్ వృద్ధికి నైపుణ్యం కలిగిన మానవ వనరులు అత్యవసరం అని ఐఐటీ హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. భారతదేశ పౌర అణు రంగం విస్తరణలో ఒక కొత్త దశలోకి ప్రవేశి స్తోందని, దీనికి రియాక్టర్ కార్యకలాపాలు, తయారీ మరియు సంబంధిత సేవలకు మద్దతు ఇవ్వగల శిక్షణ పొందిన నిపుణులు అవసరమవుతారని సీఈఈపీఎల్ అణు విభాగంఅధ్యక్షుడు కమోడోర్ ఆర్.డి. మానే అన్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసిన అభ్యర్థులు ఐఐటి హైదరాబాద్, సిఈఈపిఎల్ నుండి సంయుక్త ధృవపత్రాన్ని అందుకుంటారు. అణుశక్తి రంగంలో పనిచేస్తున్న పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు మరియు విధాన రూపకర్తల మధ్య సహకారానికి ఈ చొరవ ఒక వేదికను కూడా అందిస్తుందని అధికారులు తెలిపారు.

# యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకం నేడు ప్రారంభం
### రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి ఆవిష్కరణ

**హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాలనలో ముఖ్యభాగస్వా ములైన ఉద్యోగు సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకంతో అతిపెద్ద భరోసా కుటుంబాలకు కలిగించబోతున్నది. ఉద్యోగులకు సామాజిక భద్రత కలిగించడానికి కోటి నుంచి కోటిన్నర రూపా యల వ్యక్తిగత ప్రమాద మరణ బీమా కవరేజి అందుబాటులోకి తీసుకొని వస్తున్నారు. ఈమేరకు రవీంద్రభారతిలో గురువారంసాయంత్రం 14 బ్యాంకులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నారు. ఈసందర్భంగా తెలంగాణ గజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ రావు ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్ సంయుక్తంగా హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

# తెలంగాణ ఆదివాసి ఆధ్వర్యంలో నేటి నుంచి బస్సుయాత్ర
### సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ఎస్టీ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్,జూన్24,ప్రభాతవార్త:** తెలంగాణ ఆదివాసి విభాగం ఆధ్వర్యంలో గాంధీ భవన్ నుండి మొదటి దపా బస్సుయాత్ర గురువారం ప్రారంభం అవుతుందనీ, జూన్30 వరకు ఐదు రోజులు బస్సుయాత్ర కొనసాగుతోందని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ తెలిపారు. గాంధీభవన్‌లో ఆయన విలేఖరులతో బుధవారం మాట్లాడుతూ ఉదయం పదిన్నర గంటలకు బస్సు యాత్రను ప్రారంభించనున్న పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ జూపల్లి కృష్ణారావు హాజరవుతారనీ ఆయన తెలిపారు. గండి మైసమ్మ దర్శనము, కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి మీటింగ్ అచ్చంపేట ,నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలలో యాత్ర జరుగుతుందనీ తెలిపారు తెలంగాణలో లంబాడి, ఎరుకల, యానాది, గిరిజనలను ఎస్టీలో జాబితాలో చేర్చి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా బస్సు యాత్ర చేపడుతున్నామని వివరంచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సూచన మేరకు బస్సు యాత్ర చేపట్టామని చెప్పారు. ఇందిరాగాంధీ 1976 లో ఏరియా రిమూవ్ రిస్ట్రిక్షన్ ఆక్ట్ తీసుకొచ్చి తెలంగాణలో ఉన్న లంబాడి, ఎరుక, యానాది గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్లను కల్పించిందనీ తెలిపారు. ఇందిరా గాంధీ రిజర్వేషన్ ఇవ్వడం ద్వారానే గిరిజను లందరం ఉద్యోగాలు చేస్తూ ఉన్నత స్థానాల్లో ఉన్నామనీ అన్నారు. ఇందిరాగాంధీ రిజర్వేషన్ ఇవ్వకపోతే మా పరిస్థితి దయనియంగా ఉండేదనీ తెలిపారు.

బస్సు యాత్రకు పెద్ద ఎత్తున గిరిజనుల హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ లంబాడి, ఎరుకల, యానాది తెగల కార్పొరేషన్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా గురువారం నుంచి ప్రారంభం కానున్న ఆ వర్గాల కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బస్సు యాత్ర ఉద్దేశాన్ని సిఎం రేవంత్‌రెడ్డిని ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామ చంద్రునాయక్, ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ కలిసి వివరించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

# రైతు బంధు నిల్..రాహుల్ బంధు ఫుల్
### మహిళల ఖాతాల్లో ఓ లక్ష వేసినా రాజకీయాల నుంచి తప్పుకొంటా: కెటిఆర్

**సత్తుపల్లి, జూన్ 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ వల్ల ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పాలనలో ప్రజలకు చేసింది శూన్యం తప్ప కాంగ్రెస్ వల్ల ఒరిగింది ఏమీ లేదని బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. సత్తుపల్లి ఎంఆర్ గార్డెన్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ ఓటర్ల విధానంపై నాయకులకు, కార్యకర్తలకు, బూత్ మిటీల వారికి కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు చేతిలో పవర్ ఫుల్ శాఖలు ఉన్నప్పటికీ జిల్లాకు చేసింది శూన్యం అని ఈ సందర్భంగా జిల్లా మంత్రులైన బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,తుమ్మల నాగేశ్వరరావులను ఆయన ఎద్దేవా చేశారు. రైతుబంధు



బుధవారం సత్తుపల్లిలో మాట్లాడుతున్న కెటిఆర్

పేరుతో కెసిఆర్ 72లక్షల మంది ఖాతాలో 73 వేల కోట్లు వేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బంధుని బొంద పెట్టి 72 సార్లు ఢిల్లీకి పోయి రాహుల్ గాంధీ బంధు ప్రవేశపెట్టారని కేటీఆర్ పేర్కొన్నారు. రెగ్యులర్ సీఎం కాదు, రెన్యువల్ సీఎం రేవంత్ రెడ్డి అని కేటీఆర్ అన్నారు. కెసిఆర్ 11 సార్లు రైతులు ఖాతాలో పెట్టుబడి సాయం చేశారని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. అన్ని రకాల వడ్లకు బోనస్ అని ఎన్నికల్లో మాట ఇచ్చి చివరకి ఏడు రకాల కుదిరించి దగాచేశారని, సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయి కాబట్టి కొను గోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు దొరకట్లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాలో రాజీవ్ సాగర్ ,ఇందిరా సాగర్ పేరిట, కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని, ఖమ్మం జిల్లాలో కెసిఆర్ ఆనాడు ప్రతి నీటి బొట్టు ఒడిచిపెట్టి పదివేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు చేపట్టి ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమం చేపట్టి ఎనిమిది వేల కోట్ల రూపాయలు బిఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందని, ఇట్టి ప్రాజెక్ట్ ని జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తానే అభివృద్ధి చేశానని ఓ పంపు ప్రారంభించి దాని దగ్గర నీళ్లు చల్లుకొని గొప్పలు చెప్పుకుంటున్నారని కేటీఆర్ హేళన చేశారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**
Tender Notice No.11/2026-27/SE(North)/EE (North)/DB/GVMC/ Dt:22-06-2026 (Item-01)
Number of Works : 1 Nos (One)
Value of Works (ECV) : Rs.1,20,97,598/-
Downloading Starting Date : 23-06-2026 @ 10.00 P.M.,
Date of Opening Tenders : 08-07-2026 @ 02.00 P.M.,
Further details at http://www.apeprocurement.gov.in
O/o the Superintending Engineer (North), GVMC For Commissioner, GVMC

**NOTICE** MAHADHAN

In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following Imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr. No. | Particulars / Grade | NPK 16-8-34 | NPK 8-52-17 | NPKFe 0-42-47-2.8 | NPKS 30-0-0-5 | NPKS 24-0-12-6 |
|---|---|---|---|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 16 | 8 | 0 | 30 | 24 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 8 | 52 | 42 | 0 | 0 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 34 | 17 | 47 | 0 | 12 |
| 5 | Sulphur (as S) percent by weight, minimum | 0 | 0 | 0 | 5 | 6 |
| 6 | Ferrous Iron (as Fe) percent by weight, minimum | 0 | 0 | 2.8 | 0 | 0 |
| 7 | Total Chloride per cent by weight, maximum | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 |
| 8 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 9 | Sodium as NaCl percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 10 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 |
| 11 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 |
| 12 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 |

**Salient Features:**
1. 100% Water Soluble.
2. Improves quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar application.

**Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.**


*Manufactured / Imported & Marketed by -*
**MAHADHAN AGRITECH LIMITED**
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036, Maharashtra.
www.mahadhan.co.in

వార్త


> విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.
>
> - లావోసు

# బ్లాంక్‌చెక్ ఫీ 'జులుం'!

తామేం చేసినా చెల్లుతుంది కనుక ఎవరు నవ్వుకున్నా, విమర్శలు రువ్వుకున్నా తమకేటి సిగ్గు అన్న చందాన తెలుగు రాష్ట్రాల్లో విద్యావ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ప్రధానంగా విద్యార్థుల ఫీజుల విషయంలో కళాశాల యాజమాన్యాలు ప్రవర్తిస్తున్న తీరు చూస్తే ఒక భావకవి కలం లోంచి వచ్చిన పద విన్యాసమొకటి గుర్తొస్తోంది. తామేదో విద్యాసేవ చేస్తున్నట్లు గొప్పగా చెప్పుకునే ఆయా విద్యాసంస్థలపై వస్తున్న అభియోగాలు చూస్తోంటే నవ్వుకోవాల్సిందే! అందరికీ తమ తీరు తెలిస్తే నవ్వుల పాలవుతామనే ఆలోచన కూడా లేకుండా ఫీజుల వసూళ్లలో విచ్చలవిడిగా విధానాలు అవలంబిస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ తదితర వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌లను అడిగితే ఆయా కళాశాలల యాజమాన్యాలు పెడుతున్న షరతులు ఏ విద్యార్థికీ సంతృప్తి నిచ్చేవి కావు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో చదువుకున్న విద్యార్థులు తాజాగా కాలేజీ యాజమాన్యాలకు తమ అసలు ధృవపత్రాల కోసం బ్లాంక్ చెక్‌లు, ప్రామిసరీ నోట్లు సమర్పించుకోవాల్సి వస్తోంది. తమ కోర్సు పూర్తి చేసుకున్నాక ఉన్నత విద్యాకోర్సుల్లో చేరాలంటే లేదా విదేశీ చదువుల కోసం ముందుకు సాగాలంటే ఒరిజినల్ డిగ్రీ పత్రాలు కావాలి. పైగా తాము ప్రస్తుతం చదువుతున్న కళాశాలలోనే క్యాంపస్ సెలక్షన్‌లలో ఎంపికయినా కూడా వారు ఉద్యోగ ప్రస్థానంలో అడుగు పెట్టే సందర్భంగా ఒరిజినల్స్ నమోదు చేయించుకోవాలి. అందుకోసం వాటిని దఖలు పరచాలి. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో విడుదల చేసిన పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో ఈ యేడాది ఇంజినీరింగ్ ఇతర వృత్తి విద్యా కోర్సులో పూర్తయిన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లు ఇవ్వలేదు. విద్యార్థి కోర్సులు పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వం సదరు విద్యార్థుల అక్కౌంట్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయకపోవడంతో ఈ యేడాది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. ప్రభుత్వం నుంచి ఆ బకాయిలను వసూలు చేసుకోలేక విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపెడితే తమ ఖజానాలోటు నిండుతుందని ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు భావించిన తక్షణమే అమలులో పెట్టాయి. అందుచేతనే ఫీజులు చెల్లిస్తే ఒక పద్ధతి, చెల్లించకపోతే మరో పద్ధతిని అనుసరిస్తున్నాయి. ప్రభుత్వ భరోసాతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు మరో మార్గాంతరం లేక లబోదిబో అంటున్నారు. ఫీజు బకాయిలు చెల్లించాల్సింది ప్రభుత్వం కానీ ఒరిజినల్ సర్టిఫికేట్‌లు అడిగితే, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి ఫలానా తేదీలోగా ఫీజు రాకపోతే తామే చెల్లిస్తామన్న హామీ పత్రాలతోపాటు అందుకు చెల్లుబాటు ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్‌లు రాయించుకుంటున్నారు. ఇదో దుర్విధానం. ఇలాంటి విధానాలను నిలుపుదల చేయడం కోసం రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేకమైన చర్యలేమీ తీసుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు ఈ యేడాది 2026-27విద్యాసంవత్సరం నుంచి ఫీజులను వసూలు చేసి, ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేసినప్పుడు విద్యార్థులకు ఆ సొమ్ము తిరిగి చెల్లించాలని సూచించింది. అసలు చదువుకునే స్తోమత లేని విద్యార్థుల కోసమే ఫీజురీయింబర్స్‌మెంట్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టగా ఇప్పుడా విధానాన్ని మార్చేస్తే ఆ విద్యాపథకం స్ఫూర్తి దెబ్బతింటుంది. ఈ పథకంతో ఇప్పటికే గత పదేళ్లుగా ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులలో చేరితమ జీవితాలు పండించుకుంటున్నారు. ఇప్పుడా పథకాన్ని ఆపినా, హైకోర్టు సూచనలతో ఎవరి ఫీజులు వారు కట్టేసి మళ్లీ ప్రభుత్వం నుంచి విద్యార్థులు వసూలు చేసుకోవడం సరైనపద్ధతి కాదు. దాంతో ఫీజులు కట్టుకోలేనివారు, నిరాశానిస్పృహలతో తమ జీవితాలను వెలిబుచ్చాల్సి ఉంటుంది. హైకోర్టు ఉత్తర్వులు వెంబడి ప్రభుత్వం కూడా ఓ విచిత్రమైన జి.ఓ ఇచ్చింది. 2026-27 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు నేరుగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. కానీ ప్రభుత్వం ప్రతి యేటా ఏయే సమయాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించగలదో స్పష్టత లేక హైకోర్టు ఎలాంటి కొత్త ఉత్తర్వులు ఇవ్వలేదు. పాత పద్ధతి అమల్లో ఉన్నట్లే. ఈలోగా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చెల్లించే విషయంలో చొరవ చూపలేదు. కళాశాలలు చేసేది లేక విద్యార్థుల పేరిట ఉన్న ఫీజు బకాయిలు వారి నుంచే వసూలు చేయాలన్న ధోరణితో బ్లాంక్ చెక్‌లు, ప్రామిసరీ నోట్లు సేకరణ విధానాన్ని చేపట్టింది. ఇలాంటి విధానం దేశంలోని ఏ యూనివర్సిటీ, కళాశాలలు అవలంబించడం లేదు. తెలంగాణ కళాశాలలు ఎన్నుకున్న పద్ధతి చర్చనీయాంశమైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే తాము కళాశాలలను నడపలేమని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ముందుగానే హెచ్చరించాయి. బంద్ పాటించడంతో ప్రభుత్వం కొంతమేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసింది. గత మూడేళ్లుగా ఆయా కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజుబకాయిలు దాదాపు పదివేల కోట్ల రూపాయల వరకు ఉండగా కంటి తుడుపుగా రూ.400 కోట్లు విడుదల చేసి ప్రభుత్వం మిన్నకుంది. ఇక కొత్త విద్యాసంవత్సరం మొదలయ్యింది. కథ మామూలే. పెరిగిపోతున్న బకాయిలు వచ్చే మార్గం లేదు. కనీసం విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లకు లింకు పెడితే నైనా కొన్ని నిధులు రాబట్టుకోగలమని కళాశాల యాజమా న్యాలు చేపట్టిన వసూళ్ల విధానం విద్యార్థుల విదేశీ చదువులు, ఉపకార వేతనాలకు దూరమయ్యే పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వ భరోసాతో విద్య పూర్తయిందన్న ఆనందమే లేకుండా మరో ఉన్నత చదువులకు ఆటంకాలేర్పడుతున్నాయని ఆందోళనలో గత యేడాది విద్యాయాత్ర ముగిసింది.



> మాటలో నిజాయితీ, స్పష్టత ఉంటే అవతలివారు ఇట్టే ఆకర్షితులవుతారు.
>
> ప్లినీ



> సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.
>
> సోక్రటీస్

## ప్రజావాక్కు



### ముప్పుగా మారుతున్న ఇ-వ్యర్థాలు

ఆధునిక ప్రపంచంలో ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం వేగంగా పెరుగుతోంది. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టెలివిజన్లు,బ్యాటరీలు, గృహోపకరణాలు వంటి పరికరాలు కొంతకాలం తరువాత ఈవ్యర్థాలుగా మారుతున్నాయి. ఈవ్యర్థాల పరిమాణం రోజురోజుకు పెరుగుతుండటం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారింది. ఈవ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం వంటి ప్రమాదకర లోహాలు ఉంటాయి. వీటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకపోతే నేల,నీరు,గాలి కలుషితమవుతాయి.ఫలితంగా శ్వాసకోశవ్యాధులు,నాడీ సంబంధిత సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా అనధికారిక రీసైక్లింగ్ కేంద్రాల్లో పని చేసే కార్మికులు ఎక్కువగా ఆరోగ్యపరమైన ప్రమాదాలకు గురవుతున్నారు.ఈవ్యర్థాల సమస్యకు ప్రధాన కారణాలు తరచుగా కొత్తపరికరాలను కొనుగోలుచేయడం, పాత పరికరాలను నిర్లక్ష్యంగా పారవేయడం, అవగాహన లోపం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఈవ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి అధికారిక రీసైక్లింగ్ కేంద్రాలకు అందించాలి.ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ఈవ్యర్థాల ముప్పును తగ్గించవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వృద్ధ నేతలు తప్పుకోవాలి

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అపారమైన తెలివితేటలు శక్తి సామర్థ్యాలు గల యువకులు మనదేశంలో ఎంతో మంది ఉన్నారని వారు రాజకీయాల్లోకి వచ్చి చురుకైన పాత్ర పోషించాలని అత్యున్నత పదవులను అధిష్టించాలని మాటల్లోనూ ఉపన్యాసాల్లోను చెబుతున్నారు కానినేతలు ఇందుకు వ్యతిరేకంగా ఉంటున్నాయి. యువతకు అవకాశం ఇవ్వటం లేదు. ఎంత వయసు వచ్చినా పదవులను పట్టుకుని వేలాడుతున్నారు.

- శాస్త్రి, హైదరాబాద్

### హోటళ్లు పరిశుభ్రత పాటించాలి

నగర పరిసర ప్రాంతాల్లో హోటళ్లు కనీస పరిశుభ్రత పాటించకుండా టిఫిన్స్ చేస్తుండడం వలన వాటిని తినే ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. కావున ఎక్కడికక్కడ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకొని ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### రిజర్వేషన్లు మన ప్రతిభకు గొడ్డలిపెట్టు!

ప్రతిభకు పట్టం కట్టడం అంటే భారతదేశాన్ని అభివృద్ధి పథంలో శరవేగంగా పయనింపచేయడం! రిజర్వేషన్లకు రాం రాం పాడి,మంగళం పాడి,ప్రతిభే కొలమానంగా మన ప్రభుత్వాలు ముందుకు సాగేలా ఒక పెద్దఎత్తున ఉద్యమానికి అంకురార్పణ గావించేలా ప్రజా సంఘాల వారు మేధావి వర్గాల వారు తీవ్ర కృషి సల్పాలి! ఎందుకంటే అగ్రవర్ణాల వారికి 100 ర్యాంకు వచ్చిన దక్కనిఫలం, రిజర్వేషన్ వున్నవారికి 5000 ర్యాంకు వచ్చిన ఫలం దక్కడం ఓ అమానుషం,ఓ తీరని అన్యాయం క్రిందకు వస్తుంది! ఇప్పటికైనా కుల,మతాలకు అతీతంగా ప్రతి ఒక్క ప్రజానీకం రిజర్వేషన్లకు శాశ్వత విరామం ప్రకటించేలా ప్రతిభ వున్నవారికి పట్టాభిషేకం చేసేలా తీవ్ర కృషి చేయాలి.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### చరిత్రను వక్రీకరిస్తున్నారు

దేశం కోసం ఎంతో చేసి ఎన్నో కష్టాలు పడి దేశానికి ప్రధాని అయిన వారు దేశ ప్రజలకు అద్వితీయమైన సేవలు అందించి ఏనాడు గొప్పలు చెప్పుకోని వారు ప్రచార ఆర్భాటాలు ఇష్టపడని వారు సంపన్న కుటుంబంలో పుట్టి కూడా అతి నిరాడంబరంగా జీవించిన వారు దేశ ప్రథమ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి 17 సంవత్సరాల పాటు దేశాన్ని పాటించిన వారు నెహ్రూ. ఆయన పాలనా కాలాన్ని అధిగమించామని గొప్పలు చెప్పుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారు. మంచిదే సుదీర్ఘకాలం పాటు దేశానికి సేవ చేసే అదృష్టం కొందరికే దక్కుతుంది. ప్రధాన మంత్రి పదవిలో ఉంటూ తుది శ్వాస విడిచే అదృష్టం కూడా కొందరికే దక్కుతుంది.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### ప్రచార సాధనాలు

ధరల పెరుగుదల, నిరుద్యోగం, పరీక్షలు సక్రమంగా నిర్వహించలేకపోవటం దారుణంగా పతనమవుతున్న రూపాయి విలువ ఆర్థికంగా చితికిపోతూ అప్పుల పాలవుతున్న దేశం ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు. వీటిని విపక్షాలు వేలెత్తి చూపుతున్నాయి. ప్రభుత్వ అసమర్థతను విమర్శిస్తున్నాయి. అయితే పాలకులు తమ వైఫల్యాలను అంగీకరించడం లేదు. అంతా బాగుందని,అందరూ హీపీగాఉన్నారని ఎవరికి ఎలాంటి సమస్యలు లేవని కబుర్లు చెబుతూ ప్రజలను మోసం చేస్తోంది. అంతా తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. ప్రసార మాధ్యమాలైన రేడియో, టివిలు కూడా ప్రభుత్వ అనుకూలవార్తలు ప్రసారం చేస్తున్నాయి.

-మిథునం, హైదరాబాద్

# 'విలువల విద్య'తోనే యువతకు భవిత

**ఒక సమాజం ఆమోదించి, అంగీకరించిన ఆదర్శాలు, నియమాలు, ప్రవర్తనలనే 'విలువలు'అంటారు. మంచి విలువలు గల వ్యక్తుల వలనే మంచి సమాజ నిర్మాణం అవుతుంది. అదే మన దేశ భవిష్యత్తు. విలువలను విద్యారూపంలో బోధన ద్వారా పెంపొందించటం ఒక విధానమైతే ఆదర్శప్రాయులు వాటిని అనుసరణీయం ద్వారా సమాజానికి నేర్పించగలగడం అనేది మరో గొప్ప విధానం. కుటుంబ పెద్ద ద్వారా కుటుంబ విలువలు, సమాజంలోని పెద్దల ద్వారా సామాజిక విలువలు,రాజకీయ నాయకుల ద్వారా రాజకీయ విలువలు, స్వీయనియంత్రుత్వ విలువలను మీడియా, సోషల్ మీడియా వారు అనుసరించి నిరూపించగలిగితే తదనంతరం వచ్చేవివిధ వ్యవస్థలలోని తరానికి మార్గదర్శకులుగా, గురువుగా విలువలను అనుసరిస్తున్న వారే ఉండవచ్చనే అభిప్రాయం కలుగుతుంది విశ్లేషకులకు.**

వి వి రమణ నాయక్

ఒక దేశం అన్ని రకాల ప్రగతి ఆ దేశ విలువల వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. అంటే ఆ దేశ సాంఘిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధిలన్నీ ఆ దేశ 'విలువల విద్యపై' ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. చరిత్ర కూడా ఇదే చెబుతుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపాన్ సర్వ నాశనమయినాయి. జపాన్లోని హిరోషిమా నాగసాకి పట్టణాలు ఆటంబాంబులకు గురి అవ్వగా జర్మనీ తూర్పు జర్మనీ పశ్చిమ జర్మనీగా విడగొట్టబడింది. కానీ ఆ రెండు దేశాలు అనుసరించిన 'సామాజిక బాధ్యత విలువల' వలన కేవలం రెండు దశాబ్దాలలోనే అవి రెండు అభివృద్ధి చెందాయి. అదే విధంగా 1948లో ఏర్పడిన తక్కువ జనాభాగా ఉన్న ఇజ్రాయిల్ దేశం సైతం రెండు దశాబ్దాలు వ్యవధిలోనే చాలా శక్తివంతమైన దేశంగా మారించింది. దీనికి కారణం ఆ దేశ ప్రజలు అనుసరించిన 'విలువలతో కూడిన అంకితభావం'. చరిత్ర చెబుతున్న అలాంటి విలువలు నేడు మన దేశంలో కనబడుతున్నాయా అని ప్రశ్నించుకోవాల్సి వస్తుంది. వాస్తవానికి నేడు మన సమాజంలో కుటుంబం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, మీడియా, సోషల్ మీడియా లాంటి వ్యవస్థలలో విలువల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. ఈ విలువల సంక్షోభం నుండి బయటపడే మార్గాన్ని నేడు మనం సవాళ్లుగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. ఈ విలువలను పాఠశాల విద్యార్థి దశ నుండే అనుసరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. విద్యార్థి దశ నుండే 'విలువలతో కూడిన విద్యను' గురువులు అందించేందుకు సంసిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలం తల్లిదండ్రుల సహకారం గురువులకు అందడం లేదనేది సత్యవాక్కు. నేటి తల్లిదండ్రులు తమ బిడ్డలను విద్యాసంస్థలలో చేర్పించుతున్న సందర్భంలో గురువులను మార్కులు, ర్యాంకులు మాత్రమే అడుగుతున్నారు కానీ మంచి విలువలను నేర్పించండి అని అడగడం లేదు. వాళ్ళు మార్కులు, ర్యాంకులు మాత్రమే తమ పిల్లల భవిష్యత్తు అనే భ్రమలో నుండి బయటపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎందుకంటే స్వతంత్ర్యం వచ్చే నాటికంటే నేడు మన దేశ అక్షరాస్యత రేటు సుమారుగా 80 శాతం ఉన్నప్పటికీ విద్యావంతులతో పాటు అవినీతి పరుల రేటు కూడా పెరుగుతున్నది అని కొన్ని సర్వేల ప్రకారం తెలుస్తుంది. అవినీతి గల దేశాల జాబితాలో మన దేశం రేటు కూడా పెరిగింది కదా! అనగా విలువలతో కూడిన విద్యను బోధించకుండా తల్లిదండ్రుల కోరిక మేరకు కేవలం మార్కులు, ర్యాంకుల కోసం మాత్రమే బోధన జరుగుతుంది కాబట్టి అక్కడ విలువల బోధన లేనందున అక్షరాస్యతతో పాటు అవినీతి కూడా పెరిగినట్టే కదా! కాబట్టి ప్రస్తుత అకాడమిక్ సంవత్సరాన్ని పురస్కరించుకొని తరగతులు ప్రారంభ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు గురువులను మార్కులు, ర్యాంకులు మాత్రమే కాకుండా మంచి విలువలను నేర్పించగలరని అడగటం చేస్తే అది దేశ భవిష్యత్తుకు మంచిప్రణాళికగా భావించవచ్చనే అభిప్రాయం కలుగుతుంది. గత అమెరికా అధ్యక్షుడు ఇదే విధా నాన్ని అనుసరించారు. మా బిడ్డలను తమరి చేతులలో ఉంచుతున్నందున మంచి 'విలువలతో కూడిన విద్యను' బోధించండనీ వారి గురువులను కోరారు. ఉచితంగా లభించే వంద రూపాయల కంటే కష్టపడి సంపాదించే ఒకరూపాయి విలువైనదని, ఓటమిని తట్టుకోవడం గెలుపును ఆస్వాదించటం, అసూయద్వేషాలకు దూరంగా ఉంచడం, ప్రకృతిని ప్రేమించడం మోసంతో వచ్చే గెలుపు విజయం కాదని 'విలువలతో



కూడిన విద్యను' మా బిడ్డలకు నేర్పించగలరని గురువులను కోరడం జరిగింది. విద్యార్థుల కంటే తల్లిదండ్రులకు ఈ విలువల విద్య బోధించాలేమో అనే ఆలోచనలను కొన్ని సందర్భాలను గమనిస్తుంటే అనిపిస్తుంటుందని విద్యావేత్తలు వాపోతున్నారు. మార్కులు, ర్యాంకులు మాత్రమే జీవితం కాదని ఈ సమాజంలోని తల్లిదండ్రులు తెలుసుకోవాల్సి ఉన్నది.' నీవు నీతిలేని విద్యను బోధిస్తున్నావు అంటే తెలివిగల దయ్యాలను తయారు చేస్తున్నారని అర్థం' అని విలువల్లేని విద్యగురించి అంటారు డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్. ఒక సమాజం ఆమోదించి, అంగీకరించిన ఆదర్శాలు, నియమాలు, ప్రవర్తనలనే 'విలువలు'అంటారు. మంచి విలువలు గల వ్యక్తుల వలనే మంచి సమాజ నిర్మాణం అవుతుంది. అదే మన దేశ భవిష్యత్తు. విలువలను విద్యారూపంలో బోధన ద్వారా పెంపొందించటం ఒక విధానమైతే ఆదర్శప్రాయులు వాటిని అనుసరణీయం ద్వారా సమాజానికి నేర్పించగలగడం అనేది మరో గొప్ప విధానం. కుటుంబ పెద్ద ద్వారా కుటుంబ విలువలు, సమాజంలోని పెద్దల ద్వారా సామాజిక విలువలు,రాజకీయ నాయకుల ద్వారా రాజకీయ విలువలు, స్వీయనియంత్రుత్వ విలువలను మీడియా, సోషల్ మీడియా వారు అనుసరించి నిరూపించగలిగితే తదనంతరం వచ్చేవివిధ వ్యవస్థలలోని తరానికి మార్గ దర్శకులవుతారు. 'కుటుంబ విలువల' విషయానికి వస్తే 'నాకు గొప్పతల్లిని ఇవ్వండి నేను గొప్పజాతిని ఇస్తాను' అని అంటారు నెపోలి యన్. అంటే మంచి విలువలను పాటించే తల్లిదండ్రుల వలనవారిని చూసి అనుసరించే వారి బిడ్డలు అదేవిధంగా మంచి విలువలతో పెరిగి జాతి నిర్మాణంలో భాగస్వాములు కాగలరు. ఇలాంటి విలువలు బోధన ద్వారా కాకుండా కుటుంబ పెద్దలను చూసి అనుసరించి నేర్చుకునే విలువలు ఇవి. నేటి సమాజంలో రాజకీయ విలువల సంక్షోభాన్నిఎదుర్కొంటున్నాము. ప్రస్తుత నాయకులు మంచి విలువలు గల రాజకీయ విధానాన్ని అనుసరించగలిగితే తర్వాతతరం వారికి ఇది ఆదర్శప్రాయంగా ఉండగలుగుతుంది. రాజకీయ విలువలు అనుసరించే వారిని చూసి ఆచరణ ద్వారా నేర్చుకోగల ఈ రాజకీయ విలువలు యువ రాజకీయ నాయకులకోసం ఇది అత్యంత అవసర మైనది.ఉదాహరణకు.. 1965 సంవత్సరంలో పాకిస్తాన్ భారత్ పై దాడి చేసింది. దీనికి ప్రతిగా భారత్ జవాబు మాత్రమే చెబుతుంది. ఈ సందర్భంలో అమెరికా భారత్ పై ఒత్తిడి చేస్తూ యుద్ధం ఆపేయాలని లేనిచో భారత్ కు సరఫరా చేయవలసిన ధాన్యాన్ని ఆపేస్తామని బెదిరింపులు చేస్తున్న సందర్భం అది. వాస్తవానికి భారత్ పాక్‌కు జవాబు మాత్రమేఇస్తుంది.ఇది 'స్వాభిమానసమస్య'. ఆ సందర్భంగా దేశ ప్రధాని అయిన లాల్ బహదూర్ శాస్త్రి దేశ ప్రజలకు ఒక పూట భోజనం మానేయండి అనే సందేశం ఇవ్వాల్సివచ్చిన పిమ్మట, ముందు రోజు అనగా ఆదివారం సాయంకాలం తన ఇంటిలో భోజనం వండనీయకుండా తను వారి పిల్లలతో పాటు ఉపవాసం చేయాల్సి వచ్చింది.వారు, వారి పిల్లల ఉపవాస ప్రయోగ ప్రోత్సాహంతో మరుసటి రోజు సోమవారం జాతినీ ఉద్దేశించి ఒక పూట ఉపవాస మంత్రాన్ని దేశ ప్రజలు పాటించాల్సిఉందని పిలుపునిస్తూ జై జవాన్ జై కిసాన్ నినాదాన్ని ఇచ్చారు. నేడు భారత్ ఇలాంటి 'విలువలతో కూడిన రాజకీయాన్ని' కోరుకుంటుంది. ఈ విధానాలు బోధనతో మాత్రమే కాకుండా 'విలువలు కలిగిన నాయకులను' అనుసరించటం ద్వారా నేర్చుకునే రాజకీయ విలువలు ఇది. సుప్రీంకోర్టు 2002 ఇచ్చిన తీర్పులో విద్యార్థులకు "విలువలతో కూడిన విద్య" అందించేందు కు అన్ని మతాలలోని మానవతా విలువలను విద్యార్థులకు బోధించాలని వ్యక్తులు ఉన్నతులు కావాలంటే 'విలువల బోధన అవసరమని స్పష్టంగా తెలిపింది. ప్రస్తుతం మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండే 'విలువల విద్య' అవసరమని భావించి గురువుల సహకారంతో మంచి విలువల విద్య విధానాన్ని మొదటి తరగతి నుండి నేర్పించేందుకు తగువిధంగా సమాయాత్తమై ఉన్నదానేది చాలా గొప్ప విషయంగా భావించవచ్చు. ●

# ప్రజారోగ్యాన్ని మింగేస్తున్న కల్తీ మాఫియా!

వనకల్ల వీరప్ప

నిత్యం మనం తీసుకునే ఆహారం అమృతం కావాలి, కానీ నేడు అది నెమ్మదిగా ప్రాణాలను హరించే విషంగా మారుతోంది. లాభాపేక్ష అనే రాక్షసి కోరల్లో చిక్కుకున్న ఆహార రంగం, సామాన్యుడి ఆరోగ్యంతో చెలగాట మాడుతోంది. 'సర్వం కల్తీమయం' అన్నది కేవలం ఒక నానుడి కాదు, నేడు అది మన కళ్లముందు కదలాడుతున్న భయంకర వాస్తవం. భారతదేశంలో సామాన్య ప్రజలజీవన ప్రమాణాలు పెరగడం అటుంచితే, కనీస ఆరోగ్య భద్రత కరువవ్వడం ఆందోళన కలిగించే అంశం.వాతావరణ కాలుష్యంఒకవైపు ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు మనం తినేఆహారంలో చేరుతున్న రసాయనాలు నిశ్శబ్దంగా మృత్యువును ఆహ్వానిస్తున్నాయి.ఉదయం నిద్రలేచిన దగ్గరి నుండి వాడే టూత్‌పేస్ట్, పాలు, టీ పొడి, వంట నూనె, పప్పు ధాన్యాలు.. ఇలా ఒకటేమిటి, ఏ వస్తువును తాకినా అందులో కల్తీ ఉందన్న వార్తలు వినియోగదారుడి వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. గతంలో కల్తీ అంటేఏదో ఒక వస్తువులో తక్కువ నాణ్యత గల పదార్థాలనుకలపడం అని అనుకునేవారు. కానీ నేడు అది ఒక వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందింది.ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన దాడులు చూస్తుంటే, ఒక భారీ నెట్‌వర్క్ దీని వెనుక ఉన్నట్లు అర్థమవుతోంది. సూరత్ వంటి నగరాల్లో యూరియా, డిటర్జెంట్, ప్రాణాంతక రసాయనాలతో 'సింథటిక్ పాలు' తయారు చేయడం మానవత్వం లేని చర్య. పన్నీర్, నెయ్యిలో జంతువుల కొవ్వును కలపడం వంటి ఘటనలు ఆధ్యాత్మిక భావనలతో పాటు ఆరోగ్య భద్రతను కూడా దెబ్బతీస్తున్నాయి. ఢిల్లీలో వెలుగులోకి వచ్చిన నకిలీ టూత్‌పేస్ట్ తయారీ కేంద్రం మనదైనందిన జీవితంలో ఏవస్తువునూ నమ్మలేమని నిరూపించింది. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో నకిలీ ప్యాకింగ్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. గడువు ముగిసిన సాఫ్ట్ డ్రింక్స్, ప్యాక్డ్ ఫుడ్స్‌పై పాత తేదీలను చెరిపివేసి కొత్తతేదీలు ముద్రించడం ద్వారా వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.ప్రస్తుత ఆధునిక సమాజంలో నగర జీవనం చాలా వేగంగా మారిపోయింది. ఉరుకులు పరుగుల జీవితంలో సొంతంగా వంట చేసుకునే తీరికలేక చాలామంది బయటి ఆహారంపై ఆధారపడుతున్నారు. బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ అవుట్‌లెట్లు నేడు ప్రతిగల్లీలోనూ దర్శనమిస్తున్నాయి. అయితే, ఈ కేంద్రాల్లో శుభ్రత అనేది మచ్చుకైనా కనిపించడం లేదు.హైదరాబాద్ వంటి నగరాల్లో వెలుగులోకివచ్చిన అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాల పరిస్థితి దారుణం. కుళ్ళిన అల్లం, వెల్లుల్లికి రంగులు, రసాయనాలు కలిపి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో హోటళ్లకు సరఫరాచేస్తున్నారు. ఇలాంటి పదార్థాలను వాడటం వల్ల హోటల్ ఆహారం రుచి కరంగా ఉన్నట్లు అనిపించినా, అది లోలోపల అవయవాలను చిత్తు చేస్తోంది. కల్తీ ఆహారం అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదు, ఇది దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సంక్షోభం. కల్తీ వల్ల కలిగే నష్టాలు తక్షణమే బయటపడవు, కానీ దీర్ఘకాలంలో అవి ప్రాణాంతకమవుతాయి.ఆహారభద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా', ఆరోగ్యశాఖలు క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నాయని చెప్పక తప్పదు.తనిఖీలు కేవలం పండుగ సీజన్లకు లేదా ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే పరిమితం కాకూడదు. ప్రభుత్వం ఎన్నిచట్టాలు చేసినా,ప్రజల్లో చైతన్యం లేనిదే మార్పు రాదు.ఏదైనా వస్తువు కొనేముందు ఎక్స్‌పైరీ డేట్, తయారీదారు వివరాలు, ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లోగోను తప్పనిసరిగా చూడాలి. మనం ఇప్పుడే మేల్కోక పోతే, రేపటితరం అనారోగ్యకరమైన సమాజంలో బతకాల్సి వస్తుంది. ●

# ఇంకా స్పష్టత రాని శాంతి ఒప్పందం!



సుంకవల్లి సత్తిరాజు

ఎట్టకేలకు ఇరాన్ యుద్ధం ముగిసిందని సంబరపడుతున్న తరుణంలో అప్పుడప్పుడూ ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య చెలరేగుతున్న ఆగ్రహ జ్వాలల కారణంగా పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా పడుతున్న అడుగులపై అనుమానపు క్రీనీడలు కమ్ముకుంటున్నాయి. 100 రోజులకు పైగా అమెరికా ఇజ్రాయిల్ దేశాల క్షిపణుల మోతతో, యుద్ధ విమానాల రణ ధ్వనులతో మధ్యప్రాచ్యంలో నెలకొన్న తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు శాంతి చర్చలతో చల్లారిపోతాయని భావిస్తున్న తరుణంలో అమెరికా హుంకరింపులు, ఇరాన్ బెదిరింపులు, లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడుల వలన ప్రస్తుతం కుదిరిన ఎంఓయూ రాబోవు రోజుల్లో శాంతి ఒప్పందంగా మారుతుందా? లేక పరిస్థితి మొదటికొస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తడం సహజం. ఇజ్రాయిల్ పై దాడులు చేయకుండా హెజ్బొల్లాను కట్టడి చేయకపోతే ఇరాన్‌పై అనూహ్యమైన దాడులు చేస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ మండిపడుతున్నది. ఎంఓయూపై సంతకాలు జరిగిన తర్వాత కూడా లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడులు చేయడంతో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని తిరిగి మూసివేయడం ఆందోళన కలిగించినా ప్రస్తుతం హోర్ముజ్ తెరచే ఉందని, నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని జెడి వాన్స్ చెప్పడం హర్షదాయకం. ఒక వైపు స్విట్జర్లాండ్‌లో ఇరాన్‌తో జెడివాన్స్ నాయకత్వంలో వాషింగ్టన్ చర్చలు జరుపుతున్నది. ఈ చర్చల్లో పురోగతి కనిపించడంతో ప్రపంచం ఊపిరి పీల్చుకుంటున్నది. ఈ చర్చల్లో కుదిరిన ఒప్పందం ద్వారా ఇరాన్ పునర్నిర్మాణం కోసం 300 బిలియన్ డాలర్ల భారీ సహాయం లభించనుంది. ఇందుకు ప్రతిగా ఈ మొత్తంతో అమెరికాకు చెందిన గోధుమలు, మొక్కజొన్న తదితర ఆహార వస్తువులు కొనాలనే షరతు విధించారు. ప్రస్తుతం కుదిరిన అవగాహనా ఒప్పందం వలన ఇరాన్ బాగా లబ్ధి పొందడంతో భవిష్యత్తులో గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ ఆధిపత్యం కొనసాగే అవకాశముంది. దీనితో గల్ఫ్ దేశాల్లో గుబులు ప్రారంభమైనది. ఇరాన్ పై యుద్ధానికి అమెరికాను పురిగొల్పిన ఇజ్రాయిల్ ప్రస్తుతం ఇరాన్ అమెరికాల మధ్య సాగుతున్న చర్చల పట్ల, ఎంఓయూ పట్ల ఆగ్రహం ప్రదర్శిస్తూ అమెరికాను లెక్క చేయకుండా లెబనాన్‌పై దాడులు కొనసాగించడంపై ట్రంప్ తీవ్ర స్థాయిలో బెంజిమన్ నెతన్యాహూపై విరుచుకుపడడం ఇరు మిత్రదేశాల మధ్య దూరం పెరగడానికి కారణం కావడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో ఇజ్రాయిల్ ఒంటరిగా మిగిలిపోతుందా? లేక అమెరికా చెప్పినట్టు వింటుందా అనేప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'అనువు గాని చోట అధికులమనరాదు' అనే వేమన పద్యం అమెరికా విషయంలో మరోసారి నిరూపించబడింది. ట్రంప్ అహానికి తగిన శాస్తి జరిగింది. ప్రపంచ ప్రజల మనోభిప్రాయం నెరవేరింది. యుద్ధానికి కేంద్ర బిందువుగా మారిన



హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే ప్రపంచ దేశాల చమురు నౌకలపై ఎలాంటి ట్రాన్సిట్ టోల్స్‌లేకుండా స్వేచ్ఛగా ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది. అమెరికా ఇప్పటివరకు ఇరాన్‌లో కొనసాగించిన నావెల్ బ్లాకేడ్‌ను నిలిపి వేసింది. స్విట్జర్లాండ్‌లో కుదిరిన అవగాహనా ఒప్పందంపై అమెరికా, ఇరాన్ దేశాలు సంతకా లు చేసాయి. పూర్తి స్థాయి శాంతి ఒప్పందానికి ఇంకా అనేక దఫాలుగా చర్చలు జరగవలసి ఉంది. ఈ ఒప్పందం ఆచరణ రూపం దాల్చితే ఇక నుంచి ఇరాన్ పై అమెరికా మిలటరీ ఆపరేషన్లు ఆగిపోతాయి. ఇరాన్‌పై ఆంక్షలను సడలించడం, అమెరికా ఫ్రీజ్ చేసిన 24 బిలియన్ డాలర్ల ఇరాన్ నిధులను దశల వారీగా విడుదల చేయడానికి ట్రంప్ అంగీకరించడం జరిగింది. ఇదే సందర్భంలో లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడులు కూడా ఆగిపోవాలని ఇరాన్ డిమాండ్ చేస్తున్నది. ఇరాన్ విషయంలో ఒబామా సాధించలేనిది తాను పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికిన ట్రంప్ తుదకు సాధించిందేమిటి? ఆర్థిక పతనం వైపు పయనిస్తున్న అమెరికాను మరింత దివాలా తీయించడం తప్ప. 100 రోజులకు పైగా సాగిన పశ్చిమాసియా యుద్ధంలో ప్రపంచ దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. ఆయిల్ సప్లై చెయిన్స్ విచ్ఛిన్నం కావడంతో ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులు తల్లక్రిందులయ్యాయి. ద్రవ్యోల్బణం తీవ్ర రూపం దాల్చింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆర్థిక సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంటున్న తరుణంలో యుద్ధం ముగియడం ఆహ్వానించదగిన పరిణామమే. అయితే ఈ యుద్ధం ద్వారా అమెరికా సాధించిందేమిటనే ప్రశ్న తలెత్తడం సహజం. వాస్తవంగా ఈ యుద్ధం వలన అమెరికా సాధించిందేమీ లేదు. ఇరాన్ చేతిలో చావు దెబ్బ తిని, చేసేదేమీ లేక శాంతి ఒప్పందం పేరుతో గౌరవప్రదంగా తప్పించుకోవడం తప్ప. ఇరాన్ అమెరికాల మధ్య రాజీ కుదర్చడంలో పాకిస్థాన్ పాత్ర పరిమితం.వాషింగ్టన్ టెహ్రాన్‌ల మధ్య సంధి కుదర్చడంలో ఖతార్ కీలక పాత్ర వహించింది. అమెరికా ఆంక్షల వలన ఇప్పటికే ఇరాన్ తీవ్రంగా నష్టపోగా,ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొని నిలబడడం విశేషం. యుద్ధంలో ఇరాన్ 350బిలియన్ డాలర్లకు పైగా, అమెరికా వంద బిలియన్ల డాలర్లకు పైగా నష్టాన్ని చవి చూసిచూసాయి. యుద్ధంతో సంబంధం లేని అనేక దేశాలు కూడా తీవ్రంగా నష్టపోగా, భారత్ కూడా ఈ యుద్ధంవలన సుమారు 50 బిలియన్ల డాలర్లు నష్టపోయినట్లు అంచనా. ప్రస్తుతం యుద్ధానికి ముగింపు వాక్యం పలికినా ఇంకా ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. ట్రంప్ నిర్ణయం నెతన్యాహుకు అంగీకారయోగ్యం కాలేదు. అయితే అమెరికా నిర్ణయాలు ఇతర దేశాల మెప్పు కోసం కాదని జెడివాన్స్ చెప్పడం ఇజ్రాయిల్‌కు మింగుడు పడడం లేదు. అమెరికా ఇరాన్ మధ్య కుదిరిన ఎం.ఓ.యూ పూర్తి స్థాయి శాంతి ఒప్పందానికి దారి తీస్తుందా? లేక మధ్యలో ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలు మడతపేచీ పెడతాయా? అనే విషయం స్పష్టం కావలసి ఉంది. నిలకడ లేని ట్రంప్ భవిష్యత్తులో ఇరాన్ పై దాడి చేయబోడనే గ్యారంటీ ఉందా? హమాస్, హెజ్బొల్లా సంస్థలపై ఇరాన్ తన అనుకూల ధోరణిని మార్చుకుంటుందా? అపారమైన ప్రాణనష్టం జరిగిన గాజా, లెబనాన్‌లపై అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్‌ల దృక్పథంఎలా ఉండబోతుంది? ఇందుకు కాలమే సమాధానం చెప్పాలి. ఇరాన్ పై యుద్ధం కారణంగా ఇజ్రాయిల్ కూడా భారీగా నష్టపోయింది. యుద్ధం పేరుతో అధికారంలో కొనసాగుతున్న బెంజిమన్ నెతన్యాహుకు అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన శాంతి ఒప్పందం ఆశనిపాతం.ఇప్పటికైనా యుద్ధం ముగియడం ఆహ్వానించదగ్గ అంశమే అయినా ఈ విషయంలో పూర్తిస్థాయి ఒప్పందం కుదిరే వరకు స్పష్టత రాదు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సౌరశక్తి విస్తరణతో హరిత ఉద్యోగాలు



## యువ నిపుణులు, సాంకేతిక కార్మికులకు స్థిరమైన ఉపాధి
## కలిసిరానున్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం
## గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు బలోపేతమయ్యే అవకాశం

**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రస్తుతం అందుబాటులో ఉన్న విద్యుత్ వనరులలో రూఫ్‌టాప్ సోలార్ ఇప్పటికే అత్యంత చవకైన వాటిలో ఒకటిగా ఉంది. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో, సౌరశక్తి పెరుగుదల పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో చిన్న తరహా పరిశ్రమల స్థాపనను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. భారతదేశంలో సౌరశక్తి విస్తరణ కొత్త తరం హరిత ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఈ రంగానికి శిక్షణ పొందిన టెక్నీషియన్లు, ఇన్‌స్టాలర్లు, ఎలక్ట్రీషియన్లు, నిర్వహణ నిపుణులు, బ్యాటరీ నిర్వహణ నిపుణులు, ఎనర్జీ ఆడిటర్లు అవసరం.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సోలార్ సహకార సంఘాలు విస్తరిస్తున్న కొద్దీ, ప్రత్యేక నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది, ఇది యువ నిపుణులకు, సాంకేతిక కార్మికులకు స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది.

జాతీయ సౌరశక్తి హక్కు, దానికి తోడుగా సహాయక ఆర్థిక సహాయం, సామాజిక భాగస్వామ్యం, భారతదేశంలో ఇంధన ఖర్చులను తగ్గించడానికి, ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, లక్షలాది హరిత ఉద్యోగా లను సృష్టించడానికి, స్థితిస్థాపక, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సమాజాలను నిర్మించడానికి సహాయపడనున్నాయి. స్వచ్ఛ ఇంధన విప్లవం ఇకపై సుదూర దృష్టి కాదు. సోలార్ కమ్యూనిటీల ద్వారా, ఇది భారతదేశంలోని ప్రతి గ్రామంలో, ప్రతి పరిసర ప్రాంతంలో, ప్రతి ఇంటి పైకప్పుపై ప్రారంభం కావచ్చుని అభిప్రాయం ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు.

సరసమైన ధరలో లభించే హరిత విద్యుత్తు అందుబాటులోకి రావడంవల్ల పిండి మిల్లులు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రైండింగ్ మిల్లులు, ఇతర సూక్ష్మ పరిశ్రమల వంటి సంస్థలు ఆకర్షితులవుతాయి. ఈ అనుసంధానాలను సులభతరం చేయడంలో పంచాయతీలు, స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషించగలవు. తద్వారా అదనపు ఉపాధిని సృష్టించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయగలవని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అనేక నివాస సముదాయాలు అపార్ట్‌మెంట్ భవనాలు, పార్కింగ్ నిర్మాణాలు, ఉమ్మడి సౌకర్యాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నాయని కూడా ఇంధనరంగ నిపుణులు చెబుతున్నారు.

ఈ విధంగా ఉత్పత్తి అయిన విద్యుత్తు లిఫ్టులు, నీటి పంపులు, లైటింగ్ వ్యవస్థలు, భద్రతా మౌలిక సదుపాయాలకు శక్తిని అందిస్తుంది, తద్వారా నిర్వహణ ఖర్చులను తగ్గించి, నివాసితుల విద్యుత్ బిల్లులను తగ్గిస్తుంది.

శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్తు స్థానంలో పునరుత్పాదక సౌరశక్తిని ఉపయోగించడం ద్వారా, సమాజాలు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను, వాయు కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించగలవని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సౌర సమాజాలు స్థానిక పర్యావరణ నాణ్యతను మెరుగుపరుస్తూనే, జాతీయ వాతావరణ లక్ష్యాలకు నేరుగా దోహదం చేస్తాయి.

సామాజిక ప్రయోజనాలు కూడా అంతే ముఖ్యమైనవి. సామాజిక యాజమాన్యంలోని ఇంధన వ్యవస్థలు పౌర భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయి, సామాజిక సహకారాన్ని బలోపేతం చేస్తాయి. తక్కువ ఆదాయ వర్గాలకు, వెనుకబడిన వర్గాలకు స్వచ్ఛమైన, సరసమైన ఇంధన లభ్యతను మెరుగుపరుస్తాయని ఇంధనరంగ నిపుణులు పేర్కొంటున్నారు.



## ప్రైవేటు కళాశాలల్లో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్
### ఫీజుల వ్యవహారంలో జోక్యం చేసుకోం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ప్రవేశాల విషయంలో ఆర్థికంగా బలహీన వర్గాల (ఇడబ్ల్యుఎస్) నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ప్రైవేట్ వైద్యకళాశాలలు లక్షలరూపాయల ట్యూషన్ ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు, ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకున్న రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితి అర్థరహితం అవుతుందన్న వాదనను అంగీకరించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రైవేట్ వైద్య కళాశాలల ఫీజుల నిర్మాణం, ఆర్థికంగా బలహీన విద్యార్థులకు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను కేవలం ఒక భ్రమగా మారుస్తోందని వాదించిన రాజస్థాన్ నివాసి అభ్యర్థి హర్షవర్ధన్ సింగ్ దాఖలు చేసిన సవాలును తిరస్కరించిన రాజస్థాన్ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి జస్టిస్ బి.వి. నాగారత్న, జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. విచారణ సందర్భంగా, కేవలం ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకు సీట్లు రిజర్వ్ చేయబడ్డాయన్న కారణంతో, స్వయంనిధులు సమకూర్చుకునే ప్రైవేట్ సంస్థలను ప్రభుత్వ వైద్య కళాశాలలతో సమానంగా ఫీజులు వసూలు చేయమని బలవంతం చేయలేమని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ కళాశాలలు ప్రభుత్వ ఖజానా నుండి ఆర్థిక సహాయం పొందుతుండగా, ప్రైవేట్ కళాశాలలు స్వీయనిధుల నమూనాపై పనిచేస్తాయని వ్యాఖ్యానించింది.

"ఇవి స్వీయనిధుల సంస్థలు. ప్రభుత్వ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వం నుండి గ్రాంట్లు పొందుతాయి. రెండింటి మధ్య కీలకమైన వ్యత్యాసం ఉంది" అని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. క్యాపిటేషన్ ఫీజులు నిషేధించబడినప్పటికీ, వర్తించే నియంత్రణ చట్టంకింద నిర్ణయించిన సాధారణ ట్యూషన్ ఫీజు లను ప్రైవేట్ కళాశాలలు వసూలు చేయలేరని దీని అర్థం కాదనికూడా అది స్పష్టంచేసింది.

ఏటారూ.8 లక్షలకంటే తక్కువసంపాదించే కుటుంబాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఇడబ్ల్యుఎస్) అభ్యర్థులు, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉండే వార్షిక ట్యూషన్ ఫీజులను వాస్తవంగా భరించలేరని పిటి షనర్ వాదించగా, ఆర్థిక సహాయ యంత్రాంగాలు అందుబాటులో ఉన్నాయని సుప్రీంకోర్టు సూచిం చింది. "మీరుచెల్లించలేకపోతే, స్కాలర్‌షిప్ పొందండి" అని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.



### సిఎం సువేందును కొనియాడిన మహువా మొయిత్రా

**కోల్‌కత్తా,జూన్ 24:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి మహువా మొయిత్రా, రాష్ట్ర ముఖ్యమంత్రి, బిజెపి నేత సువేందు అధికారిపై ప్రశంసలు కురిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆయనతో తనకు ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. పార్టీలో తిరుగుబాటు, ఎన్నికల్లో ఓటమితో టిఎంసి తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో మహువా చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బిబిసి ఇంటర్వ్యూలో మహువా మొయిత్రా మాట్లాడుతూ, సువేందు అధికారితో నాకు వ్యక్తిగతంగా మంచి సంబంధాలుఉన్నాయి. మేమిద్దరం టిఎంసిలో ఉన్నప్పుడు ఆయన నాకు ఎంతో మద్దతుగా నిలిచారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తాను కరింపూర్ నుంచి పోటీ చేసినప్పుడు, సీనియర్ నేతలెవరూ రాకపోయినా సువేందు తన తొలి ర్యాలీలో పాల్గొన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేతిలో టిఎంసి ఓటమి పాలైనవిషయం విదితమే. సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, మమతా బెనర్జీ సైతం పరాజయాన్ని చవిచూశారు. ఎన్నికల అనంతరం టిఎంసిలో సంక్షోభం మరింత ముదిరింది. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం తమకు సుమారు 60 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ప్రకటించింది. పలువురు ఎంపీలుకూడా బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో టిఎంసి విలీనంఅవుతుందన్న వార్తల్లోను మహువా మొయిత్రా కొట్టిపారేశారు. మమతా బెనర్జీకి అత్యంత నమ్మకస్తురాలిగా పేరున్న మహువా, ఇప్పుడు ప్రత్యర్థి పార్టీకి చెందిన ముఖ్యమంత్రిని కొనియాడటం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది.



### టివికె ఎమ్మెల్యే బిడ్డకు టివికె పేరుపెట్టిన సిఎం

**చెన్నై,జూన్ 24:** టివికె చీఫ్, సిఎం జోసఫ్ విజయ్, టివికె ఎమ్మెల్యే ఎంఆర్ పల్లవికి పుట్టిన శిశువుకు అధికారికంగా తమిళ్ వెట్రికొండన్ అని నామకరణం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల మధ్య పండగ వాతావరణంలో సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఆ పసికందును ఆప్యాయంగా ఒడిలోకి తీసుకొని పేరు పెట్టి ముద్దు చేశారు. ఎంఆర్ పల్లవి తిరువికా నగర్ నియోజకవర్గం నుంచి టివికె తరఫున తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నిండు గర్భిణిగా ఉన్నప్పటికి ఇంటింటికి ప్రచారం చేసి ఆమె వార్తల్లో నిలిచారు. అయితే పల్లవి టివికె పార్టీ మొదటి అక్షరాలు కలిసొచ్చేలా బిడ్డకు పేరు పెట్టాలని బలంగా కోరుకున్నారు. ఇదే విషయాన్ని సిఎం విజయ్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సిఎం టివికె పార్టీ స్ఫురించేలా తమిళ్ వెట్రికొండన్(టివికె) అని పేరు పెట్టారు. అయితే తమిళ వెట్రి కొండన్ అనే పేరు విజయ్ నటించిన రాబోయే జననాయగన్ చిత్రంలో విజయ్ పాత్ర పేరు కావడం విశేషం.

## హార్మూజ్ సుదీర్ఘ మూసివేతతో రూ.10.4 లక్షల కోట్ల సరకు నిలిపివేత



**టెహ్రాన్, వాషింగ్టన్,జూన్ 24:** ప్రపంచంలోనే అత్యంత రద్దీ సముద్ర రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధి సుదీర్ఘకాలం మూసివేతతో అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పర్షియన్ గల్ఫ్‌లో దాదాపు 125 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 10.4 లక్షల కోట్లు విలువైన సరుకుతో ఉన్న 1,200కి పైగా సరుకు రవాణా నౌకలు అక్కడే నిలిచిపోయినట్లు సముద్ర బీమా సంస్థలు, షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ అంతర్జాతీయ జలమార్గం గుండా రవాణా పూర్తిగా నిలిచిపోయింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురు, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)లో ఐదో వంతు వాటా ఈ ఇరుకైన జలసంధి గుండానే సాగుతుంది. ఫిబ్రవరి 2026 చివరలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులు చేయడంతో ఈ సంక్షోభం ప్రారంభమైంది. జూన్ మధ్యలో అమెరికా ఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరిగాయంటూ ఇరాన్ చేసిన తాజా ప్రకటనలు మళ్లీ ఆందోళనలను పెంచాయి. అలియాంజ్ కమర్షియల్ సేఫ్టీ అండ్ షిప్పింగ్ నివేదిక ప్రకారం జూన్ మధ్య నాటికి సుమారు 29 మిలియన్ గ్రాస్ టన్నుల బరువున్న 1,150 నుండి 1,200 సరుకు రవాణా నౌకలు నిలిచిపోయాయి. వీటితో పాటు దాదాపు 20,000 మంది నావికులు నెలల తరబడి సముద్రంలోనే చిక్కుకుపోయారు. ఆహార కొరత, మానవీయ సంక్షోభం ఎదుర్కొంటున్న ఈ సిబ్బందిని సురక్షితంగా తరలించేందుకు ఒమన్ దేశం సమన్వయంతో ఒక ప్రత్యేక తరలింపు కారిడార్‌ను ఏర్పాటు చేశారు. ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో జరిగిన దాడుల్లో 40కి పైగా నౌకలు దెబ్బతినగా, కనీసం 14 మంది నావికులు మరణించారు. ఈ జలసంధి మూసివేత వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ముడి చమురు ధర కొన్ని సందర్భాల్లో బ్యారెల్‌కు 100 డాలర్లు దాటిపోయింది. నౌకలను ఆఫ్రికా చుట్టూ లేదా ప్రత్యామ్నాయ భూమార్గాల ద్వారా మళ్లించాల్సి రావడంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి, సరుకు సరఫరా ఆలస్యమవుతోంది. దాదాపు మూడు లక్షల కంటైనర్ కార్గో ఇంకా అక్కడే చిక్కుకుపోవడంతో ప్రాంతీయ ఓడరేవులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఉష్ణోగ్రతలకు దెబ్బతినే వస్తువులు, పాడైపోయే ఆహార పదార్థాల వల్ల బీమా క్లెయిమ్‌లు భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జూన్ చివరి వారంలో గల్ఫ్ నుండి నౌకల రాకపోకలు కొంతవరకు పెరిగినట్లు షిప్పింగ్ డేటా సూచిస్తోంది. లెబనాన్‌లో జరిగిన ఉల్లంఘనల కారణంగా ఈ మార్గాన్ని మళ్లీ మూసివేస్తామని ఇరాన్ ప్రకటించడం అనిశ్చితిని పెంచింది. హార్మూజ్, సూయజ్ కాలువ వంటి కీలక జలమార్గాలపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన అవసరాన్ని ఈ సంక్షోభం గుర్తుచేస్తోందని షిప్పింగ్ రంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

## భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం



### మ్యాన్‌హోల్‌లో పడిపోయిన వ్యక్తిని రక్షించిన సిబ్బంది

**ముంబయి,జూన్ 24:** ఆర్థికరాజధాని ముంబయి మహానగరాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేసాయి. ముంబైను పలకరించిన రుతుపవనాలు తొలిరోజే నగరాన్ని అతలాకుతలంచేశాయి. రాత్రంతా కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనికితోడు, ముంబైలో రుతుపవనాల కోసం తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని మేయర్ రితూ తావడే ప్రకటించిన కొద్ది సేపటికే, అది కూడా ఆమె కళ్లెదుటే ఒక కార్మికుడు మ్యాన్‌హోల్‌లో పడిపోవడం పాలనాయంత్రాంగం వైఫల్యాన్ని ఎత్తిచూపింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, పౌర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి అతడిని సురక్షితంగా బయటకు తీయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు కొద్ది నిమిషాల ముందు గాంధీ మార్కెట్ వద్ద మేయర్ రితూ తావడే మాట్లాడుతూ నగరంలో పంపులన్నీ పనిచేస్తున్నాయని, రోడ్లు శుభ్రంగా ఉన్నాయని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నాలాలు శుభ్రపరిచే పనులు దాదాపు పూర్తయ్యాయని, విమర్శలు చేస్తున్న వారు ఈ రోజు ఇళ్లలో కూర్చున్నారని ఆమె వ్యాఖ్యానించారు. అయితే, ఆమె ప్రకటనకు భిన్నంగా వాస్తవ పరిస్థితి కనిపించింది. సాధారణంగా జూన్ 10న ప్రవేశించాల్సిన రుతుపవనాలు ఈసారి 13 రోజులు ఆలస్యంగా ముంబైకి చేరాయి. రాత్రిపూట కురిసిన భారీ వర్షానికి నగరం గడిచిన 24 గంటల్లో సగటున 195 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని నమోదు చేసింది. పశ్చిమ శివారు ప్రాంతాల్లో 208 మి.మీ., తూర్పు శివారు ప్రాంతాల్లో 167 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో అంధేరి సబ్‌వే, హింద్‌మాతా, కింగ్స్ సర్కిల్ వంటి ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. ఉదయం వేళ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల కారణంగా సబర్బన్ రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. రైళ్ల ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు.

## నిర్మాణంలో ఉన్న గోడౌన్ కూలి ఎనిమిది మంది మృతి



### 45 మందికిపైగా శిథిలాల కిందనే

**కోల్‌కత్తా,జూన్ 24:** కోల్‌కతాలో కనీవినీ ఎరుగని ఘోర విషాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న గిడ్డంగి పైకప్పు కూలిపోవడంతో ఘోర ప్రమాదం జరిగింది. 40నుంచి 45 మంది చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 8 మంది చనిపోగా మరికొందరు తీవ్రగాయాల పాలైనట్లుగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కోల్‌కతాలోని తారతల పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ డిపోరోడ్డులో నిర్మాణంలోఉన్న ఒకగిడ్డంగి పైకప్పుకూలిపోయింది. పెద్ద సంఖ్యలో కార్మికులు అందులో చిక్కుకుపోయినట్లు భావిస్తున్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, పరిపాలనా బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక, రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం నిర్మాణంలో ఉన్న భవనం పక్కన చాలా మంది పనిచేస్తున్నారు. సహాయక, రెస్క్యూ బృందాలు ఏడుగురిని రక్షించారు. స్థానికులు కూడా సహాయక చర్యలు ప్రారంభించారు.షెడ్లు, శిథిలాలకింద చిక్కుకున్న వారిని రక్షిస్తున్నారు. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడి ఉంటారని భావిస్తున్నారు. రక్షించబడిన వారిని పరిపాలనా బృందాలు ఆసుపత్రులకు తరలించాయి.

## టెహ్రాన్‌కు ప్రయాణాలు రద్దుచేసుకోండి
### విదేశాంగశాఖ అడ్వయిజరీ జారీ

**టెహ్రాన్,జూన్ 24:** ఇరాన్‌లో భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం మరోసారి కీలక ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం విడుదల చేసిన తాజా సూచనల ప్రకారం, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు భారత పౌరులు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. ఇటీవల పరిస్థితులు కొంత మెరుగుపడినప్పటికీ, పూర్తిస్థాయిలో సాధారణ స్థితి నెలకొనలేదని రాయబార కార్యాలయం పేర్కొంది. రాయబార కార్యాలయంప్రకారం, అవసరం లేకపోతే ప్రస్తుతం ఇరాన్‌కు ప్రయాణించకపోవడమే మంచిదని సూచించింది.

ప్రాంతీయ భద్రతా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పరిస్థితులకు అనుగుణంగా తదుపరి సూచనలు జారీచేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం ఇరాన్‌లో నివసిస్తున్న లేదా అక్కడికి అత్యవసరంగా వెళ్లాల్సిన భారతీయులు అప్రమత్తంగా ఉండాలి. స్థానిక అధికారుల సూచనలను పాటించాలి. తాజా భద్రతా సమా చారం కోసం అధికారిక ప్రకటనలను గమనించాలి. భారత రాయబార కార్యాలయంతో నిరంతర టచ్‌లో ఉండాలి అని సూచించింది. రాయబార కార్యాలయంలో నమోదు తప్పనిసరి అని పేర్కొంది. ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు, అలాగే త్వరలో అక్కడికి వెళ్లే వారు తమ వివరాలను టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించడానికి ఈ నమోదు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### ఖొమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోడీకి ఆహ్వానం



**టెహ్రాన్,జూన్ 24:** ఇరాన్ మాజీ సుప్రీంలీడర్ అలీ ఖొమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీకి ఇరాన్ ప్రత్యేక ఆహ్వానం పంపించింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్ అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని కొనసాగిస్తోంది. ఖొమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జులై 9న ఆయన స్వస్థలమైన మష్హాద్‌లో ఖననం చేయనున్నారు. టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### పాక్ గగనతలంలోకి ఎయిరిండియా విమానం

**న్యూఢిల్లీ,జూన్ 24:** ఎయిర్ ఇండియాకు చెందిన ఎఐ321 ఢిల్లీ అమృత్‌సర్ విమానం పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించింది. దీంతో కొంత ఉద్రిక్త క్షణాలు నెలకొన్నాయి. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత రెండు దేశాల మధ్య సరైన సంబంధాలు లేని విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఎయిర్ ఇండియాకు చెందిన విమానం కొన్ని సెకన్ల పాటు పాక్ గగనతలంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. పాక్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించిన విషయాన్ని పైలట్ గుర్తించాడని, పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ అథారిటీ నుంచి పైలట్‌కు వార్నింగ్ మెసేజ్‌లు వచ్చినట్లు తెలిసింది.

### ఇరాన్‌పై సైనిక చర్యలు: ట్రంప్ అధికారాల కట్టడి

**వాషింగ్టన్,జూన్ 24:** ఇరాన్‌పై సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు స్వదేశంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇరాన్‌తో ఘర్షణలకు దిగకుండా అమెరికా బలగాలను ఉపసంహరించుకోవాలని ఆదేశిస్తూ యూఎస్ సెనేట్ మంగళవారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 50 ఓట్లు, వ్యతిరేకంగా 48 ఓట్లు వచ్చాయి. అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన నలుగురు సెనేటర్లు డెమొక్రాట్లతో కలిసి ఈ తీర్మానానికి మద్దతు తెలపడం గమనార్హం. ఇప్పటికే ప్రతినిధుల సభలోనూ ఇదే తరహా తీర్మానం ఆమోదం పొందింది. ఉభయ సభల ఆమోదం లభించిన నేపథ్యంలో, దీనికి అధ్యక్షుడి సంతకం అవసరం లేదు. ఇది చట్టబద్ధంగా ట్రంప్‌ను కట్టడి చేయలేకపోయినప్పటికీ, రాజకీయంగా ఆయనపై తీవ్ర ఒత్తిడి పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### తమిళనాట నవజాత శిశువులకు బంగారు ఉంగరం

**చెన్నై,జూన్ 24:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాయిమామన్ గోల్డ్ రింగ్ పథకాన్ని త్వరలోనే ప్రారంభించనున్నారు. ఈ పథకం కోసం బడ్జెట్ లో రూ. 755.83 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టిన బిడ్డలకు ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. తాయిమామన్ గోల్డ్ రింగ్ స్కీమ్‌ను సెప్టెంబర్ 15న పెరియార్ అన్నా జన్మదినం సందర్భంగా ప్రారంభిస్తామని సిఎం విజయ్ పేర్కొన్నారు. ఇదే విషయంపై రాష్ట్ర ఆరోగ్య, మానవవనరుల శాఖ ప్రకటన చేసింది. తమిళనాడులో శాశ్వత నివాసం ఉన్న కుటుంబాలకు మాత్రమే ఈ పథకంవర్తిస్తుందని తెలిపింది.

### ఖతార్‌లో భారతీయుల మృతికి అమీర్ సంతాపం

**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఖతార్ దేశ అమీర్ షేక్ తమీమ్ బిన్ హామద్ అల్ థానీ టెలిఫోన్‌లో సంభాషించారు. ఖతార్‌లోని రాస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో భారతీయులు మృతి చెందిన ఘటనపై అమీర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాల పట్ల సానుభూతి వ్యక్తం చేసినందుకు ప్రధాని మోడీ ఖతార్ అమీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఖతార్ ప్రభుత్వం వెంటనే వైద్య సహాయం అందించినందుకు ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నాయకులు తమ దేశ పౌరుల సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని పునరుద్ఘాటించారు.




బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి.

# 'సఖి'పై ప్రత్యేక దృష్టి సారిస్తాం

## బాధితులతో ఓపికగా వ్యవహరించాలి

## మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి

**బేగంపేట, జూన్ 24,ప్రభాతవార్త:** మహిళలకు సంబంధించిన అనేక కేసులు పోలీసులు నమోదు చేయడం లేదని,సఖీ సెంటర్ల పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తా మని తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి అన్నారు.జాతీయ మహిళా కమీషన్ ,తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో సఖీ సెంటర్ల సిబ్బంది,పోలీసు, లీగల్ రిప్రజెంటేటివ్‌లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని యూసఫ్‌గూడాలోని నిమ్స్‌మే మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణా మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కమిషన్‌కు ఎంతో మంది వస్తున్నారని వారికి ఓపిక, సహనంతో న్యాయం చేసే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. మహిళలకు న్యాయం చేసేందుకు ఏర్పాటు చేసిన సఖీ సెంటర్ల పనితీరు బాగుంటే వారికి దక్కాల్సిన న్యాయం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత,శశికళ యాదవ్ రెడ్డి,సదాలక్ష్మి,రాధాభాయ్, ఉజ్మా ఆషయ్ షాకీర్, కార్యదర్శి పద్మజ రమణ, రిసోర్స్ పర్సన్స్‌గా హైదరాబాద్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ డా.రమాదేవి,గుడిమెళ్ల,ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏసీపీ డి.ప్రసన్నలక్ష్మి,సైకాలజిస్ట్ గీతా చల్లా ,క్లినికల్ సైకాలజిస్ట్ వృషాలి రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



బుధవానం ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

# అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 24, ప్రభాతవార్త:** నగర శివారు ప్రాంతాలలో చాలా కాలంగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ గుడిసె వాసుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఘటకేసర్ పరిధిలోని కాచువాని సింగారంలో 1500 మందికి, మోయినాబాద్ మండలం హిమాయత్ సాగర్‌లో 280 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, కోర్టు కేసులు ఉన్నాయనే కారణంతో ఇంతకాలం పొజిషన్ సర్టిఫికెట్‌లు ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ స్థలాలపై ఉన్న కోర్టు కేసులు క్లియర్ అయినందున, వారందరికీ పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2004 సంవత్స రంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి, కోర్టు కేసుల కారణం తో 22 సంవత్సరాలు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా పేద ప్రజలను ఇబ్బందిపెట్టటం ఏం న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, గుడిసె వాసులందరికీ న్యాయం చేయాలని, లేనిపక్షం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గుడిసెవాసుల సంఘం అధ్యక్షులు బాకి రవి, బీసీ సంఘం నాయకులు అనంతయ్య,కట్టమీది శ్రీనివాస్, గోపాల్, మోదీ రాం దేవ్, కరీం, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం బోనాలు

## ఆషాఢ బోనాలు 3 కార్పొరేషన్ల పరిధిలో వైభవంగా నిర్వహిస్తాం

## లండన్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, జానపద వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యా చరణతో ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ బుధవారం జూమ్ వేదికగా ఎంసిఆర్ హెచ్ఆర్‌డిలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొని ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాలకు శ్రీకారంచుట్టే గోల్కొండ శ్రీజగదాంబ మహంకాళి దేవాలయంలో జూలై 16న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆగస్టు 13 వరకు అట్టహాసంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తాకిడి వుండే పరిస్థితుల నేపథ్యంలో ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు మంత్రి సురేఖ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, దానం నాగేందర్, డిజిపి సి.వి. ఆనంద్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మహావృక్షాల్లా ఎదగాలి

## లోక్‌భవన్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ చేసిన గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** ప్రతి విద్యార్థి ఒక చిన్న మొక్కలాంటివాడని, దానిని ప్రేమతో సంరక్షిస్తే మహావృక్షంగా ఎదిగినట్లే విద్యార్థులను కూడా విద్య, క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో తీర్చిదిద్దితే గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తని, తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకొని కుటుంబానికి, గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని గవర్నర్ విద్యార్థులకు సూచించారు.భారత్ సేవాశ్రమ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం లోక్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. అంతకు ముందు లోక్‌భవన్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మొక్కకు ప్రతిరోజూ నీరు పోసి, బయటి ప్రతికూల పరిస్థితుల నుంచి రక్షిస్తే అది మహావృక్షంగా మారుతుందని, అదే విధంగా విద్యార్థులను కూడా మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి దూరంగా ఉంచి నాణ్యమైన విద్యతో తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. లోక్ భవన్ పాఠశాల కేవలం విద్యాసంస్థ మాత్రమే కాదని, సమాజంలోని వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లోక్ భవన్ సంకల్పానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. భారత్ సేవాశ్రమ సంఘ్ సేవ, కరుణ, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తోందని గవర్నర్ కొనియాడారు. మానవ సేవయే మాధవ సేవ అనే సంఘ్ ఆదర్శం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. విపత్తు సహాయం,ఆరోగ్య సేవలు, విద్యారంగాల్లో సంఘ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇటీవల ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన యంగ్ ఇండియా విద్యార్థి కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నానని గుర్తు చేశారు. వేలాది మంది విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం, సంకల్పం కనిపించిందన్నారు. అదే వేదికపై విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. తెలంగాణను దేశంలోనే విద్య, క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. పంపిణీ చేస్తున్న నోట్‌బుక్‌లు కేవలం కాగితాల కట్టలు కాదని, విద్యార్థుల కలలు, ఆత్మవిశ్వాసం, ఉజ్వల భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ప్రపంచ క్రికెట్‌లో తన ప్రతిభను చాటుకున్న యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గవర్నర్ సూచించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎం. దాన కిషోర్, సంయుక్త కార్యదర్శిశశికిరణాచారి, భారత్ సేవాశ్రమ సంఘ్ స్వామి మున్నేశ్వరానంద, స్వామి వెంకటేశ్వరానందజీ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, లోక్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు.

# 'రేషన్' అభ్యర్థనలు తగ్గి.. పెన్షన్ విన్నపాలు పెరిగాయి

## రెండులక్షల పెన్షన్‌లు మంజూరు

## త్వరలో లబ్ధిదారుల ఎంపిక

## యూరియా సరఫరా బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే

## గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖి




**హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయడంతో ప్రజల నుంచి రేషన్ కార్డుల కోసం ఒక్క అభ్యర్థన కూడా రావడంలేదని ప్రస్తుతం భూసమస్యలు, కొత్త పెన్షన్‌ల కోసం మాత్రమే విన్నపాలు పెరిగాయనీ రాష్ట్ర రవాణా శాఖ, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలపై విన్నపాలు స్వీకరించారు. వెంటనే పరిష్కారం చేసేవి ఆయా బాధ్యులైన అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయించారు. మిగితావి ఆయన శాఖలకు సమర్పించి వాటి పరిష్కారంకు శ్రద్ధ తీసుకొంటామని హామి ఇచ్చారు. అనంతరం గాంధీభవన్‌లో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హత కలిగిన వారందరికి సన్న బియ్యం,200 యూనిట్లు ఉచిత విద్యుత్ పంపిణీ చేస్తున్నామనీ తెలిపారు. గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నామనీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు , నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామనీ చెప్పారు. కొత్తగా రెండు లక్షల పెన్షన్లు మంజూరు చేశామనీ త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందనీ తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా లక్ష ఇళ్లు హైదరాబాద్‌లో నిర్మించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామనీ తెలిపారు.రాష్ట్రంలో ఏ ప్రజావాణిలో ,ఏ కలెక్టర్ దగ్గర మీ సమస్య పరిష్కారం కాకున్నా గాంధీ భవన్ రండి మీ సమస్యలు మేము పరిష్కారం చేస్తామనీ చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కారానికి గాంధీ భవన్ మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్న టిపిసిసి చీఫ్‌కి,ముఖ్యమంత్రికి ధన్యవాదాలనీ అన్నారు. ఏరువాక పౌర్ణమి జూన్ 29 ఉండటంతో ఆరోజు నుంచి విత్తనాల సరఫరా ,ఎరువుల పంపిణీ జరుగుతుందనీ తెలిపారు. యూరియాపై కృత్రిమంగా ప్రజలకు ఆందోళన చెందేలా కుట్ర జరుగుతుందనీ ఆవేదన చెందారు. భారతదేశంలో రాష్ట్రాలకు ,కేంద్రాలకు వేరు వేరు జాబితాలు ఉండగా కొన్ని ఉమ్మడి అంశాలు ఉన్నాయనీ ఎరువులకు సంబంధించి తయారీ ఉత్పత్తి సరఫరా కేంద్రంది బాధ్యత అని చెప్పారు. రాష్ట్రానికి సరిపడ మొత్తం యూరియా కేంద్రం పంపిణీ చేయాలనీ డిమాండ్ చేశారు. ముడిసరుకు,యూరియా తయారు అంతా కేంద్రం చూసుకుంటుందనీ అన్నారు.

రాష్ట్రానికి ఎరువులు వచ్చిన రాకపోయినా బిజెపి నాయకత్వంది బాధ్యత అని ఆయన వివరించారు .ముఖ్య మంత్రి, మంత్రులు తెలంగాణ కి అవసరమైన యూరియా సరఫరా చేయాలని అనేక సార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేశామనీ గుర్తుచేశారు. ఎరువుల సరఫరా చేయకపోతే బిజెపి నాయకుల ఇళ్ల ముందు కూర్చుంటామన్నారు.రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం లేదని,మిత్రపక్షంగా లేమని వివక్ష చూపుతున్నారనీ ఆరోపించారు.యూరియా ఎరువులపై కేంద్రంలో ఏ మంత్రిని అయినా కలవడానికి సిద్ధంగా ఉన్నామనీ తెలిపారు. ఎరువుల కేటాయింపులు లేకపోతే బరాబర్ కేంద్రం తో కొట్లాడుతామనీ అన్నారు. కల్తీ విత్తనాలు లేకుండా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తున్నామనీ తెలిపారు, దుష్ప్రచారం ద్వారా ఎరువుల సరఫరాలో రాష్ట్రాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారనీ ఆరోపించారు..రామగుండం ఎరువుల ఉత్పత్తి అయిన దానిని పూర్తి స్థాయిలో తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి



## సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు బుధవారం బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనాలను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే పాలమూరు రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని లేఖలో ప్రశ్నించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కర్ణాటక నుంచి ఎన్‌వోసి తెస్తున్నాం అనే సాకు చెప్పి, తెలంగాణ జల హక్కులను బేరసారాల అంశంగా మార్చారా అంటూ ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి (2టిఎంసీ), చిక్కాలపర్వి(2.5టిఎంసీ), చిక్కాలమంచి (5టిఎంసీ) బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? లేదా వెల్లడించాలని డిమాండ్ చేశారు.2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి చెప్పాలని కోరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు,మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు.కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోందని ఆరోపించారు.

కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని వెల్లడించారు.చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణపేట, కొడంగల్‌కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్య పూర్వకంగా దాన్ని పక్కన బెట్టారు. కమీషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీశారని విమర్శించారు.తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్రపై కర్ణాటక చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులను తక్షణమే అడ్డుకోవాలని. సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు అధికారిక అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు. తుంగభద్ర జలాల వినియోగంలో బచావత్ ట్రిబ్యునల్ విధించిన నిబంధనలను కర్ణాటక తు.చ తప్పకుండా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం అయితే కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై సుప్రీం కోర్టులో కేసు వేయాలని, కొడంగల్ లిఫ్ట్ కోసం తెలంగాణ జల హక్కులను బేరసారాల అంశంగా మార్చలేదని ప్రభుత్వం నిరూపించాలన్నారు.

# ఒక్క ఎకరాకు నీళ్లు రాలేదు కానీ అప్పుల భారం పెరిగింది

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త:** కొత్త ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ పాలకులు తొమ్మిదిన్నర ఏళ్ల అధికారంలో ఉండి లక్షల కోట్లు గోదావరిలో పోశారనీ,ఒక్క ఎకరాకు నీళ్లు రాలేదు కానీ అప్పుల భారం మాత్రం పెంచారనీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ హరీష్ రావుల వాలకం చూస్తుంటే వెనకటి సినిమాల్లో ఉండే "సాఫ్ట్ విలన్స్" గుర్తొస్తున్నారనీ ఎవరైనా మంచి పని చేస్తుంటే పాడు చేసే రకం వీళ్ళనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్ది పట్టాలెక్కిస్తోందనీ వివరించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు 70 టిఎంసిల అష్యూర్డ్ వాటర్ తెచ్చే ప్రయత్నం చేస్తున్నామనీ ఆయన చెప్పారు. హైదరాబాద్ మెట్రోను మొదలుపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే మేము స్టార్ట్ చేస్తే మీరు వచ్చి సగంలో ఆపేశారనీ, తొమ్మిదిన్నర ఏళ్ల అధికా రంలో ఉండి ఫస్ట్ ఫేస్ కూడా పూర్తిగా కట్టలేకపోయారనీ ఎద్దేవా చేశారు.ప్రైవేటులో ఉన్న మెట్రోను ప్రభుత్వ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కేవలం ఐటీ కారిడార్‌కే పరిమితం చేయకుండా అత్యధిక రద్దీ ఉండే ఓల్డ్ సిటీ మీదుగా సామాన్యుడికి ఉపయోగపడేలా లాభదాయక నిర్వహణ కోసం మెట్రోను రీఅలైన్ చేశారనీ చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎకనామిక్ అడ్వైజర్లతో, ఆర్బీఐ గవర్నర్‌తో మాట్లాడి కొత్త ఫైనాన్షియల్ మెకానిజం తెచ్చారనీ గుర్తు చేశారు. మీలాగా 11 శాతం వడ్డీకి కాకుండా ఐఆర్ఎఫ్సి ద్వారా 4 శాతం కంటే తక్కువ వడ్డీతో నిధులు తెస్తున్నా మనీ అన్నారు. అహ్మదాబాద్, ముంబై మీద చూపిస్తున్న ప్రేమ హైదరాబాద్ మీద కూడా చూపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా కేంద్రంను డిమాండ్ చేయడంతో కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రులు కలిసి ఫెడరల్ స్ఫూర్తితో చర్చలు జరిపారనీ చెప్పారు. దీనిని కెటిఆర్ ఎందుకు ఓర్వలేకపోతున్నారు?.. ఎల్ అండ్ టీ నుంచి ఆస్తి ప్రభుత్వా నికి బదిలీ అయితే రేవంత్ రెడ్డి కుటుంబానికి ఏం సంబంధం?.. మూసీ ప్రక్షాళనకు ఇంకా డిపిఆర్ కూడా కాకముందే లక్షల కోట్ల అవినీతి అని అబద్ధాలు చెబుతున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# అధికారం పోయినా కెటిఆర్‌కు అహంకారం పోలేదు

## ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త:** కాంగ్రెస్ నేతలు తలుచుకుంటే కెటిఆర్ రోడ్లపై తిరగలేరనీ, కానీ కాంగ్రెస్ కార్యకర్తలను ఆయన భేదిరించడం సరికాదనీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు చెప్పారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అందుకే బిజెపి నేతలపై బిఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేయడం లేదనీ విమర్శించారు. గతంలో చేసిన తప్పుల నుంచి తప్పించుకోవడానికి బిజెపితో బిఆర్ఎస్ నేతల దోస్తీ చేస్తున్నారని విమర్శించారు. కెటిఆర్ అధికారులను, ప్రజలను బెదిరించడం ఆయన అహంకారానికి నిదర్శనమనీ, సిఎంపై కెటిఆర్, హరీష్ రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారనీ ఆవేదన చెందారు.మెట్రో రైలుపై చాలా అబద్ధాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై కావాలనే విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం, ప్రైవేట్‌లో ఉన్న మెట్రోను ప్రభుత్వంలోకి తీసుకువచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే బిఆర్ఎస్, బిజెపి నేతలు విమర్శలు చేస్తున్నారనీ అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ప్రభు త్వం కృషి చేస్తోందనీ అన్నారు.కెసిఆర్ పోతే ఆయన సీటు కోసం కెటిఆర్, హరీష్ రావు ఇప్పటి నుంచే కొట్టుకుంటున్నారనీ ఆరోపించారు, బిఆర్ఎస్ నేతలకు దమ్ముంటే అసెంబ్లీ వేదికగా చేసిన ఆరోపణలపై చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతీ సమస్యపై,ప్రతీ పైసాపై చర్చించేందుకు ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# 'సర్'పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

## 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే

## డూప్లికేట్ ఓటర్ల గుర్తింపునకు ఈఆర్‌వో నెట్ ద్వారా ప్రత్యేక పరిశీలన: కలెక్టర్ టిఎస్ దివాకర



**ఖమ్మం, జూన్ 24, ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లా డుతూ ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) శిక్షణలు నిర్వహించడంతో పాటు అవస రమైన పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.జూన్ 25, 2026 నుంచి జూలై 24, 2026 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారంలు రెండు అందజేస్తారని తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం నింపి తిరిగి ఒక ఫారం బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ప్రతి ఇంటిని బీఎల్‌వోలు మూడు సార్లు సందర్శిస్తారని తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి వివరాలను సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. జూలై 31న ముసాయిదా ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఓటరు పేరు లేకపోవడం లేదా ఇతర అభ్యంతరాలపై ఆగస్టు 30, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అందిన అన్ని అభ్యంతరాలను సెప్టెంబర్ 28, 2026 నాటికి పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు.

అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వివిధ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమగ్రంగా సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.1000 కోట్ల స్కామ్ చేసిన సర్కార్

## త్వరలోనే మరొకటి బయటపెడతాం: జగదీశ్‌రెడ్డి

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సిఎంకు పిఎగా పని చేస్తున్నారా?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** హైబ్రిడ్ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కిందని, స్కీములు లేవు కానీ రోజుకో స్కాం వెలుగు చూస్తోం దని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. పీఎం కుసుమ్ పథకంలో కూడా రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి తెరతీశారని, విద్యుత్ శాఖలో మరో స్కాంను త్వరలోనే బయటపెడతామన్నారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న పాలనపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలను పక్కనపెట్టిందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో స్కామ్‌లు తప్ప స్కీమ్‌లు లేవని విమర్శించారు. ఈ ఆరోపణలపై రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై స్పందించిన జగదీష్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ పదవికి ఎసరు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని జగదీష్ రెడ్డి ఖండించారు.

సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ.. నేషనల్ బ్యాంకులను భయపెడుతున్నారని జగదీష్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసినందుకే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా మిగిలిన కేంద్రమంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇది చూస్తే సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పీఏ లాగా పని చేస్తున్నారా అనే అనుమానం కలుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# సద్దుమణిగిన కామారెడ్డి క్రమశిక్షణరాహిత్యం

## కాంగ్రెస్ సంస్థాగత అభివృద్ధికి కృషిచేస్తామన్న ఇరువర్గాలు

**హైదరాబాద్, జూన్24,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ,పిసిసి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి,కామారెడ్డి మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఇందుప్రియల క్రమశిక్షణరాహిత్యం వైఖరితో ఏర్పడిన వివాదం ఎట్టకేలకు తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జోక్యంతో సద్దుమణిగింది. క్రమశిక్షణకమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ ఎశ్యాం మోహన్‌లు కామారెడ్డి వివాదం సమసిపోయిందని ఇరువర్గాలు కలిసి కాంగ్రెస్ సంస్థాగత అభివృద్ధికి పనిచేస్తామని ఒప్పుకొన్నారని ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీచీఫ్ బొమ్మమహేశ్ కుమార్‌గౌడ్‌తోపాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సామాజిక మాధ్యమాలలో ఒక ఆడియో చక్కార్లుకొట్టింది. అదే సమయంలో సొంతపార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డంఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు భూసేకరణ వేగవంతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరా బాద్, జూన్ 24:** రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక ముందడుగు పడింది. ఈ పథకం లో భాగంగా నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. సయ్యద్‌పల్లి పరిసర ప్రాంతాల్లో భూములను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి భూసేకరణ, సర్వే ప్రక్రియ, ముంపు ప్రాంతాల గుర్తింపు తదితర అంశాలపై ప్రజాప్ర తినిధులు సమీక్ష నిర్వహించారు.లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం దాదాపు 2,919 ఎకరాల భూమి అవసరమవుతుందని అధికా రులు తేల్చారు. ఈ మేరకు భూసేకరణ పనులను వేగవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముమ్మరంగా కసరత్తు చేయనున్నారు. 2.80 టీఎంసీల నీటి నిల్వ సామర్థంతో నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక భాగంగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దక్షిణ తెలంగాణలోని దాదాపు 4.97 లక్షల హెక్టార్ల భూములకు సాగునీరు అందనుంది. సాగునీటితో పాటు ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభించనుంది.

# మాన్సూన్ సన్నద్ధత

## వ్యవసాయ విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి

### ఎస్పీడీసీఎల్ సీఎండి జితేష్

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** రుతుపవనాల సన్నద్ధత, వ్యవసాయ విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండి జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లాలో విస్తృతంగా పర్యటించిన ఆయన విద్యుత్ సేవలు, మౌలిక వసతులు, వ్యవసాయ విద్యుత్ సరఫరా, వినియోగదారుల సేవలు, మాన్సూన్ సన్నద్ధతపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. మాన్సూన్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వాక్ అలోంగ్ ది లైన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ట్రీ ట్రిమ్మింగ్, ఎర్తింగ్, గార్డింగ్ తదితర భద్రతా చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వ్యవసాయ ఫీడర్ల పనితీరు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల సత్వర మార్పిడి, పెండింగ్ వ్యవసాయ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ నాణ్యత మెరుగుదలపై చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం, 1912 కాల్ సెంటర్ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం, సంస్థ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయడం ప్రతి ఇంజనీర్ బాధ్యత అని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు మోతె మండలం సిరికొండ గ్రామంలోని సబ్‌స్టేషన్‌ను సందర్శించి అక్కడ ప్రతిపాదిత సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు సంబంధించిన అంశాలను పరిశీలించారు. సిరికొండ గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీ లతో ప్రత్యక్షంగా మాట్లాడి వ్యవసాయ విద్యుత్ సరఫరాపై వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ మెటీరియల్ స్టోర్స్‌ను తనిఖీ చేసి విద్యుత్ సామగ్రి నిల్వలు, అవసరాలు, భవిష్యత్ అవసరాలపై సమీక్ష నిర్వహించారు. తదుపరి జమ్మిగడ్డ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా వ్యవస్థ, నిర్వహణ ప్రమాణాలు, భద్రతా చర్యలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

అంతేకాకుండా సూర్యాపేట పట్టణం (సర్కిల్ కార్యాలయంలో ) నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక మరియు వ్యవసాయ రంగాలకు అందిస్తున్న విద్యుత్ సరఫరా, ఫీడర్ల పనితీరు, విద్యుత్ అంతరాయాల నివారణ చర్యలు, వినియోగదారుల సేవలు, రెవెన్యూ వసూళ్లు, విద్యుత్ చౌర్య నియంత్రణ, పెండింగ్ పనుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ పి. నర్సింలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతుకు ఆదాయ భద్రత

### రోడ్ మ్యాప్ రూపకల్పన

### ప్రభుత్వానికి సమగ్ర నివేదికతో సిఫారసులు

### అగ్రి వర్సిటీలో తీర్మానాలు

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** రైతుల ఆదాయ భద్రతపై పూర్తి స్థాయిలో దృష్టిసారించాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించనుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో నిర్వహించిన 'రైతు ఆదాయ భద్రతా మార్గాలు-ప్రత్యామ్నాయాలు 'అనే కార్యక్రమంలో పాల్గొన్న రైతు నాయకులు వ్యవసాయంలో విధాన మార్పులు చేయాలని కోరారు. ప్రధానంగా వరి సాగు విస్తరణ, అధిక ఉత్పత్తి, సేకరణ, నిల్వ ఒత్తిళ్ల వల్ల తలెత్తుతున్న సవాళ్లను ప్రముఖంగా ప్రస్తావించారు. పూర్తిస్థాయి ప్రభుత్వ సేకరణ ప్రైవేట్ వ్యాపారులు, ఎగుమతిదారుల భాగస్వామ్యాన్ని ఎలా తగ్గించిందో వారు పేర్కొన్నారు. దీనివల్ల మార్కెట్లో సరఫరా తగ్గి, వినియోగదారులకు బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. పప్పుధాన్యాలు, ముతక ధాన్యాలు, నూనెగింజల పంటలను ప్రోత్సహించడానికి ప్రోత్సాహకాలను తక్షణ చర్యలను సిఫార్సు చేశారు. అన్ని పంటలలో విలువ జోడింపు, ఉపఉత్పత్తుల శుద్ధిపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. కేవలం ప్రభుత్వ కొనుగోలుపై కాకుండా సులభమైన, పారదర్శకమైన సేకరణను నిర్ధారించడానికి ఒక నియంత్రణ చట్రం అవసరమని నొక్కి చెప్పారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జనయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సంప్రదింపులను కొనసాగిస్తుందని, ఒక రోడ్ మ్యాప్‌తో సమగ్ర నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుందని తెలిపారు. రైతుల ఆదాయాలను పెంచడానికి సాంకేతిక చర్యలను రూపొందించేందుకు ఇప్పటికే విశ్వవిద్యాలయం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. కాగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలలో శిక్షణ, సామర్థ్య పెంపు కోసం సహకరించుకోవడానికి వ్యవసాయ విశ్వవిద్యాలయానికి, హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకి మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జనయ్య, పీజేటీఎస్ఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈ సి. విద్యాసాగర్, ఏఎస్సీఐ రిజిస్ట్రార్ డాక్టర్ ఓపీ సింగ్‌ల సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, మానవ వనరుల శిక్షణ, అభివృద్ధి, నిర్వహణ వ్యవస్థలు, ఆధునిక పాలన పద్ధతులు, వ్యవస్థాపకత, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన ఇతర రంగాలపై ఈ రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేస్తాయి.

# గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

### మలేరియా, డెంగ్యూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు: వైద్య సేవలపై మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందేనని ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, హాస్పిటళ్లలో సౌకర్యాలు, ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎదురవుతున్న సవాళ్లు, తదితర అంశాలపై బుధవారం మంత్రి సమీక్ష చేశారు. ఐటీడీఏ ప్రోగ్రామ్ ఆఫీసర్లతో గతంలో చేసిన రివ్యూలో తీసుకున్న నిర్ణయాల అమలుపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని హాస్పిటళ్ల అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, తమకు ఎదురు అవుతున్న వివిధ రకాల చాలెంజెస్‌ను అధికారులు మంత్రికి వివరించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు, మాతా, శిశు సంరక్షణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు, డయాలసిస్, క్యాన్సర్ స్క్రీనింగ్, సికిల్ సెల్ నియంత్రణ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో



మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. 108, 102 అంబులెన్స్ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల గుండాల పీహెచ్‌సీలో జరిగిన మెటర్నల్ డెత్ ఘటన నుంచి ప్రతి అధికారి పాఠాలు నేర్చుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణలో ఉంచాలని, డెలివరీ డేట్ కంటే ముందుగానే, బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించాలని ఆదేశించారు. మాతా, శిశు సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు.

మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న గిరిజన ప్రాంతాల ప్రజలకు చికిత్స మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం ఏజెన్సీ జిల్లాల్లో 25 డయాలసిస్ సెంటర్ల ద్వారా 1,373 మంది యాక్టివ్ రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా 170 మిషన్లతో మరో 34 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేశామని మంత్రి గుర్తు చేశారు. అలాగే, ఎమర్జెన్సీ డయాలసిస్ సేవల కోసం ఏజెన్సీ ప్రాంతాల్లోని 12 హాస్పిటళ్లలో అదనంగా 37 డయాలసిస్ మిషన్లను మంజూరు చేస్తున్నామన్నారు. కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు త్వరగా పూర్తయ్యేలా ఆరోగ్యశాఖతో పాటు, ఐటీడీఏ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గురుకులాలను సమీపంలోని హాస్పిటళ్లకు ట్యాగ్ చేయాలని గతంలో మంత్రి సూచించగా, ఈ సమీక్షలో అధికారులు మంత్రికి మ్యాపింగ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గిరిజన, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను సమీప ప్రభుత్వ హాస్పిటళ్లతో అనుసంధానం చేసిన ప్రత్యేక మ్యాపింగ్‌ను మంత్రి సమీక్షించారు. దీనివల్ల అవసరమైన సందర్భంలో విద్యార్థులకు వేగంగా వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. హాస్పిటల్ నుంచి 20 కిలో మీటర్లకు పైగా దూరంలో ఉన్న విద్యాసంస్థలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అత్యవసర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవింద్ర నాయక్, ఐటీడీఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) ప్రోగ్రామ్ ఆఫీసర్లు రాహుల్, మకరంద్, లెనిన్, ట్రైబల్ వెల్ఫేర్, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ కొనుగోలు ధరలు తగ్గింపు

### యూనిట్ రూ.3.13 నుండి రూ.2.98కి తగ్గింపు

### రైతులకు షాక్ ఇస్తూ ఈఆర్‌సీలో డిస్కంల పిటీషన్

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి కుసుమ్ పథకం కింద బీడు భూముల్లో సోలార్ ప్లాంట్లు పెట్టుకున్న రైతులకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) షాకిచ్చాయి. ప్లాంట్ల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.3.13 నుండి రూ.2.98కి తగ్గించాలని కోరుతూ డిస్కమ్‌లు తాజాగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్‌లో (ఈఆర్‌సీ) పిటిషన్ దాఖలు చేశాయి. సోలార్ ప్లాంట్లకు ఉపయోగించే పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించింది. దీనివల్ల ప్రాజెక్ట్ ఖర్చు తగ్గిందని పేర్కొంటూ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు యూనిట్‌పై 15 పైసలు తగ్గించాలని ప్రతిపాదించాయి. అయితే ఈ పథకం కింద 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలు చేయడానికి డిస్కమ్‌లు, రైతుల మధ్య ఒప్పందం జరిగినప్పుడు యూనిట్ ధర రూ.3.13గా తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆమోదించింది. మరోపక్క తెలంగాణలో 500 కిలోవాట్ల నుండి 2 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడానికి దాదాపు 1,100 మంది రైతులు ముందుకొచ్చారు. ఈ ప్లాంట్ల ద్వారా 1,797 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే డిస్కమ్‌ల ప్రతిపాదనలపై రైతులు పునరుత్పాదక ఇంధన నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేసున్నారు. అవసరమైతే యూనిట్ ధర రూ.4కు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిస్కమ్‌ల ప్రతిపాదనపై అభ్యంతరాలు తెలపడానికి ఈనెల 30 వరకు గడువు ఇస్తూ ఈఆర్‌సీ మంగళవారం అవకాశం కల్పించింది. ఇదే సమయంలో ఈ తగ్గింపు ప్రతిపాదనలపై రాష్ట్రంలోని పలువురు రైతులు, పునరుత్పాదక ఇంధన నిర్వాహకులు ఈఆర్‌సీని ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఇసుక కాంట్రాక్టర్లకు రూ.50 కోట్లు విడుదల: ఎండి అనుదీప్

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇసుక కాంట్రాక్టర్ల బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు తెలంగాణ ఖనిజా వృద్ధి సంస్థ ఎండీ వైస్చైర్మన్, ఎండీ అనుదీప్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఇసుక ర్యాండ్ మైజేషన్ బుకింగ్ అమలు చేయడంతో మరింత పారదర్శకత, సమాన బుకింగ్ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక కొరత అనేది ఎక్కడ లేదని, కొందరు కావాలని సంస్థపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఇసుక 24 గంటలు అందుబాటులో ఉంటుందని, అవుట్ ఆఫ్ స్టాక్‌అని చూపిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కార్పొరేషన్‌కు రోజుకు 1.10 లక్షల టన్నులు ఇసుక అందుబాటులో ఉంచుతుందని వివరించారు. అందులో 0.63 టన్నులు బుక్అవుతుండగా, 0.46 టన్నులు మిగులుతుందన్నారు. తెలంగాణ మైనింగ్ శాఖ వద్ద విక్రయానికి 1.15 కోట్ల టన్నుల ఇసుక తవ్వేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇసుక బుకింగ్ వ్యవస్థ పూర్తిగా డిజిటల్, స్వయం చాలక వేదిక ద్వారా నిర్వహిస్తోందని వెల్లడించారు. అన్ని బుకింగ్‌లు ముందు నిర్దేశించిన సిస్టమ్ ప్రొటోకాల్స్ ఆదారంగా సాండ్ సేల్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పంపిణీ చేయబడుతుందని స్పష్టం చేశారు. మౌలిక వసతుల ప్రాజెక్టులు, పరిశ్రమలు, సంస్థలు ఇతర పెద్ద వినియోగదారుల అవసరాలు తీర్చేందుకు బల్క్ బుకింగ్ సౌకర్యం ప్రవేశపెట్టామన్నారు. అర్హత ప్రమాణాలు, బుకింగ్ పరిమితులు, చెల్లింపు, కేటాయింపు విధానాలు అన్ని దరఖాస్తులకు సమానంగా వర్తిస్తాయని ఎటువంటి వివక్ష ఉండదని తేల్చి చెప్పారు. బల్క్ బుకింగ్ ఆమోదం పొందిన తరువాత కొంతమంది వినియోగదారులు ఒక రీచ్ నుంచి మరో రీచ్‌కు ఆర్డర్ల బదిలీ చేయాలని కోరితే రుసుము, జరిమానాలు ప్రాతిపదికన విధించబడుతుందని చెప్పారు. ఈ విధంగా ఈనెల 17వ తేదీ నుంచి ఇప్పటివరకు 83 ఆర్డర్లపై రూ.2.83 లక్షల వసూలు చేసినట్లు వివరించారు. ఆర్డర్ల కేటాయింపులో మానవుల జోక్యం ఉండదని, బుకింగ్ వ్యవస్థను పారదర్శకత, నిష్పకపాతత్వం, వినియోగదారులందరికి సమాన అవకాశాలు కల్పించే విధంగా రూపొందించ బడిందన్నారు.

# పగటి పూట భారీ ఉష్ణోగ్రతలు

### రాత్రి పూట మోస్తరు వర్షాలు

#### వర్షాకాలంలో అరుదైన పరిణామాలు

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాకాలంలో తెలంగాణలో అరుదైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెల రోజులు అవుతున్నా రాష్ట్రంలో మాత్రం వివిధ జిల్లాల్లో ఎండల తీవ్రత కొనసాగుతూనే ఉంది. పగటి పూట 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రిపూట మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం 9 గంటల వరకు చల్లని వాతావరణం ఉన్నప్పటికీ, 10 తర్వాత ఎండలు దంచికొడుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ఆకాశం మేఘావృతమై ఉన్నా వర్షం మాత్రం రాత్రి పొద్దు పోయే వరకు కురవలేదు. కానీ తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో పొద్దున చల్లని వాతావరణం ఏర్పడింది. అయితే ఈ చల్లని వాతావరణం ఎక్కువ సమయం ఉండలేదు. మధ్యాహ్నం సమయానికి 40 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు చేరాయి. అనేక ప్రాంతాల్లో 37 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా ములుగు జిల్లాలో 26.4 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. అలాగే కొత్తగూడెం, పెద్దపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, కామారెడ్డి, మేడ్చల్, ఆదిలాబాద్, నిర్మల్, సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో చిరు జల్లుల నుండి చెదురుమదురు వర్షాలు పడ్డాయి. మరోపక్క ఇదే రోజు వివిధ జిల్లాల్లో సాధారణం కంటే మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే వర్షాలు పడిన జిల్లాల్లో సైతం సాధారణం కంటే మించిన ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషం. గడచిన 24 గంటల్లోహన్మకొండ జిల్లాలో 2.2 మిల్లీ మీటర్ల స్వల్ప వర్షపాతం నమోదు కాగా, ఇదే రోజు సాధారణం కంటే 3 డిగ్రీలు ఎక్కువగా 37.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అలాగే సూర్యాపేట్‌లో 36.6 డిగ్రీలు, కరీంనగర్‌లో 36 డిగ్రీలు, జగిత్యాలలో 35.2 డిగ్రీలు, ఖమ్మంలో 36.5 డిగ్రీలు, నిజామాబాద్, సిరిసిల్లాలో 36.6 డిగ్రీలు, వరంగల్‌లో 36.8 డిగ్రీలు, కొత్తగూడెంలో 35 డిగ్రీలు, జనగామలో 36.3 డిగ్రీలు, భూపాలపల్లిలో 35.8 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 36.2 డిగ్రీలు, ములుగులో 35.7 డిగ్రీలు, నల్లగొండలో 35.2 డిగ్రీలు, సిద్దిపేట్‌లో 35.1 డిగ్రీలు, భువనగిరిలో 35.2 డిగ్రీలు, మెదక్ జిల్లాలో సాధారణం కంటే మించి 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి.

# గ్రీన్‌కార్డుదారులు నేరాలకు పాల్పడితే దేశ బహిష్కరణే..

### అమెరికా సుప్రీం కోర్టు సంచలన ఉత్తర్వులు

**వాషింగ్టన్,జూన్ 24:** అమెరికాలో గ్రీన్‌కార్డులు కలిగి ఉన్న విదేశీలయుఎ వరైనా సరే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు నిర్ధారణ జరిగితే వారిని దేశంలోకి తిరిగి రాకుండా బహిష్కరించేందుకు సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వులు జారీచేసింది. అలాంటి వారిని అడ్డుకోవడం, వారిని దేశం నుండి బహిష్కరించే ప్రక్రియను సులభతరం చేస్తూ కోర్టు 63 మెజారిటీతో ఈ నిర్ణయం తీసుకుంది. ఏదైనా నేరపూరిత ఆరోపణలు ఉన్న నివాసితులను సరిహద్దు అధికారులు దేశంలోకి రాకుండా నిలిపి వేయడానికి వారిపై పక్కా ఆధారాలు ఉండాల్సిన అవసరం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. చైనా పౌరుడైన ముక్ చోయ్ లా అనే గ్రీన్ కార్డ్ హోల్డర్ కేసు ఆధారంగా ఈ తీర్పు వచ్చింది. న్యూజెర్సీలో నకిలీ వస్తువుల తయారీ ఆరోపణలు ఎదుర్కొంటున్న అతను చైనాకు వెళ్లి తిరిగి వస్తుండగా జేఎఫ్‌కే విమానాశ్రయంలో అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత అతను కోర్టులో నేరాన్ని అంగీకరించడంతో బహిష్కరణ వేటు పడింది. అయితే తనను అడ్డుకునే సమయానికి అధికారుల వద్ద పక్కా ఆధారాలు లేవని లా వాదించగా, సుప్రీంకోర్టు దానిని తోసిపుచ్చింది. గతంలో గ్రీన్ కార్డ్ హోల్డర్లను విమానాశ్రయాల్లో నిలిపివేయాలంటే వారు నేరం చేశారనేందుకు బలమైన ఆధారాలు చూపాల్సి వచ్చేది. కానీ తాజా తీర్పు ప్రకారం కేవలం అనుమానం లేదా దొంగతనం, మోసం వంటి నైతిక పతనానికి సంబంధించిన నేరారోపణలు ఉంటే చాలన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కల్వకుంట్ల కవిత, చంద్రశేఖర్, ఫిరోజ్ తదితర నాయకులు

# ప్రజల హక్కుల సాధనకు న్యాయపోరాటం

### తెలంగాణ రాష్ట్ర టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

**నాంపల్లి, జూన్ 24 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, హక్కుల సాధన దిశగా వీధుల్లోకి వచ్చి ఉద్యమిస్తాం, న్యాయపోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు. అంతేకాక హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకేనే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర టీఆర్ఎస్ నాయకుడు దేవరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన కవిత ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తమ పార్టీ ప్రారంభించి నెలరోజుల తర్వాత తొలిసారిగా పార్టీ జెండా పండుగ నిర్వహిస్తున్నామని, ఇది అన్నిచోట్ల విస్తరిస్తామన్నారు. గత 12ఏళ్లుగా జంటనగరాల్లో సరైన పురోగతి లేదని, బస్తీలు అపరిశుభ్రత, మురికి ప్రవాహాల మధ్య చినుకు వానపడితే వీధులన్నీ నీటమునిగి ప్రజలు తీవ్ర అసౌకర్యాలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఆయా వాడల్లోనున్న పేదలకు ఇళ్లపట్టాలు లేవని, కొన్నిచోట్ల తాగునీటి సమస్యతో ఇబ్బందులుపడుతున్నార న్నారు. బస్తీవాసులకు టీఆర్ఎస్ అండగా నిలుస్తుందని, వారి సమస్యల పరిష్కారానికి శాయసక్తులా అహర్నిశలు పనిచేస్తామని హామీనిచ్చారు. తమ పార్టీ ప్రజల పక్షాన నిలబడి ఉద్యమాలు చేస్తుందని, మున్ముందు జరిగే ప్రజాహిత కార్యక్రమాల కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధులు కావాలని కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నారా యణమ్మ, పార్టీ నాయకులు దేవరి చంద్రశేఖర్, ఫిరోజ్, జాఫర్‌బాయి తదితర నేతలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత తెలంగాణకు సమష్టి కృషి

### డ్రగ్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం: గవర్నర్‌తో మంత్రి అడ్లూరి కీలక భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** మాదకద్రవ్యాల నిర్మూలన, వృద్ధుల సంక్షేమం, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారతకు సంబంధించిన పలు కీలక అంశాలపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లతో షెడ్యూల్డ్ కులాలు, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సమావేశంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం, రాష్ట్రంలో చేపడుతున్న మాదకద్రవ్యాల నిరోధక చర్యలు, యువతలో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలపై మంత్రి గవర్నర్‌కు వివరించారు. ఈ నెల 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు, యువజన చైతన్య కార్యక్రమాల వివరాలను మంత్రి గవర్నర్‌కు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా గవర్నర్‌ను మంత్రి ఆహ్వానించారు. అయితే జూన్ 26న ముందస్తు కార్యక్రమాల కారణంగా అందుబాటు లో లేనందున, జూలై 2న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొ నేందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు.

ఈ సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సంచాలకురాలు బి. శైలజ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార విస్తరణకు టీజీఎస్ఆర్టీసీ 'గోల్డెన్ ఛాన్స్'

### అద్దెకు ఖాళీ ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్‌లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ వ్యాపార సముదాయాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు సంస్థ సిద్ధమైంది. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి, తమ సంస్థలను విస్తరించుకోవాలనుకునే వారికి ఇది ఒక బంపర్ ఆఫర్‌గా నిలవనుంది. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల, ప్రచార ఖర్చులు లేకుండానే వ్యాపారస్తులకు కస్టమర్లు లభిస్తారు. హోటళ్లు, ఫుడ్ కోర్టులు, సూపర్ మార్కెట్లు, బ్రాండెడ్ షోరూమ్‌ల నుండి చిన్న తరహా దుకాణాల వరకు అన్ని రకాల వ్యాపారాలకు ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్ లు అనువైన వేదికలుగా మారనున్నాయి. సంస్థను లాభాల బాట పట్టించడంతో పాటు, స్థానిక నిరుద్యోగులకు, వ్యాపారస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉన్నతాశయంతో టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. పారదర్శకమైన నిబంధనలు, లీజు పద్ధతుల ద్వారా ఈ స్థలాలను కేటాయించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న 694 షాపులకు త్వరలో టెండర్లు పిలువనుంది. ఆర్టీసీ చరిత్రలోనే సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ, పారదర్శకతకు పెద్దపీట వేసేలా సంస్థ పరిధిలోని అన్ని వ్యాపార సముదాయాల వివరాలను యాజమాన్యం అధికారిక వెబ్‌సైట్‌లో బహిరంగపరిచింది.

# పార్టీలో చేరికలకు జనసేన ఆహ్వానం

### తెలంగాణ జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

### మీడియా కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్ నియామకం

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** తెలంగాణపై జనసేన పార్టీ ప్రత్యేక ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో జనసేన పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థలతో పాటు, అన్ని ఎన్నికల్లో పోటీ చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలో తన రాజకీయ కార్యకలాపాలను మరింత వేగవంతం చేసింది. ఈ క్రమంలో పార్టీ భావజా లానికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి చేరాలనుకునే నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను ఆహ్వానించేందుకు, ఆ చేరికలను క్రమబద్ధంగా సమన్వయం చేసేందుకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం ఏడుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక తెలంగాణ జాయినింగ్స్ కమిటీ ని నియమించింది. ఈ కమిటీలో ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డా. గడల శ్రీనివాస్ (తెలంగాణ రాష్ట్ర మాజీ మెడికల్ డైరెక్టర్), గొట్టిముక్కల నరేష్‌రెడ్డి, అబ్దుల్ హనీఫ్, అల్లాడి తనీష్, చిరాగ్ ప్రజీత్ గౌడ్, మేడూరి సరస్వతి (మాజీ తెలంగాణ రాష్ట్ర డిసిపి) సభ్యులుగా వ్యవహరించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా విసృ_తంగా వస్తున్న చేరికల విజ్ఞప్తులను ఈ జాయినింగ్స్ కమిటీ మొదట క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ తర్వాత ఆ వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి పరిశీలించి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తారు. అనంతరం ఆయన ఇచ్చే దిశా నిర్దేశం, కీలక సూచనల మేరకు తెలంగాణలో భారీ ఎత్తున చేరికల కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ తాజా కమిటీ ఏర్పాటుతో తెలంగాణలో జనసేన పార్టీ క్షేత్రస్థాయి బలోపేతం పై ప్రత్యేక దృష్టి సారించి, రాజకీయంగా స్పీడ్ పెంచిందని స్పష్టమవుతోంది.

**మీడియా కోఆర్డినేటర్ నియామకం**

జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం తరపున పార్టీ కార్యక్రమాలు, కార్యకలాపాలును మీడియా సంస్థలకు చేరవేయడంతో పాటు, సమన్వయం నిర్వహించే మీడియా కోఆర్డినేటర్‌ను నియమించింది. ఈ బాధ్యతలను జర్నలిస్ట్ దుంపటి శ్రీనివాస్‌కు అప్పగిస్తూ రాష్ట్ర జనసేన పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఈ నియమకం వివరాలను వెల్లడించింది.

# తమిళనాడు సిఎం విజయ్‌తో దిల్ రాజు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** తెలుగు సినీ నిర్మాత దిల్ రాజు, తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌ను చెన్నైలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ్‌కు పుష్పగుచ్ఛం అందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. వీరిద్దరి మధ్య భేటీ ఎంతో ఆత్మీయంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దిల్ రాజు గతంలో విజయ్ హీరోగా వారిసు అనే భారీ చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే.

ఈ సినిమా తెలుగులో వారసుడు పేరుతో విడుదలైంది. ఆ సినిమా సమయం నుంచి వీరిద్దరి మధ్య మంచి అనుబంధం కొనసాగుతోంది. ఇప్పుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత దిల్ రాజు తొలిసారిగా ఆయనను కలిశారు.

# ఆధార్-ఓటర్ ఐడీని అనుసంధానించండి: ఈసీకి బీఆర్ఎస్ విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఆధార్ ఓటర్ ఐడీ అనుసంధానం చేయాలని కోరింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి, సీఈవో సుదర్శన్‌రెడ్డికి బీఆర్ఎస్ లేఖ అందించింది. డూప్లికేట్ ఓట్లు తొలగించకుండా ఎస్ఐఆర్ లక్ష్యం నెరవేరదని, ఈ అంశంపై ఎన్నికల కమిషన్ తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. ఒక వ్యక్తి -ఒక ఓటు సూత్రాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరింది. తెలంగాణ, ఏపీ ఓటర్ల జాబితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వలసలు వల్ల ఒకే వ్యక్తి 2 రాష్ట్రాల్లో ఓటరుగా ఉండే అవకాశాలను పరిశీలించాలని సూచించింది.



## సిఎం చంద్రబాబుకి ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న కీలక నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపించినందుకు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. పలు విభాగాల్లో ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడం, పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) వర్తింపజేయడం వంటి నిర్ణయాలు వేలాది మంది ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని నేతలు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించడం పట్ల వారు సంతోషాన్ని వెలిబుచ్చారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) నోటిఫికేషన్‌కు ముందే నియామక ప్రక్రియ పూర్తయి, ఆ తర్వాత విధుల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేసేలా ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ప్రభుత్వ నిర్ణయాలు ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని అభిప్రాయపడ్డారు. సిఎం చంద్రబాబు గత స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపామని ఏపి జెఎసి ఛైర్మన్ విద్యాసాగర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఏపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాపా ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ఉద్యోగులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారికి సూచించారు.

## ప్రకృతి విపత్తుల నియంత్రణపై కొడూరులో అంతర్రాష్ట్ర మాక్ ఎక్సర్‌సైజ్

### దక్షిణాది రాష్ట్రాల విపత్తుల నివారణ ప్రతినిధులు హాజరు



**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాల మధ్య విపత్తు సంసిద్ధత, పరస్పర సమన్వయం, అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో బుధవారం కృష్ణా జిల్లా కొడూరు మండలంలో దక్షిణ భారత్ స్థాయిలో అంతర్ రాష్ట్ర మాక్ ఎక్సర్‌సైజ్-2026 విజయవంతంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాలకు అనుగుణంగా దక్షిణ ప్రాంతానికి సంబంధించి ఈ విన్యాసాన్ని నిర్వహించే ప్రధాన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ జాతీయ విపత్తుల నియంత్రణ సంస్థ గుర్తించింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్‌కుమార్ గుప్తా మార్గదర్శకత్వంలో ఎన్.మధుసూదన రెడ్డి, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్), డా. ఫక్కీరప్ప కాగినెల్లి డిఐజి (లా అండ్ ఆర్డర్), డి. ఉదయ్ భాస్కర్, డిఐజి (ఏపీఎస్పీ బెటాలియన్స్), ప్రఖార్ జైన్‌మేనేజింగ్ డైరెక్టర్, డి.కె. బాలాజీ, జిల్లా కలెక్టర్, కృష్ణా జిల్లా, వి. విద్యాసాగర్ నాయుడు, పోలీస్ సూపరింటెండెంట్, వి.వి.ఎన్. ప్రసన్న కుమార్, కమాండెంట్, 10వ బెటాలియన్, ఎన్‌డిఆర్ఎఫ్ వారి సహకారంతో, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఎపిఎస్‌డిఎంఎ, జిల్లా యంత్రాంగం, ఎన్‌డిఆర్ఎఫ్, ఇతర భాగస్వామ్య శాఖల సమన్వయంతో దక్షిణ ప్రాంత సంయుక్త విపత్తు నిర్వహణ విన్యాసం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎపిఎస్‌పి బెటాలియన్స్, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. రాజకుమారి, ప్రధాన సమన్వయకర్తగా వ్యవహరించి, విన్యాసానికి సంబంధించిన అన్ని ప్రణాళికలు, సమన్వయ చర్యలు, కార్యాచరణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయాన్ని నిర్దేశించారు. ఈ విన్యాసానికి ముందస్తు సన్నాహక కార్యక్రమాలలో భాగంగా ఇటీవల సమన్వయ సమావేశం నిర్వహించారు. అనుసరణగా టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ప్రధాన విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, విపత్తు సంసిద్ధతను పెంపొందించడం, ఉమ్మడి ప్రతిస్పందన వ్యవస్థలను మెరుగుపరచడం ఈ విన్యాసం ముఖ్య ఉద్దేశ్యం. ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎస్‌డిఆర్ఎఫ్ జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖ, నీటిపారుదల శాఖ, సముద్ర శాఖ, స్థానిక పోలీసులు, పంచాయతీ రాజ్ శాఖ, హోం గార్డులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు, ఇతర భాగస్వామ్య సంస్థలు చురుకుగా పాల్గొన్నాయి. వరద పరిస్థితుల్లో నిర్వహించాల్సిన శోధన, రక్షణ చర్యలు, ప్రభావిత ప్రజల తరలింపు, వైద్య సహాయం, సహాయక శిబిరాల నిర్వహణ, కమ్యూనికేషన్ వ్యవస్థల సమన్వయం, వివిధ శాఖల సమగ్ర ప్రతిస్పందన విధానాలను ఈ విన్యాసంలో ప్రదర్శించారు. ఈ విన్యాసం ద్వారా రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, వనరుల భాగస్వామ్యం, అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలు, విపత్తు నిర్వహణలో భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావంతో వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు తరచుగా సంభవిస్తున్న నేపథ్యంలో, ఇటువంటి మాక్ ఎక్సర్‌సైజ్‌లు విపత్తు సంసిద్ధతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతల వినియోగం, సమర్థవంతమైన సమన్వయ వ్యవస్థలు, ముందస్తు సంసిద్ధత చర్యల ద్వారా ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విపత్తు నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పునరుద్ఘాటించారు.

## శివయ్య సన్నిధిలో నటి హాన్సిక పూజలు



**శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త:** సినీ నటి హన్సిక బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. ఆమె తన బంధువులతో రాగా దక్షిణ గోపురం వద్ద బిజెపి యువ నాయకుడు కటికం వంశీ స్వాగతం పలికారు. రాహుకేతుదోష పూజల అనంతరం ఆమెకు స్వామి అమ్మ వార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనం అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందించారు.

## ప్రజల సమస్యలన్నింటిని నిర్దిష్ట విధానాల్లో, సంతృప్త స్థాయిలో పరిష్కరిస్తాం

- శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వ విఫలమైందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. అన్ని రంగాలను ఆ ప్రభుత్వ తన అనుచిత విధానాలతో నిర్వీర్యం చేసిందన్నారు. తమ ప్రభుత్వం పాలనా వ్యవస్థను సరిదిద్దిందన్నారు. ప్రజల సమస్యలన్నింటిని నిర్దిష్ట విధానాల్లో, సంతృప్త స్థాయిలో పరిష్కరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారానికి మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను స్వయంగా కలుసుకుని, వారి సమస్యలు, వినతులను విని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమర్థవంతమైన పాలన, పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## అదిగదిగో పులి

- పాపికొండల్లో బెబ్బులి భయం • పర్యాటక రంగంపై ప్రభావం.
- పెద్ద పులి సంచారంతో గిరిజన గ్రామాల్లో ఆందోళన





**ఏలూరు, జూన్ 24 ప్రభాతవార్త బ్యూరో:** పాపికొండల అభయారణ్యం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి సంచారం మరోసారి ఏలూరు జిల్లా అటవీ ప్రాంతాల్లో సంచరించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉలిక్కి పడేలా చేసి ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. మంగళవారం బుట్టాయగూడెం మండల పరిధిలో పులి కదలికలు నమోదవడంతో సమీప గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం బుట్టాయగూడెం మండలం పులిరాముడు గూడెంలో పరిసరాల్లో ఉందని ఏలూరు జిల్లా అటవీ శాఖ అధికారి పీవీ సందీప్ రెడ్డి తెలిపారు. అయితే పులి దాడిలో రెండు ఆవులు మృతి చెందిన ఘటన స్థానికుల్లో మరింత ఆందోళన పెంచింది. మరోవైపు ఈ పరిణామాలు ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన పాపికొండల పర్యాటక రంగంపైనా ప్రభావం చూపుతున్నాయి.

**పశువులపై దాడి:** నిమ్మలగూడెం శివారులోని పాలకుంట చెరువు సమీపంలో మేతకు వెళ్లిన రెండు ఆవులపై పెద్దపులి దాడి చేసి చంపినట్లు సమాచారం. ఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు పులి అడుగుజాడలను గుర్తించారు. పులి కదలికలను నిర్ధారించేందుకు రేడియో కాలర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**వెలవెలబోతున్న పాపికొండలు:** ప్రకృతి సౌందర్యం, గోదావరి విహార యాత్రలకు ప్రసిద్ధి చెందిన పాపికొండలకు ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అయితే ఇటీవల పులి సంచారం వార్తలు వెలుగులోకి రావడంతో కొంతమంది పర్యాటకులు పర్యటనలను వాయిదా వేసుకుంటున్నట్లు రాజమండ్రికి చెందిన టూరిజం నిర్వాహకులు చెబుతున్నారు. పులి జాడ తెలుసుకుని తమ భద్రతపై సందేహాల కారణంగా కుటుంబాలతో వచ్చే సందర్శకుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది.

**ప్రజల భద్రతపై దృష్టి:** సమీప అటవీ ప్రాంతాల్లో ఒంటరిగా తిరగవద్దని, రాత్రి వేళల్లో అడవుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అటవీశాఖ అధికారులు సూచించారు. పశువులను అడవి అంచులకు మేతకు పంపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పులి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం జిల్లా కలెక్టర్‌కు, స్థానిక అధికారులకు అందిస్తున్నారు.

**నిర్వహణపై ప్రశ్నలు:** వన్యప్రాణి మెడకు రేడియో కాలర్ అమర్చినప్పటికీ, అది జనావాసాలకు చేరుకోవడం స్థానికుల్లో పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. పులి కదలికలను ముందుగానే గుర్తించి గ్రామాలకు హెచ్చరికలు ఇవ్వడంలో వ్యవస్థ ఎంతవరకు సమర్థంగా పనిచేస్తోందనే చర్చ జరుగుతోంది. వన్యప్రాణుల సంరక్షణతో పాటు గ్రామీణ ప్రజల భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**మానవ- వన్యప్రాణి సంఘర్షణకు సంకేతమా?:** అటవీ ప్రాంతాల విస్తీర్ణం తగ్గడం, ఆహార లభ్యతలో మార్పులు, వన్యప్రాణుల సహజ సంచార మార్గాల్లో మానవ జోక్యం పెరగడం వంటి కారణాలతో పులులు జనావాసాల వైపు వచ్చే ఘటనలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. పాపికొండల పరిసరాల్లో తాజా పరిణామాలు కూడా మానవవన్యప్రాణి సంఘర్షణ సమస్యను మరోసారి తెరపైకి తెచ్చాయి. ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణ రెండింటినీ సమన్వయం చేస్తూ దీర్ఘకాలిక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పర్యావరణ వర్గాలు సూచిస్తున్నాయి.

**బుట్టాయగూడెంలో పెద్దపులి సంచారం:** పాపికొండలు అభయారణ్యం నుంచి జనావాసాల్లోకి అడుగుపెట్టిన పులి బుధవారం బుట్టాయగూడెం మండలం పులిరాముడు గూడెం ప్రాంతంలో సంచరించినట్లు గురజాడలు గుర్తించామని ఏలూరు జిల్లా ఫారెస్ట్ అధికారి పివి సందీప్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుట్టాయ గూడెం మండలంలోని గుంజవరం, కన్నాపురం, చింతలగూడెం, బుట్టాయగూడెం, దొర మామిడి, కొవ్వాడ, లంకపాకల, వీరన్నపాలెం, మునులూరు, రవ్వారీ గూడెం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ మేరకు అటవీశాఖ అధికారులు అన్ని రకాల ముందస్తు రక్షణ చర్యలను చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాలలోని చేపల వేట, పశువుల మేత, అటవీ ప్రాంతంలో సంచరించుట వంటి చర్యలకు పాల్పడవద్దని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా పులి రాత్రి వేళల్లో జనావాసాలకు దగ్గరగా వస్తున్నందున పశువులను బహిరంగంగా ఉంచవద్దని సూచించారు. అలాగే గ్రామంలోని లైట్లు వెలిగే ఉండాలని కోరారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక బృందాలను పులి బోనులను ఏర్పాటు చేశారు. నిమ్మలగూడెంలో పులికి ఆహారమైన రెండు పశువుల యజమానులకు అటవీ శాఖ తరపున నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

## అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠా గుట్టురట్టు




**పలమనేరు, జూన్ 24 ప్రభాతవార్త:** కోట్ల రూపాయల డిమాండ్‌తో ఆరితేరిన అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠాను చిత్తూరు జిల్లా పలమనేరు పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి తన సిబ్బందితో దాడిచేసి 11 మందిని అరెస్టు చేయగా మరో 11 మంది పరారీ అయ్యారు. బుధవారం డిఎస్పీ దేగల ప్రభాకర్ విలేకర్లకు తెలిపిన వివరాలు. గంగవరం మండలం గంగవరంకు చెందిన ఎంసి రవి (47)ను కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 7న పలమనేరు గుడియాత్తం రోడ్డులోని టి.వడ్డూరు క్రాస్ వద్ద కిడ్నాప్ చేశారు. కడప జిల్లా పులివెందులకు తీసుకు వెళ్ళి రవి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. రూ.2 కోట్లు అందజేయాలని లేదంటే చంపుతామని బెదిరించారు. దీంతో రవి కుటుంబ సభ్యులు ఈ నెల 8న ఉదయం చిక్‌బళ్ళాపూర్ హైవే వద్ద రూ.1 కోటి అందజేశారు. కిడ్నాపర్లు ఈ మొత్తం తీసుకొని బాధితుని వద్ద ఉన్న 900 గ్రాముల బంగారు ఆభరణాలు బలవంతంగా లాక్కొని బాధితుని అక్కడే వదిలి పరారీ అయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా కేరళకి చెందిన రోషన్ గ్యాంగ్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు కలసి కుట్రపన్ని ఈ నేరం చేసినట్లు దర్యాప్తులో తేలింది. భానుప్రకాశ్ అనే వ్యక్తి బాధితుడు రవి కదలికలను ఎప్పటికప్పుడు నాగేశ్వరరెడ్డి అనే వ్యక్తి ద్వారా కిడ్నాప్ గ్యాంగ్‌కు తెలియజేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రవిని కిడ్నాప్ చేయడానికి అవసరమైన వాహనాలు సమకూర్చుకొని గంగవరంలో ఓ లాడ్జిలో బసచేశారు. ఈ నెల 7న బాధితుని కదలికలు గమనించి టి.వడ్డూరు క్రాస్ వద్ద కిడ్నాప్ చేసి పులివెందులకు తరలించారు. దాంతో పోలీసులు సాంకేతిక ఆధారాలు సిసిటివి పుటేజీలు మొబైల్ కాల్‌డేటా వాహనాల కదలికలు ఇతర శాస్త్రీయ ఆధారాలతోఈ కేసులో వున్న కేరళకు చెందిన 7 మందిని ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన నలుగురిని అరెస్టు చేశారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన వాహనాన్ని గంగవరం మండలం గండ్రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి పలమనేరు కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించారు. నిందితుల నుండి రూ.22 లక్షలు నగదు, మూడు కార్లు మారుతీ స్విఫ్ట్ డిజైర్, జియా సోనెట్, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. రోషన్ వర్గానికి చెందిన గ్యాంగ్‌లీడర్ రోషన్‌నర్గీస్ పరారీలో వున్నాడు. ఇక అరెస్టు అయిన వారిలో అప్పు అరుణ్, ఎడ్విన్ థామస్, దీపు మోస్, నితిన్‌జానీ, కెస్ అభయ్, రతీష్, లిబిన్ ఉన్నారు. అలాగే ఏపి, తెలంగాణాకు చెందిన వారిలో కడపజిల్లా సింహాద్రిపురం ఉప్పలూరుకు చెందిన నాగేశ్వరరెడ్డి, వనపర్తి జిల్లాకు చెందిన మహేష్ నాయుడు, ప్రొద్దుటూరుకు చెందిన పందేళ్ళపల్లెకు చెందిన రామిరెడ్డి, పొద్దుటూరుకు చెందిన గుండ్రా మహేష్‌రెడ్డి అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఇక పరారీలో వున్న వారు సచూ, అనూప్, నికిల్ మోహన్, స్వాజీ (జిత్తు), అరుణ్, సామి, అమీన్, జస్వంత్ (వరప్రసాద్), అనిల్, మరో వ్యక్తి ప్రణీత్ రెడ్డి స్నేహితుడు కృష్ణారెడ్డి పరారీలో వున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రోషన్‌పై కేరళలోని వివిధ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దాడులు, బెదిరింపులు, పేలుడు పదార్థాలు కలిగి వుండడం మొత్తం 15 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన సిఐ మోహన్‌రెడ్డి, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డిఎస్పీ అభినందించారు.

## సుస్థిరత ప్రభావ మదింపులలో పద్మావతి వర్సిటీకి ఇంపాక్ట్ రేటింగ్స్

**తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్‌పిఎంవివి) సుస్థిరత ప్రభావ మదింపులులో 2026 విశ్వవిద్యాలయం ర్యాంక్ బ్యాండ్‌ను సాధించింది. ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన, సమాజానికి అందిస్తున్న సేవలు వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తారు. ఈ సందర్భంగా పద్మావతి మహిళ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉషఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించిన ర్యాంకింగ్ డైరెక్టర్ ఆచార్య పి. వెంకట కృష్ణతో పాటు ర్యాంకింగ్ బృంద సభ్యులందరినీ అభినందించారు. విశ్వవిద్యాలయం సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతల పట్ల చూపుతున్న నిబద్ధతకు ఈ ర్యాంకింగ్ నిదర్శనమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను సాధించేందుకు విశ్వవిద్యాలయం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఇతర భాగస్వాములందరికీ వారు అభినందనలు తెలియజేశారు.

## బ్రహ్మోత్సవాలకు ఉద్యానవనాలను సుందరంగా తీర్చిదిద్దాలి

- టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రానున్న బ్రహ్మోత్సవాలకు తిరుమలలోని ఉద్యానవనాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో బాటు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉన్న మొక్కలను పెంచేలా చర్యలు చేపట్టాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిచెప్పారు. తిరుమలలో ఆధ్యాత్మిక వనాలను విరివిగా అభివృద్ధి చేయాలని సూచించారు. తిరుమలలో జిఎన్‌సి, గీత పార్క్, నామాల పార్క్ వంటి వివిధ ఉద్యానవనాలను ఆయన బుధవారం పరిశీలించి టిటిడి ఉద్యానవన, అటవీ శాఖల అధికారులతో కలసి తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట అటవీశాఖ విభాగం డిప్యూటీ సిఎఫ్ ఫణి కుమార్ నాయుడు, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, పిఆర్‌ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ విధానాలతోనే రూపాయి ఢమాల్!

- రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు, కుతంత్రాలు • బిజెపిదంతా మత విద్వేషాలు రెచ్చగొట్టడమే
- రాజధాని పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం • మండిపడ్డ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య




**ఉరవకొండ, జూన్ 24 ప్రభాతవార్త:** దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని గడిచిన 3 ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తూ వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి స్థానంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే కార్య క్రమాన్ని నూటికి నూరుపాళ్లు విజయవంతంగా అమలు చేస్తున్నారని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. ఉరవకొండ పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండపంలో ఈనెల 22వ తేదీ నుండి జరుగుతున్న సిపిఐ రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతుల చివరిరోజు బుధవారం ఆయన హాజరై ప్రసంగించారు.

రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక రూపాయి పతనం కాలేదు కాని భారతదేశ రూపాయి విలువ పతనం అవుతోందని రూపాయి విలువ పెంచుతానని అధికారం చేపట్టిన మోదీ 12 సంవత్సరాల పాలనలో 56 రూపాయలుగా ఉన్న రూపాయి విలువను నేడు డాలర్‌తో పోల్చితే 96 రూపాయలకు పడిపోయేలా చేశారని విమర్శించారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ఉన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపి నేడు రాజ్యాంగాన్ని మార్చడానికి అనేక కుట్రలకు పాల్పడుతోందన్నారు. దేశంలో ఆదివాసులు, గిరిజనులు, ముస్లిం మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని దేశ ప్రజల మధ్య ఐక్యతకు ముప్పు వాటిల్లుతోందన్నారు.

**కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతో చంద్రబాబు సర్కార్ విఫలం:** రాష్ట్రంలోని చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి డబుల్ ఇంజన్ సర్కార్ కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య విమర్శించారు. ఎన్నికలల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోగా గడిచిన రెండేళ్లలో రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని, 20 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతోందని ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్న చంద్రబాబు ఎన్ని పరిశ్రమలు తెచ్చారో, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో కల్పన కాకుండా కల్పించినవెన్నో వాస్తవాలు చెప్పాలన్నారు. ఎపి అంటే అమరావతి, పోలవరం అంటున్న చంద్రబాబు అమరావతి నిర్మాణానికి కేంద్రం నుండి ఎన్ని నిధులు తెచ్చారని ఆయన ప్రశ్నించారు. అమరావతిను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ఉన్నా పూర్తి మాత్రం కావడంలేదని నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న రూ.37వేల కోట్ల పరిహారం ఇవ్వమంటే ఎత్తు తగ్గిస్తామంటున్నారని ఎత్తు తగ్గించి చేపలు పట్టుకుంటారా అని ఈశ్వరయ్య దుయ్యబట్టారు.

**సంపద పునః పంపిణీ చేయాలి:** కార్పొరేట్ల సంపదను పునః పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లోని 28 జిల్లాల్లో ప్రచార కార్యక్రమం చేపడుతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన దేశ వ్యాప్తంగా పాలక ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడానికి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. ఈనెల 30వ తేదీన రైతాంగ సమస్యల పరిష్కారంకోసం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఛలో విజయవాడ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు సి.మల్లికార్జున, జె.రాజారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు బి.కేశవరెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, మల్లికార్జున, నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, సహాయ కార్యదర్శులు సుల్తాన్, నాగేంద్ర, నాయకులు బసవరాజు, గెన్నే మల్లేసి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## దారిదోపిడి కేసులో 8మంది అరెస్టు

### 4 వాహనాలు, రూ.3 లక్షలు స్వాధీనం



**శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి-తిరుపతి జాతీయ రహదారిపై ఈ నెల 15న తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం అంజిమేడు వద్ద రవీంద్రరెడ్డి అనే వేణును బెదిరించి రూ.15 లక్షలు దోచుకున్న కేసులో బుధవారం 8 మందిని అదుపులో తీసుకొని వారి నుంచి నాలుగు వాహనాలను, రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్‌పి అర్లశ్రీనివాసులు మీడియాకు తెలిపారు. రవీంద్ర రెడ్డి రూ.15లక్షలతో తన వాహనంలో పయనిస్తుండగా ముందుగా గుర్తించిన ముఠా దారికాచి కత్తులతో బెదిరించి నగదును అపహరించినట్లు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు సంబంధిత అధికారులను కేసుకు సంబంధించి ప్రత్యేక బృందాలను నియమించాలని ఆదేశించారు. ఈ మేరకు రేణిగుంట డియస్‌పి శ్రీనివాస్, ఏర్పేడు సిఐలు శ్రీకాంత్‌రెడ్డిలు సంయుక్తంగా ప్రత్యేక బృందాన్ని నియమించారు. కేసుల ఛేదనలో ఎంతో చాకచక్యం ఉన్న బృందం ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, రవిప్రకాష్ వారి సిబ్బంది గతంలో నేరాలకు పాల్పడిన వారిని పరిగణలోకి తీసుకొని విచారణ చేపట్టారు. వారి చొరవతో స్వల్ప కాలంలోనే నిందితులను అదుపులో తీసుకున్నారు. ఈ కేసులో మొదటి నిందితులుగా ఓ మహిళ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమె కోసం ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ కేసులు 8మందిని అదుపులో తీసుకున్నట్లు వివరించారు. మొదటి నిందితులు లక్ష్మీకాంతమ్మ పరారిలో ఉండగా అదుపులో తీసుకున్న వారిలో బాలసాల దామోదరం (బంగారుపాళెం), వెంకటరమణ (శ్రీనివాస మంగాపురం), మునియప్ప వెంకటాచలపతి(కోలారు), నారాయణ స్వామి (కోలార్), సయ్యద్ రోషన్ (మొగిలి బంగారుపాళెం), అంజి (గంగవరం చిత్తూరు), గుణశేఖర్ (జీవకోన తిరుపతి), శ్రీనివాసులు (చిల్లకూరు నెల్లూరు జిల్లా) ఉన్నారు. ఈ కేసును ఛేదించటంలో ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి రవి ప్రకాష్, పోలీసులను జిల్లా అధికారులు ప్రశంసించారు.

# ఎవరేమనుకున్నా... అంతే..?



ఫలానా సెలిబ్రిటీకి పెళ్లెప్పుడు? ఎవరితో? సెలబ్రిటీల విషయంలో ఇలాంటి ఊహాగానాలన్నీ సర్వసాధారణం. కానీ సోషల్ మీడియా వచ్చాక అర్థం పర్థం లేని, ఒకవేళ అర్థమున్నా సామాన్యులకేమీ అక్కర్లేని విషయాలు ఊర్లన్నీ తిరిగొచ్చేస్తున్నాయి.ఆదేనండీ! డిజిటల్ వేదిక మీద వైరల్ అవుతున్నాయి. సీనియర్ బాలీవుడ్ నటి ఫోటోకి నీనా గుప్తా నటిమణి నీనాగుప్త క్యూరియస్ సర్కాలేనా? సమంత నీళ్ళోసుకుందా? అడెప్పుడు. ఆమెకు సారె కూడా అందిందా! అదెలా సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు ఎంతో అనుచితమైనా ఉచితంగా దేశమంతా చుట్టేస్తున్నాయి. మాకూ రాయడానికి ఓ పద్ధతుంటుం దని సాదా సీదా జర్నలిస్టులుంటారుటే? మాకలాంటివేమీ లేవని సోషల్ మీడియా వాళ్ళ ఘోష. వాటిలో ఎంత మేరకు నిజాలుంటాయో తెలియని విషయం కాదు. అదేమీ కాకుండా ఉబుసుపోక విషయాలను అనుచితంగా వ్యాపింపచేయడంలో మాకు మేమే సాటి! అని సోషల్ మీడియా కాలరెత్తుకు తిరిగేస్తుంటే ఏమనుకోవాలి? ప్రజాజీవితంలో కొన్ని ఏమైనా అంతా.. అనే ధోరణిలో సినీ జీవితంలో ఉంటే ఏదైనా అంతా,, అనుకుంటున్నట్టుంది.వివిధ సామాజిక మాధ్యమాల్లో 'మా ఇంటి బంగారం' సినిమా సక్సెస్ సెలెబ్రేషన్స్ సంబంధించిన ఫొటో ఒకటి వైరల్ అయింది. అందులో సమంత బేబీ బంప్'తో కనిపించారని ఆ మధ్య ఒకటే గోల. అదేమైనా అంత అవసరం భ్రమలను సమాజానికి చెప్పేద్దాం.. అనే లేక జాతి జనులంతా వందని చేసుకునే విషయమా? ఇలాంటివేమీ తేలకుండానే సోషల్ మీడియా తమకవసరంలేని భ్రమలను ఆ మేఘాలమీద సమాజానికి చెప్పేద్దాం.. అనే ధోరణిలో అంతలూగా చేసి చూపించేస్తున్నాయి. ఆ మధ్య నటీమణి 'నీనాగుప్త' విషయంలో ఇలాగే ఊహించేశారు. అయినా ఆమె ఎంతో మర్యాదగా స్పందించారు. ఇప్పుడూ ఇలాగే అనవసర, అనుచిత స్పందనతో సామాజిక మాధ్యమాలు నవ్వుల పాలవుతున్నాయి. ఒకప్పుడు సెలబ్రిటీల సినిమాల, అవార్డులు, ఫ్యాషన్ మాత్రమే వార్తల్లో ఉండేవి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా, వర్చువల్ రియాలిటీ, డిజిటల్ గాసిప్ ఎకానమీ కలిసి 'బేబీ బంప్'ను ఒక వ్యక్తిగత అనుభవం నుంచి ప్రపంచ, వినోదంగా మార్చేశాయి. మొన్నా ఈ మధ్య విజయ్ దేవరకొండ రష్మిక మందన్న వివాహ రిసెప్షన్‌కు హాజరైన నటి నీనా గుప్తాకు సంబంధించిన ఒక వీడియో వైరల్ అవ్వడం వల్ల ఆమెకు బేబీ బంప్ ఉందని సోషల్ మీడియాలో పుకార్లు వచ్చాయి. తాను ఆమె ధరించిన చీర, దాని వస్త్రశైలి వల్ల కెమెరా యాంగిల్‌లో అలా కడుపు ఉబ్బినట్లుగా కనిపించిందేమోనని అంటూనే. ఈ విషయంపై నీనా గుప్తా 66 ఏళ్ల వయసులో, నేనా గర్భవతినా.. అని నవ్వుకుంటూనే కోపంగా స్పందించకుండా హాస్యంగా పరిస్థితిని హ్యాండిల్ చేశారు.

నీనా గుప్తా స్పందన మాత్రం 'బదాయి హో' సినిమా సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, వయసు పైబడిన తర్వాత కూడా ఇలాంటి రూమర్స్ రావడంపై ఆమె సరదాగా నవ్వుకున్నారు. బాడీ షేమింగ్ లేదా శరీర ఆకృతి ఆధారంగా గర్భధారణ అని భ్రమిసి కథ అల్లేయడం ఎంత మర్యాదకరం. ఈ ట్రెండ్ మొత్తం సరదాగా మాత్రమే ఉండదు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అతిగా దృష్టి పెట్టడం గోప్యతకు సవాలుగా మారింది. ఫన్నీ మీమ్స్, సిల్లీ ఊహాగానాలు, వివాదాస్పద చర్చలు ... ఇవి సెలబ్రిటీ సంస్కృతిలో భాగమే. కానీ అవి వ్యక్తిగత గోప్యత, గౌరవం, బాధ్యత వంటి విలువలతో సమతుల్యం కావడం ప్రస్తుత సమాజంలో అవసరం ఒక పెద్ద డిజిటల్ వ్యాపారానికి ప్రధాన వస్తువుల్లో పోవడం ఆశ్చర్యకరం. అవి కొన్నిసార్లు నవ్విస్తాయి, కొన్నిసార్లు ఆశ్చర్యపరుస్తాయి, మరికొన్నిసార్లు వివాదాలకు దారి తీస్తాయి.మరికొన్ని సార్లు జుగుప్స కరంగానూ అనిపిస్తాయి.ఫ్యాషన్ బ్రాండ్స్, మాతృత్వ ఉత్పత్తుల కంపెనీలు, ఆరోగ్య యాప్‌లు, బేబీ ప్రొడక్ట్స్ స్టార్టప్‌లు కలిసి ఈ ట్రెండ్‌ను మార్కెటింగ్ అవకాశంగా ఉపయోగించు కుంటున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్‌కు నటి త్రిష పుట్టిన రోజు అభినందనలు చెప్పారా ? లేక కచ్చి కొట్టేసారా.. అదో చర్చ, చివరకి వారిద్దరూ విందు భోజనం ఆరగిస్తున్న వార్త చేస్తే తప్పమనవాళ్లు కాస్తంత స్థిమిత పడలేదండోయ్! ◻



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

వ్యథ

# మాటలు ఔషధం లాంటివే!

ప్రశ్న : నేను ఎంబీఏ తరువాత పి హెచ్ డి చేస్తున్నాను.అక్కడ ఒత్తిడికి తట్టుకోలేక డిప్రెషన్‌కు గురయ్యాను. అన్నం తినలేకపోయాను, నిద్ర పట్టలేదు, దుఃఖం ఎక్కువైంది. ఇంటర్‌లో ఉన్నప్పుడు ఒకసారి ఆత్మహత్యా ప్రయత్నం చేశాను. భయపడి సైకియాట్రిస్ట్‌ను కలిస్తే యాంటీడిప్రెసెంట్ మందులు ఇచ్చారు. వారం రోజులైనా పెద్ద మార్పు కనిపించలేదు. తరువాత మా నాన్న ఒక సైకాలజిస్ట్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన నాతో మాట్లాడుతూ రెండు కిలోమీటర్లు నడిపించారు. ఎలాంటి ప్రత్యక్ష సలహాలు ఇవ్వకుండా కథలు చెబుతూ పరోక్షంగా ప్రేరణ కలిగించారు. ఆ రోజు నాకు ఆకలి వేసింది, బాగా నిద్రపోయాను. మరుసటి రోజు నా మెతక స్వభావం, భయపడే తత్వం, ఉద్వేగ నియంత్రణ లోపం, విటమిన్ డి లోపం కారణాలు అని చెప్పారు. మరి డిప్రెషన్ హార్మోన్ల లోపం వల్లే వస్తుందని అంటారు. అయితే ఆలోచనల వల్ల కూడా వస్తుందా? కౌన్సెలింగ్ వల్ల ఎలా తగ్గింది? శాస్త్రీయంగా వివరించండి. **- ఒక సోదరి, విజయవాడ**



**జవాబు:** అమ్మా, చాలామంది డిప్రెషన్‌ను కేవలం 'హార్మోన్ల లోపం" లేదా 'మెదడులో రసాయనాల అసమతుల్యత' వల్ల వచ్చే సమస్యగా భావిస్తారు. కానీ ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం డిప్రెషన్ జీవసంబంధ, ఆలోచనా విధానం, జీవన పరిస్థితుల పరస్పర ప్రభావం వల్ల ఏర్పడే మానసిక స్థితి.మన మెదడులో సెరోటోనిన్, డోపమైన్, నోరెపినెఫ్రిన్ వంటి రసాయనాలు మన భావోద్వేగాలను నియంత్రిస్తాయి. వీటి అసమతుల్యత వల్ల నిరాశ, నిద్రలేమి, ఆకలి తగ్గడం, జీవితంపై ఆసక్తి తగ్గడం జరుగుతుంది. యాంటీడిప్రెసెంట్ మందులు ఈ రసాయన సమతుల్యతను సరిచేయడానికి ఉపయోగపడ"తాయి. అయితే వాటి ప్రభావం చాలాసార్లు 2-6 వారాల తరువాత స్పష్టంగా కనిపిస్తుంది.సున్నిత స్వభావం వల్ల చిన్న అపజయాన్ని కూడా పెద్ద ప్రమాదంగా ఊహించడం జరుగుతుంది. దీని వల్ల కార్టిసోల్ అనే స్ట్రెస్ హార్మోన్ ఎక్కువగా విడుదలై డిప్రెషన్‌ను మరింత పెంచుతుంది. అంటే"ఆలోచనలు" కూడా మెదడు రసాయనాలపై ప్రభావం చూపుతాయి.మీ బాధలు పంచుకోవడం వల్ల మెదడులో ఒత్తిడి తగ్గింది.నడక వల్ల మెదడులో ఎండార్ఫిన్స్ విడుదలై సహజ ప్రశాంతత కలిగింది. ప్రత్యక్షంగా సలహాలు ఇవ్వకుండా కథలు చెప్పడం ద్వారా మీ ఆలోచనా విధానాన్ని పరోక్షంగా మార్చారు. దీనిని సైకాలజీలో కాగ్నిటివ్ రీఫ్రేమింగ్ అంటారు. ఒక సమస్యను కొత్త కోణంలో చూడగలిగితే భయం తగ్గుతుంది. అలాగే విటమిన్ డి లోపం కూడా డిప్రెషన్ ను పెంచుతుంది.డిప్రెషన్ అనేది శరీరం, మెదడు, మనసు, జీవనశైలి అన్నీ కలిపి ప్రభావితం చేసే పరిస్థితి. మందులు, కౌన్సెలింగ్, వ్యాయామం మనసును ప్రభావితం చేస్తాయి.మెదడులో రసాయనాలు మన ఆలోచనలను ప్రభావితం చేస్తాయి.మన ఆలోచనలు కూడా తిరిగి ఆ రసాయనాలను ప్రభావితం చేస్తాయి. అందుకే సరైన కౌన్సెలింగ్ చాలా సార్లు మందులతో సమానంగా ప్రభావం చూపుతుంది. ◻

# వినయంతో విద్య

విద్య వినయంతో రాణిస్తుంది. మన సారస్వతంలో ఇలా మెరుగులు దిద్దుకున్న వజ్రాల్లాంటి విద్యార్థులందరో! బృహస్పతి పుత్రుడు కచుడు. అతడు వినయశీలుడై శుక్రాచార్యుడి వద్ద శిష్యుడిగా చేరి 'మృత సంజీవని' విద్యను ఆర్జించగలిగాడు. కచుడు తన ప్రత్యర్థి బృహస్పతి కుమారుడని తెలిసి కూడా శుక్రా చార్యులు అతని వినయవిధేయతలకు ముగ్ధుడై శిష్యుడిగా స్వీకరించాడు. ప్రత్యక్షంగా గురువుకు, పరోక్షంగా పరమాత్మకు చేరువ చేసే లక్షణం అణకువ అని ప్రహ్లాదుడు, కచుడు సాధించాడు. భగవంతుడి ఉనికి స్పష్టమయ్యేది సహృదయంలోనే. మనసును కఠినం చేస్తే.. అలాంటి దసలు చదువే అనిపించుకోదు. మనలో లాలిత పెంచే పాఠశాల దేవాలయంతో సమానం. అందుకే తన వద్దకు వచ్చిన ఓ నిరక్షరాస్యుడైన భక్తుడితో 'చదువుతో పనేముంది, హృదయముంటే చాలు' అన్నారు. రమణ మహర్షి. నువ్వు శరీరం కాదు, ఆత్మస్వరూపుడివి అని తెలుసుకోవటమే అసలైన విద్య అన్నారాయన. ఆధ్యాత్మిక జ్ఞానం స్థైర్యాన్నిస్తుంది. భవిష్యత్తులో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా మానసిక ఒత్తిడి, కుంగుబాటులకు తావుండదు. అందుకే అన్నమాచార్యులు 'చదివి. బతుకరో సర్వజనులు మీరు' అన్న కీర్తనలో ప్రహ్లాదుడు చదివినట్టి చదువు చదవడ హితవు పలికారు. నరసింహస్వామి ప్రత్యక్షమైన తర్వాత ప్రహ్లాదుడు ఆధ్యాత్మిక సాధనలకే పరిమితం కాలేదు. గృహస్థ ధర్మాన్ని, రాజ్యపాలన బాధ్యతల్ని కూడా సమర్థంగా నిర్వహించాడు. గొప్ప చక్రవర్తిగా పేరుతెచ్చుకున్నాడు. మొదట అన్ని జ్ఞానాల కు మూలమైన పారమార్థిక జ్ఞానాన్ని ఆర్జించాలని నిరూపించాడు. ఆధ్యాత్మిక జ్ఞానం, అంతర్యామికి సంబంధించిన చదువు అన్ని విద్యలకు మూలమై నిలుస్తుంది. విద్యల్లో నేను ఆధ్యాత్మిక విద్యను అన్నాడు. గీతలో శ్రీకృష్ణభగవానుడు. మన ధర్మం లౌకిక, పారలౌకిక జ్ఞానాలను భిన్నంగడా చూడలేదు. పరమాత్మకు సంబంధించిన జ్ఞానం ప్రాపంచిక జ్ఞానానికి కూడా ఆధారమై నిలుస్తుందని సృష్టమవుతుంది. ◻

# పనీర్ చమన్



ఒక్కో ప్రాంతానికి ఒక్కో సంస్కృతి ఉన్నట్టే. వంటల్లోనూ ఎవరి ప్రత్యేకతలు వారికున్నాయి. కశ్మీర్ వాసుల సంప్రదాయక వంటకం కశ్మీరీ పనీర్ చమన్. ఆకర్షణీయంగా ఉండే కశ్మీర్ ఆపిల్ పండ్లు చూస్తే.. ఎప్పుడెప్పుడు తినాలా అనిపి స్తుందో.. ఈ వంటకం కూడా అలాగే నోరూరిస్తుంది. ఇంతకీ దీన్నెలా చేస్తారంటే.. పనీర్‌ను చిన్న ముక్కలుగా కోసి.. ఒక పాత్రలో వేయాలి. కప్పు పాలల్లో చిటికెడు కుంకుమ పువ్వు వేసి, వేడిచేయాలి. లేత పసుపు రంగులోకి మారాక.. ఆ పాలను పనీర్ ఉన్న పాత్రలో పోయాలి. వాటినలా పక్కనుంచి కడాయిలో చెంచా నూనె వేసి రెండు బిర్యానీ ఆకులు, నాలుగు యాలకులు, ఐదు లవంగాలు, కొంచెం పుదీనా, ఉల్లి తరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు పసుపు వేసి వేయించాలి. అవి వేగాక కప్పు పాలు పోసి.. మూడు నిమిషాలు మరిగించాలి. ఇందులో పనీర్ ముక్కలున్న పాలను జతచేసి.. మధ్య మధ్యలో కలియ తిప్పుతూ మరిగించాలి. చిక్కబడ్డాక తగినంత ఉప్పు వేసి దించేస్తే సరిపోతుంది. పాలూ, పనీర్, మసాలా కలిసిన ఈ కశ్మీరీ పనీర్ చమన్ ప్రత్యేక రుచితో ఆకట్టుకుంటుంది. ఇది బలాన్నిచ్చే మంచి పోషకాహారం కూడా. ◻

# తరచూ సమస్యా?



తరచూ మూత్ర విసర్జన చేయాల్సి వస్తుందా.. కారణం ఎక్కువసేపు మూత్రాన్ని నిలిపి ఉంచడం వల్ల మూత్రనాళంలో బ్యాక్టీరియా చేరి ఇన్ఫెక్షన్‌కు కారణం కావచ్చు. కొన్ని రకాల ఆహార నియమాలుపాటిస్తే అధిగమించవచ్చు.

**దానిమ్మ :** పదే పదే మంటలతో కూడిన మూత్ర విసర్జన అవుతుంటే.. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-సి పుష్కలంగా ఉండే దానిమ్మరసం తీసు కోవాలి. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరిగి బ్యాక్టీరియా దాడిచేయకుండా కాపాడుతుంది.

**ఉలవలు..** కాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉండి ట్యాక్సిన్లను తొలగిస్తాయి. వేయించిన ఉలవలను పొడి చేసి నేరుగా తీసుకున్నా, నీటిలో కలిపి తాగినామేలే. ఇలా రెండు వారాలు చేస్తే ఫలితం ఉంటుంది.

**మెంతులు...** ఇందులోని యాంటీ ఆక్సి డెంట్లు మూత్రపిండాలకు ఎంతో మేలు చేస్తాయి. చెంచా మెంతిపొడిని గ్లాసు గోరువెచ్చని నీటిలో వేసి, దంచిన చిన్నఅల్లం ముక్క చెంచా తేనె కలిపి రోజు రెండుసార్లు తీసుకుంటే ఉపశమనం ఉంటుంది. **బచ్చలికూర..** ఎక్కువ పోషకాలుండే ఈ కూర మూత్రాశయ సమస్యతో బాధపడుతున్న వారికీ, మూత్రపిండాల ఆరోగ్యానికీ ఎంతో మేలు. ప్రొటీన్లు, ఐరన్, విటమిన్-ఎ మెండుగా ఉండే దీన్ని పావుకప్పు నీటిలో ఐదునిమిషాలు ఉడికించాలి. ఆపై ఆ నీళ్లను వడకట్టి గోరు వెచ్చగా తాగితే మంచిది.

# 'మెగా బంగారం' మూమెంట్..'మా ఇంటి బంగారం' టీమ్



జూన్ 19న విడుదలై బ్లాక్ బస్టర్ సాధించిన 'మా ఇంటి బంగారం' సినిమా నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను వసూలు చేసింది. ఇప్పుడు ఈ సెన్సేషనల్ సక్సెస్‌ను టీమ్ ఎంజాయ్ చేస్తోంది. ఈ క్రమంలో వారికి వారి ఎనర్జీని, ఉత్సాహాన్ని పెంచే సంఘటన జరిగింది... అదే మెగా బంగారం మూమెంట్. సూపర్ డూపర్ హిట్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ రాబడుతూ దూసుకెళ్తోన్న 'మా ఇంటి బంగారం' ఘన విజయాన్ని అభినందిస్తూ మెగాస్టార్ ట్వీట్ చేశారు. 'మా ఇంటి బంగారం' సినిమాను చూస్తున్నంత సేపు చాలా ఆసక్తికరంగా అని పించింది. జాయింట్ ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్, ఎమోషన్స్‌ని చాలా బాగా మిక్స్ చేస్తూ డైరెక్టర్ నందినీ రెడ్డి తన స్టైల్లో సినిమాను ఎంటర్‌టైనింగ్‌గా రూపొందిం చారు. సమంత నటన గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ముఖ్యంగా ఆమె చీరలో చేసిన యాక్షన్ సీన్స్ చాలా ఆకట్టుకు న్నాయి. ట్వీట్ చేయటంతో పాటు చిత్ర యూనిట్‌ను మెగాస్టార్ చిరంజీవి, ఆయన సతీమణి శ్రీమతి సురేఖ ప్రత్యేకంగా ఇంటికి పిలిచి అభినందించారు. మంచి సినిమాలకు తన వంతు సపోర్ట్‌ను అందించే మెగాస్టార్ 'మా ఇంటి బంగారం' సినిమా టీమ్‌ను అభినందించటం ఎంతో ప్రత్యేకం. సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద రాజ్‌నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి ఈ సినిమాను నిర్మించారు. నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. సినిమా తొలి ఆట నుంచే ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ దూసుకెళ్తోంది.

తెర

# 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న రిలీజ్



హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన"సర్దార్'కి సీక్వెల్"సర్దార్ 2తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. ఈ చిత్రం సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అగ్ని పర్వతంలా ఎగిసిపడుతున్న పేలుడు నేపథ్యంలో, చేతిలో తుపాకీతో ధైర్యంగా నిలబడ్డ హీరో లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. స్టైలిష్‌గా, ఇంటెన్స్‌గా డిజైన్ చేసిన ఈ పోస్టర్ కథలోని యాక్షన్ సూచిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు.సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్ లోతెరకెక్క తోంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తు న్నారు. సామ్ సిఎస్ సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్. విజయ్ వేలుకుట్టి ఎడిటర్. తిశ పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్.

# 'పెద్ది' బ్లాక్ బస్టర్ ఈవెంట్



పెద్ది విజయం నా జీవితాన్ని మార్చేసింది. పెద్ది రిలీజ్ అయ్యే వరకు మా పాప క్లీంకార నన్ను నాన్న అని పిలిచేది. విడుదలైన తర్వాత 'పెద్ది' అని పిలుస్తోంది. ఇప్పుడు అందరికీ పెద్ది పేరే గుర్తుంది. పెద్ది ఇంత అందమైన జ్ఞాపకాన్ని ఇచ్చింది: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. పెద్ది మెగా బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. మా అభిమానుల్లో ఆనాటి నుంచి ఈనాటి వరకు క్రమశిక్షణలో ఎలాంటి మార్పు లేదు. అదే ఉత్సాహం, అదే ప్రేమతో ఆదరిస్తూ వస్తున్న అభిమానులందరికీ నా హృదయపూర్వక అభివాదాలు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. ముందుగా నాన్నగారు మెగాస్టార్ చిరంజీవి కి, అనిల్ రావిపూడికి, సాహుకి, ఇక్కడికి విచ్చేసిన పెద్దలందరికీ, అభిమానులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. కొన్ని విజయాలు మనల్ని ఆనందపరుస్తాయి. కొన్ని విజయాల గురించి ఆలోచిస్తే మనసుకు చాలా తృప్తిని ఇస్తాయి. పెద్ది విజయం మాత్రం నా జీవితాన్నే మార్చేసింది. డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ.. ముందుగా చిరంజీవికి థాంక్యూ. ఆయన పక్కన కూర్చోవాలన్నా ఇప్పటికీ నాకు టెన్షన్‌గానే ఉంటుంది. చిన్నప్పుడు ఆయన సినిమాలు చూస్తూ పెరిగాం. ఏదైనా సినిమా ఫ్లాప్ అయితే మాకు నిద్ర పట్టేది కాదు. ఆయన మరో సినిమా చేసి హిట్ కొట్టే వరకు ఎదురుచూసేవాళ్లం. అలాంటి చిరంజీవి మాకు రామ్ చరణ్ లాంటి హీరోను ఇచ్చినందుకు థాంక్యూ సో మచ్. నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ.. . పెద్ది సినిమాను తెలుగు ప్రేక్షకులు తమ భుజాలపై మోసుకుంటూ విజయపథంలో ముందుకు తీసుకెళ్లారు. విడుదలై 19 రోజులు అవుతున్నా ఇప్పటికీ థియేటర్లు ప్రేక్షకులతో కళకళలాడుతున్నాయి. పెద్ది డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ.. "నేను పిఠాపురంలో ఉన్న రోజుల్లో చిరంజీవికి లెటర్లు రాసేవాడిని. అయితే ఆయన నుంచి ఎప్పుడూ జవాబు రాలేదు. కానీ నా మొదటి కథ చెప్పే అవకాశం మాత్రం ఆయనకే వచ్చింది. నా రెండో సినిమా పెద్ది కూడా ఆయన వెళ్ళింది. ఒక మనిషికి సంకల్పం ఉంటే ఎంత సాధించగలడో చెప్పే కథే పెద్ది. అలాంటి కథతో ఈరోజు మీ ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది

# 'ఆల్ఫా' ఆటిట్యూడ్‌కు ఒక ప్రతీకలా ఉంటుంది: అలియా భట్..



యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో రాబోతోన్న భారీ బడ్జెట్ చిత్రం'ఆల్ఫా'. ఇండియాలో ఇది వరకెన్నడూ రానట్టుగా అలియా భట్, షర్వారిలతో భారీ బడ్జెట్ యాక్షన్ మూవీని రూపొందిం చారు. ఆల్ఫా చిత్రం ఆటిట్యూడ్‌కు ఒక వేడుకగా, ప్రతీకగా నిలిచే ఓ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ మూవీ షూటింగ్, అందులోని క్షణాల్ని తాను ఎప్పటికీ మర్చిపోలేను అని అలియా భట్ అన్నారు. అలియా భట్ మాట్లాడుతూ.. ఆల్ఫా'. చిత్రానికి పని చేయడం నాకెంతో ఆనందంగా ఉంది. నేను ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసిన సినిమాల్లో ఇది కూడా ఒకటిగా నిలుస్తుంది. యాక్షన్, గ్రాండియర్, అడ్వెంచర్‌లతో కూడిన ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది నేను మునుపెన్నడూ అనుభవించని ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్. షూటింగ్‌లోని ప్రతీ క్షణాన్ని నేను ఎంతో ప్రేమించాను, ఆస్వాధించాను.ఈ చిత్రంలోని కథ ఇద్దరు మహిళ కథా నాయికల చుట్టే తిరుగుతుంది. అదే నాకు ఎక్కువగా నచ్చిన అంశం. ఇలాంటి గొప్ప స్క్రిప్ట్‌లు మనం అరుదుగా చూస్తుంటాం. ఈ ప్రయాణంలో భాగం అవ్వడం నాకెంతో సంతోషానిచ్చింది."ఆల్ఫా అనేది ఆటిట్యూడ్‌కి, సెలెబ్రేషన్‌కి కేరాఫ్‌గా నిలుస్తుంది. ఇలాంటి ఓ అద్భుతమైన బృందంతో కలిసి పని చేయడం నాకు మరింత ప్రత్యేకంగా అనిపించింది.మా దర్శకుడు, నటీనటులు, యాక్షన్ టీమ్, తెర వెనుక సిబ్బంది ఇలా అందరం కలిసి ఎంతో కష్టపడి ఉత్సాహంతో పని చేశాం. మా ఉత్సాహం అంతా కూడా తెరపై ప్రతిబింబిస్తుందని ఆశిస్తున్నాను. ప్రతి ఉదయం సెట్‌కు వెళ్లడానికి మనస్ఫూర్తిగా ఎదురుచూసేదాన్ని, చిత్రీకరణలోని ప్రతి నిమిషాన్ని ఆస్వాదించాన్న అని అన్నారు.ఆదిత్య చోప్రా నిర్మాణంలో ది రైల్వే మెన్ ఫేమ్ శివ్ రావైల్ దర్శకత్వం వహించిన 'ఆల్ఫా' చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# 'దీవాన' పాజిటివ్ మౌత్ టాక్ స్ప్రెడ్



'దీవాన' సినిమా క్రియేటివ్‌గా సంతృప్తినిచ్చింది, ఈ వీకెండ్ కు ఆర్థికంగా కూడా సంతృప్తిని ఇస్తుందని నమ్ముతున్నాం ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడియంగ్ టాలెంటెడ్ హీరో హర్షిత్ రెడ్డి నటించిన కొత్త సినిమా 'దీవాన'. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్మేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయయ్యారు. ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడి మాట్లాడుతూదీవాన సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా కథ సెకండాఫ్ నుంచే టేకాఫ్ అవుతుంది. ఇంటర్వెల్, సెకండాఫ్ బాగా ఇంప్రెస్ అయ్యే ఈ మూవీని స్టార్ట్ చేశాం. సరదాగా ఉండే హీరో మారిపోవడం వంటివన్నీ సెకండాఫ్‌లోనే చూపించాం. మేము మూవీ ప్రమోషన్స్, మార్కెటింగ్ లో బిజీగా ఉన్నాం. అదే టైమ్ లో సెన్సార్ నుంచి ఇలా ఇబ్బందులు ఎదురయ్యాయి. మేము రివిజన్ కు వెళ్లే టైమ్ కూడా దొరకలేదు. ఒక విజువల్ కట్ తో పాటు కొన్ని ఆడియో కట్స్ ఇచ్చారు. మా సినిమా చూసిన ఆడియెన్స్ రివ్యూయర్స్ ఇంటర్వెల్ ట్విస్ట్ మాత్రం రివీల్ చేయలేదు. మొదట్లో ఆ ట్విస్ట్ గురించి చెబుతారని కొంత భయం ఉండేది. కొన్ని సినిమాలు కథలోని ట్విస్ట్ మీదే ఆధారపడి ఉంటాయి. ప్రొడ్యూసర్ వాసుదేవ్ కొప్పినేని మాట్లాడుతూ మా మూవీ రిలీజ్‌కు ముందు అన్నీ పక్కాగా ప్లాన్ చేసుకున్నాం. విశాఖ, విజయవాడ, హైదరాబాద్..ఇలా ప్రీమియర్స్ కోసం ఏర్పాట్లు చేశాం. సెన్సార్ అనుకున్న సమయానికి రాకపోవడం వల్ల అనుకున్నవి చేయలేకపోయాం. చిన్న సినిమాకు రిలీజ్ డేట్ మార్చడం ఎంత క్లిష్టమైన పనో మీకు తెలుసు. మా సినిమా యూత్ ఫుల్ మూవీ అనే ఇంప్రెషన్ ఆడియెన్స్ లో మొదట కలిగింది. అయితే మాది హోల్ సమ్ ఫ్యామిలీ మూవీ. ఇందులో లవ్ తో పాటు ఫ్రెండ్షిప్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి. మంచి డెప్త్ ఉన్న డైలాగ్స్ ఉన్నాయి.

# 'స్టూడెంట్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



స్వర్గీయ రియల్ స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'స్టూడెంట్'. ఈ సినిమాలో విజేత పరీక్ హీరోయిన్‌గా నటిస్తోంది. జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వర్క్స్ బ్యానర్స్ పై బెల్లం సిద్ధారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లం సంగీత, బెల్లం బయ్యారెడ్డి కో ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తు న్నారు.ఈ రోజు 'స్టూడెంట్' సినిమా నుంచి పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ లో మేఘాంశ్ శ్రీహరి ఇంటెన్స్ లుక్ లో కనిపిస్తున్నారు. పవర్ స్టార్ సినిమాకు బ్యానర్స్ కట్టడం, జామెట్రీ బాక్స్ లోని డివైడర్ ను క్లాస్ లో కాకుండా ఫైట్స్‌కు ఉపయోగిం చడం, కాల్చిన సిగరెట్, అందంగా లవ్ లెటర్స్ రాయడం..ఇలా స్టూడెంట్ లో లైఫ్ లో భాగమైనవన్నీ ఈ పోస్టర్ లో కనిపించి 'స్టూడెంట్' సినిమా మేఘాంశ్ శ్రీహరి కెరీర్ కు ల్యాండ్ మార్క్ మూవీగా రాబోతుందనే అంచనాలు ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఏర్పడుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.




# వన్డే ర్యాంకుల్లో తీన్‌మార్

**దుబాయ్, జూన్24:** వన్డే క్రికెట్ ర్యాంకింగులను ఐసీసీ విడుదల చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌పై పరుగుల వరద పారించిన టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ రెండో ర్యాంకులో నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్‌పై తొలి రెండు వన్డేల్లో 84, 154 రన్స్ సాధించిన గిల్‌కు మూడో వన్డేలో ఆడే అవకాశం రాలేదు. ఈ పరుగులతో గిల్ వన్డే ర్యాంకును మెరుగుపర్చుకున్నాడు. కాగా టాప్-4 ర్యాంకుల్లో మూడు టీమిండియా ఆటగాళ్లవే. గాయంతో ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ 768 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక రోహిత్ శర్మ నాలుగో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్ 815 పాయింట్లతో టాప్ ర్యాంకులో ఉన్నాడు. గిల్, మిచెల్ మధ్య కేవలం 24 రేటింగ్ పాయింట్స్ తేడా ఉన్నది. ఇతర భారత బ్యాట్స్‌మెన్లలో ఇషాన్ కిషన్ 21 స్థానాలు మెరుగుపర్చుకుని 43వ ర్యాంకుకు చేరుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ 14వ ర్యాంకులో, కేఎల్ రాహుల్ 11వ ర్యాంకు దక్కించుకున్నారు.

బౌలింగ్ విభాగంలోనూ జస్ ప్రీత్ బుమ్రా టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. వన్డే బౌలర్లలో అర్షదీప్ సింగ్ 22, ప్రసిద్ధ కృష్ణ 58, వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో ఉన్నారు. ఇక టెస్టుల్లో కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ దూసుకొచ్చాడు. బుమ్రాతో కలిసి అతను నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో మ్యాట్ హెన్రీ 11 వికెట్లు తీసుకున్నాడు.

# టీటీ సమాఖ్యకు మనికా బాత్రా హెచ్చరిక

**న్యూఢిల్లీ, జూన్ 24:** కామన్‌వెల్త్ క్రీడల గోల్డ్ మెడలిస్ట్, రెండుసార్లు ఒలింపియన్ మనికా బాత్రా... భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్యపై లీగల్ ఫైట్‌కు సిద్ధమవుతోంది. ఆసియా క్రీడల్లో పాల్గొనే టేబుల్ టెన్నిస్ జట్టు నుంచి తనను తీసివేయడంపై అసహనం వ్యక్తం చేసింది. జట్టు నుంచి తొలగించడంపై సరైన కారణం చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని సమాఖ్యను హెచ్చరించింది. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర క్రీడల మంత్రి మన్సుక్ మాండవీయ జోక్యం చేసుకోవాలని బాత్రా మరోసారి కోరింది. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం కావాలన్నారు.

ఏ ప్రాతిపదికన జట్టులో నుంచి తీసేశారో తనకు లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని మాత్రమే కోరుతున్నట్లు బాత్రా చెప్పారు. నన్ను సెలక్ట్ చేయకపోవడానికి గల కారణాలను ఫెడరేషన్ తెలియజేయలేదు. టాప్50లో ఉన్న ప్లేయర్ ఒకటి, రెండు వారాల్లో 51వ ర్యాంకుకు పడిపోతే.. ఆసియా క్రీడలకు అర్హత కోల్పోయినట్టేనా? అని ప్రశ్నించారు. తనపై వేటు నిర్ణయానికి గల కారణాలపై సంతృప్తికర సమాధానాలు రాకపోతే టీటీ సమాఖ్యపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని మానికా బాత్రా స్పష్టం చేశారు. కాగా జపాన్ వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి.



# ఇంగ్లండ్‌కు ఘనా షాక్ : నాకౌట్‌లో కొలంబియా

**ఫిలడెల్ఫియా, జూన్ 24:** ఫిఫా ప్రపంచ కప్‌లో కొలంబియా నాకౌట్ స్టేజ్‌కు చేరుకుంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్‌ను ఘనా నిలువరించగా...పనామాపై ఏకైక గోల్‌తో నెగ్గి క్రొయేషియా నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. క్రొయేషియా మిడ్ ఫీల్డర్ లుకా మోడ్రిక్ తన 200వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

### ఇంగ్లండ్‌కు ఘనా అడ్డుకట్ట

సాకర్ ప్రపంచకప్ హాట్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్‌ను ఫుట్‌బాల్ కూన ఘనా చక్కగా నిలువరించింది. తొలి మ్యాచ్‌లో గెలిచి దూకుడు మీదున్న ఇంగ్లాండ్‌ను ఒక్క గోల్ కూడా చేసే అవకాశం ఇవ్వకుండా గోల్ లెస్ డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో గెలిచి నాకౌట్ బెర్తు ఖాయం చేసుకుందామనుకున్న ఇంగ్లాండ్ ఆశలకు బ్రేక్ పడింది. గోల్ కోసం ఇరు జట్లూ తీవ్రంగా శ్రమించాయి. నాలుగు సార్లు గోల్ పోస్ట్ వైపు టార్గెట్ చేసినా ఇంగ్లాండ్‌కు కలిసి రాలేదు. ఘనా కేవలం ఒక్కసారి మాత్రమే గోల్ పోస్టును టార్గెట్ చేసింది. చివరికి 0-0తో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అయితే,మ్యాచ్ రిఫరీ ఎడ్రి కోన్సా తీరుపై ఘనా ఆగ్రహం వ్యక్తం చేసింది. పెనాల్టీ ఇవ్వకపోవడం వల్ల తాము నష్టపోయామని ఆ జట్టు మేనేజ్‌మెంట్ విమర్శించింది.

### పనామాపై క్రొయేషియా విజయం

గ్రూప్-ఎల్‌లో భాగంగా పనామాతో జరిగిన మ్యాచ్‌లో క్రొయేషియా విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. రెండో అర్ధభాగం 54వ నిమిషంలో యాంటే బుదిమిర్ అందించిన గోల్‌తో క్రొయేషియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఇరు జట్లూ గోల్స్ కోసం తీవ్రంగా శ్రమించాయి. ఓ దశలో పనామా గోల్ చేసినంత పనిచేసింది. అయితే క్రొయేషియా గోల్ కీపర్ దాన్ని అద్భుతంగా అడ్డుకోగలిగాడు. చివరికి క్రొయేషియా ఏకైక గోల్ తేడాతో పనామాపై విజయం సాధించింది. ఈ ఓటమితో పనామా ఇంటి ముఖం పట్టగా...ఇంగ్లాండ్, ఘనా, క్రొయేషియా మధ్య నాకౌట్ రేసు ఆసక్తిగా మారింది.


గోల్ కొట్టడంలో ఇంగ్లండ్ విఫలం


కొలంబియాకు గోల్ కొట్టిన డానిల్

### టాప్ ప్లేస్‌తో కొలంబియా

గ్రూప్-కేలో భాగంగా డీఆర్ కాంగోను 1-0 గోల్స్ తేడాతో కొలంబియా గెలుపొంది నాకౌట్‌కు చేరుకుంది. పోర్చుగల్‌కు కూడా రెండో స్థానంతో నాకౌట్ బెర్త్ ఖరారైంది. తొలి మ్యాచ్‌లో పోర్చుగల్‌ను నిలువరించిన డీఆర్ కాంగో జట్టు ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లోనూ అద్భుత ఆట ప్రదర్శించారు. తొలి అర్ధభాగం ముగిసేవరకు కొలంబియాకు గోల్ చేసే అవకాశాన్ని ఇవ్వలేదు.

చివరకు 76వ నిమిషంలో గానీ కాంగో డిఫెన్స్‌ను చేధించలేకపోయింది. సహచరుడు ఇచ్చిన పాస్‌ను సర్కిల్‌లో ఉన్న డానిల్ మునోజ్ అందుకుని గోల్‌గా మలిచాడు. ఈ గోల్‌తోనే కొలంబియాకు విజయం దక్కింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందిన కొలంబియా.. ఆరు పాయింట్లతో గ్రూప్-కే నుంచి నాకౌట్ చేరిన తొలి జట్టుగా నిలిచింది.

# టిజి20లో వరంగల్ ఘనవిజయం



**హైదరాబాద్, జూన్ 24(వార్త క్రీడా ప్రతినిధి):** ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న తెలంగాణ 20 లీగ్‌లో సెంచరీల మోత మోగుతోంది. హర్షిత్ చౌదరనీ(62బంతుల్లో 121 నాటౌట్; 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో అన్విత ఖమ్మం ఏస్‌పై వరంగల్ వారియర్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 203 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన వరంగల్.. 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. అమన్ రావు వికెట్ తొందరగానే కోల్పోయినా మరో ఎండ్‌లో హర్షిత్ చౌదరీ అదరగొట్టాడు. ఒంటిచేత్తో వరంగల్‌కు గెలుపందించాడు. మిగతా వారిలో సిసోదియా 27 రన్స్ చేశాడు. ఖమ్మం బౌలర్లలో మహేష్, మిలింద్, వేద్ రెడ్డి తలా ఓ వికెట్ తీశారు.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం ఏస్ 19.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ గుప్తా (54), మిక్కిల్ జైస్వాల్ (54) హాఫ్ సెంచరీలతో రాణించారు. కచ్చి (17), హిమతేజ (23),వేద్ రెడ్డి (20), మిలింద్ (11), విద్యానంద రెడ్డి (6) పరుగులు చేశారు. వరంగల్ వారియర్స్ బౌలర్లలో అబ్దుల్ మాలిక్ 3, అభిషేక్ 3, పల్లెపాటి 2, హుస్సేన్ ఒక వికెట్ తీశారు.

# పోర్చుగల్‌కు బోణీ కొట్టిన క్రిస్టియానో రొనాల్డో

**హ్యూస్టన్ :** స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో రెండు గోల్స్‌తో మెరిసి సాకర్ ప్రపంచకప్‌లో పోర్చుగల్‌కు గెలుపు బోణీ చేశాడు.కాంగోతో మ్యాచ్ డ్రా చేసిన పోర్చుగల్.. రెండో మ్యాచ్‌లో ఉబ్జెకిస్థాన్‌పై 5-0 గోల్స్‌తో గెలుపొందింది. ఆరో నిమిషంలోనే గోల్ అందించి పోర్చుగల్‌ను ఆధిక్యంలో నిలిపిన క్రిస్టియానో రొనాల్డో మరో గోల్‌ను 39వ నిమిషంలో అందించాడు.ఈ రెండు గోల్స్‌తో ఫిఫా వరల్డ్‌కప్‌లో అరుదైన ఘనత సాధించాడు. 2006 నుంచి ఇప్పటివరకు ఆడిన ఆరు ఫిఫా ప్రపంచకప్‌లలోనూ గోల్స్ చేసిన ఏకైక ప్లేయర్‌గా రొనాల్డో నిలిచాడు. అర్జెంటీనా స్టార్ మెస్సీ కూడా ఆరు వరల్డ్ కప్స్ ఆడినా..2010టోర్నీలో గోల్ చేయలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించడం ద్వారా ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక వయసులో ఒకే మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన ఆటగాడిగా రొనాల్డో సరికొత్త ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించాడు. తనలోని సత్తా ఇంకా తగ్గలేదని ఈ ప్రదర్శనతో ఆయన మరోసారి నిరూపించాడు. ప్రస్తుతం రొనాల్డో వయసు 41 సంవత్సరాల 138 రోజులు. అలాగే, ఉజ్బెకిస్థాన్‌పై చేసిన ఈ రెండు గోల్స్ ద్వారా రొనాల్డో... పోర్చుగల్ తరఫున మరో ఆల్‌టైమ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రపంచకప్ చరిత్రలో పోర్చుగల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. రొనాల్డో ఇప్పటివరకు ఆడిన 24 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో మొత్తం 10 గోల్స్ సాధించాడు.



# భారీ లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## ఐటి, ప్రైవేటు బ్యాంకింగ్ రంగాల మద్దతు



**ముంబై, జూన్ 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్‌మల్హోత్రా వడ్డీ రేట్ల పెంపుచర్చలు ఇప్పుడే అవసరం లేదని చెప్పడం, ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 77 డాలర్ల దిగువకు రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆశావహ సంకేతాలు మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చాయి.ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాల షేర్లు ప్రధానంగా ర్యాలీకి మద్దతిచ్చాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 790.54 పాయింట్లు పెరిగి 76,991.22 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 197.55 పాయింట్లు లేదా 0.83 శాతం లాభపడి 24,021.65 స్థాయికి చేరుకుంది.దీంతో నిఫ్టీ మళ్లీ 24,000 మార్క్‌ను అధిగమించింది.

నిఫ్టీ పెరుగుదలకు ఐసీఐసీఐ బ్యాంక్ 2.59, ఇన్ఫోసిస్ 2.59, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్2.34శాం పెరిగి మద్దతిచ్చాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ సూచీ 0.13 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.20 శాతం మేర పెరిగాయి.ఎన్‌ఎస్‌ఈలో 1,735 షేర్లు లాభపడగా, 1,566 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 95 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. మార్కెట్ అస్థిరతను సూచించే ఇండియా విక్స్ సూచీ 3.99 శాతం తగ్గి 13.39కు చేరుకుంది. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.840 శాతం నుంచి 6.805 శాతానికి తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. బంగారం ఆగస్టు ఫ్యూచర్స్ ధర 1.44 శాతం తగ్గి రూ.1,44,416 వద్దకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 1.38 శాతం తగ్గి 76.02 డాలర్లకు చేరింది.

ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ముగిశాయి. టెక్నాలజీ, సెమీకండక్టర్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి.అమెరికా మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఎస్ అండ్ పీ 500 సూచీ 1.44 శాతం, నాస్‌డాక్ 2.21 శాతం పడిపోయాయి. డౌ జోన్స్ సూచీ కూడా స్వల్పంగా బలహీనపడింది. ప్రతి ఏటా 50 వెస్ట్ సైడ్, 200-250 జూడియో స్టోర్లను ప్రారంభించాలని యోచిస్తోంది. ఇదే సమయంలో చైర్మన్ నోయెల్ టాటా పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. టాటామోటార్స్ 3.21 శాతం లాభపడింది.

**ఐఆర్‌ఎఫ్‌సీ:** కేంద్ర ప్రభుత్వం 2 శాతం వాటాను విక్రయించేందుకు ఆఫర్ ఫర్ సేల్ ప్రకటించడంతో షేరు 6.83 శాతం క్షీణించింది. **టాన్‌ఫాక్ ఇండస్ట్రీస్:** క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్‌కు బోర్డు ఆమోదం తెలపడంతో షేరు 3.04 శాతం పెరిగింది. **ఇన్ఫోసిస్:** గ్లోబల్‌ఫౌండ్రీస్‌తో బహువార్షిక భాగస్వామ్యాన్ని విస్తరించినట్లు ప్రకటించడంతో షేరు 2.59 శాతం ఎగిసింది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ నుంచి రూ.1,347.71 కోట్ల ఆర్డర్లు పొందినట్లు ప్రకటించినప్పటికీ షేరు స్వల్పంగా 0.58 శాతం తగ్గింది. మొత్తంగా, వడ్డీ రేట్ల పెంపుపై భయాలు తగ్గడం, చమురు ధరల పతనం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కారణంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లు బలంగా కోలుకుని పెట్టుబడిదారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి.

# అదానీ గ్రూప్‌లో 'త్రిసూత్ర' ప్రణాళిక!

## ఎజిఎంలో గౌతమ్ అదానీ వెల్లడి




**ముంబయి,జూన్ 24:** దేశ నిర్మాణానికి దోహదపడే మౌలిక సదుపాయాలను నిర్మించడం, సమాజంలోని ప్రతి స్థాయిలో మానవ గౌరవాన్ని కాపాడే సంస్థలను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. కంపెనీ 34వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన ఆయన, వచ్చే దశాబ్ద కాలంలో సంస్థ విజన్‌ను అమలు చేసేందుకు మూడు కీలకమైన పునాది సూత్రాలను ఆవిష్కరించారు.

భవిష్యత్తులో మరింత ప్రతిష్ఠ, క్రమశిక్షణ, కార్యదక్షత అవసరమని అదాని పేర్కొన్నారు. పని విధానాన్ని సరళతరం చేస్తున్నామని, అధికార యంత్రాంగాన్ని తగ్గించి, జవాబుదారీతనాన్ని పదును పెట్టడానికి, నిర్ణయాలను అమలుకు మరింత చేరువ చేయడానికి మా ప్రధాన కార్యాలయాలు, సైట్‌లలో మూడుస్థాయిల నిర్మాణాన్ని అమలు చేస్తున్నామని, సంస్థలో ప్రతి పాత్ర, ప్రతి ప్రక్రియ విలువను జోడించేలా ఉండాలి. ప్రధానం కాని కార్యకలాపాలను మా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు లేదా నామినేటెడ్ భాగస్వాములకు బదిలీ చేస్తామఆయన వివరించారు.

కాంట్రాక్టర్లతో తమ పని విధానాన్ని మార్చుకుంటున్నట్లు అదానీ వెల్లడించారు.వారిని దేశ నిర్మాణంలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామన్నారు. వారి వృద్ధికి మద్దతునిచ్చే, వారి లాభా లను కాపాడే, మా ఆసక్తులతో వారి ఆసక్తులను ఏకీకృతం చేసే లోతైన, స్థిరమైన భాగస్వామ్యాలను నిర్మిస్తామన్నారు. ఇది ప్రా కార్మికుల ఆత్మగౌర వానికి తమసంస్థల్లో పెద్దపీట వేస్తున్నట్లు అదానీ నొక్కి చెప్పారు. మా సొంత, కాంట్రాక్టర్ల సిబ్బంది కలిపి దాదాపు నాలుగు లక్షల మంది ఉన్నారు. వీరిలో 85 శాతం మంది మా సైట్లలో క్షేత్రస్థాయిలో పనిచేసేవారే. మా ప్రణాళికలను వాస్తవరూపంలోకి తెచ్చేది వారే. ప్రతి కార్మికుడికి గౌరవం లభించేలా మేము కట్టుబడి ఉన్నాం. పరిశుభ్రమైన జీవన పరిస్థితులు, పరిశుభ్రమైన ఆహారం, వైద్య సహాయం, సురక్షితమైన పని వాతావరణం, సమయానికి సరైన వేతనాలు చెల్లించడం ఇందులో భాగం" అని ఆయన పేర్కొన్నారు.

సంస్థ వృద్ధితో పాటు అదానీ ఫౌండేషన్ కార్యకలాపాలు కూడా తమ లక్ష్యాలకు కేంద్రంగా ఉన్నాయని గౌతమ్ అదానీ తెలిపారు. డాక్టర్ ప్రీతి అదానీ సమర్థ నాయకత్వంలో ఫౌండేషన్ 30వ సంవత్సరంలోకి అడుగు పెడుతోందని, ప్రస్తుతం 22 రాష్ట్రాల్లోని 7,000 గ్రామాల్లో దాదాపు కోటి మందికి సేవలు అందిస్తోందని చెప్పారు.

అహ్మదాబాద్, ముంబైలలో 1000 పడకల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, వైద్య కళాశాలలతో కూడిన అదానీ హెల్త్ సిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక నైపుణ్యాభివృద్ధిలో భాగంగా గ్రామీణ భారత దేశంలో 1.25 లక్షల మంది యువతకు శిక్షణ ఇస్తున్నట్లు, గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో కర్మ ఉత్సవ్ తో స్థానిక ఉపాధిని ప్రోత్సహిస్తున్నట్లు గౌతమ్ అదానీ వివరించారు.

### బ్యాంక్ ఆఫ్ ఇండియా కేసులో లండన్ కోర్టు తీర్పు

# నీరవ్‌మోడీ 100కోట్లు చెల్లించాల్సిందే



**లండన్,జూన్ 24:** భారత్ నుండి పరారైన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి లండన్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది.బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన కేసులో నీరవ్ మోడీ తన కంపెనీ రుణం కోసం ఇచ్చిన వ్యక్తిగత గ్యారెంటీ కింద 10.7 మిలియన్ డాలర్ల సుమారు రూ.100 కోట్లు కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సిందేనని కోర్టు తీర్పునిచ్చింది. లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్ట్ జడ్జి జస్టిస్ సైమన్ టింక్లర్ తన తీర్పులో అసలు మొత్తం 4.1 మిలియన్ డాలర్లతో పాటు దానికి సంబంధించిన వడ్డీని కూడా నీరవ్ మోదీ నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. ఈ గ్యారెంటీ చెల్లదని,తనకు సరైన డిమాండ్ నోటీసులు రాలేదని నీరవ్ మోడీ చేసిన వాదనలను కోర్టు పూర్తిగా తోసిపుచ్చింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా జులై 2012లో దుబాయ్ ఆధారిత ఫైర్‌స్టార్ డైమండ్ ఎఫ్‌జెడ్‌ఈ అనే నీరవ్ మోడీకి చెందిన సంస్థకు భారీ రుణాన్ని మంజూరు చేసింది. ఈ రుణ సదుపాయానికి గాను ఆగస్టు 3, 2013న నీరవ్ మోదీ వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చారు. అయితే, 2018 ప్రారంభంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన భారీ కుంభకోణం వెలుగులోకి రావడంతో, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ రుణాన్ని వెనక్కి తీసుకుంది. మార్చి, ఏప్రిల్ 2018తో పాటు అక్టోబర్ 2025లో కూడా బ్యాంకు పంపిన డిమాండ్ నోటీసులను నీరవ్ మోడీ, అతడి కంపెనీ పట్టించుకోలేదు.

పీఎన్‌బీ కుంభకోణం కారణంగా ఫైర్‌స్టార్ గ్రూప్ కార్యకలాపాలు, నీరవ్ మోడీ అప్పులు తీర్చే సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నాయని, అందువల్ల రుణాన్ని వెనక్కి తీసుకోవడం సమర్థనీయమేనని కోర్టు అభిప్రాయపడింది. భారతదేశంలో దాదాపు రూ. 13వేల కోట్ల పీఎన్‌బీ రుణ మోసానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ, మార్చి 2019లో అరెస్ట్ అయినప్పటి నుండి యూకే జైల్లోనే శిక్ష అనుభవిస్తున్నారు. మనీలాండరింగ్, మోసం కేసులను ఎదుర్కొనేందుకు వీలుగా తనను భారతదేశానికి అప్పగించాలన్న నిర్ణయంపై ఆయన ఇంకా చట్టపరమైన పోరాటం చేస్తూనే ఉన్నారు.

# భారత సంతతి సిఇఒకు 7789కోట్ల ప్యాకేజి



**వాషింగ్టన్, జూన్ 24:** అమెరికాకు చెందిన రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ వెల్‌టవర్ సీఈఓగా పనిచేస్తున్న శంఖ్ మిత్రా, ప్రపంచంలోనే అత్యధిక పారితోషికం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్ జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఆయన 821 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.7,789 కోట్లు విలువైన వేతన ప్యాకేజీని అందుకుని చరిత్ర సృష్టించారు. టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ (158.4బిలియన్ డాలర్లు) తర్వాత అత్యధిక వేతనం పొందుతున్న వ్యక్తిగా శంఖ్ మిత్రా రికార్డులకెక్కారు.

శంఖ్ మిత్రా ప్యాకేజీలో 99శాతం స్టాక్ గ్రాంట్ల రూపంలోనే ఉంది. అక్టోబర్‌లో ఆయనకు 789 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్స్ కేటాయించారు. ఈ ప్యాకేజీకి కొన్ని కఠినమైన షరతులు ఉన్నాయి. కంపెనీలో ఆయన2031 వరకు కొనసాగితేనే సగం షేర్లను పొందుతారు. మిగిలిన సగం పొందాలంటే, ఐదేళ్ల వ్యవధిలో వెల్‌టవర్ మార్కెట్ విలువ 45శాతం పెరగాలి. అంతేకాకుండా పలు స్టాక్ ఇండెక్స్‌ల కంటే కంపెనీ షేర్ల పనితీరు మెరుగ్గా ఉండాలి. ఆయన నాయకత్వంలో కంపెనీ వృద్ధి సాధిస్తేనే ఈ భారీ మొత్తం ఆయనకు దక్కుతుంది. ఇది ఆయన గత ప్యాకేజీ కంటే 40 శాతం అధికం కావడం గమనార్హం. భారత్‌లోనే పుట్టి పెరిగిన శంఖ్ మిత్రా, జాదవ్ పూర్‌యూనివర్సిటీ నుంచి ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి, కొలంబియా బిజినెస్‌స్కూల్‌లో అప్లైడ్ వ్యాల్యూ ఇన్వెస్టింగ్‌లో ఎంబీఏ పట్టా పొందారు.

కెరీర్‌ను ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్‌లో ప్రారంభించి, ఫిడిలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్, సిటాడెల్ ఇన్వెస్ట్‌మెంట్, మిలీనియం పార్ట్‌నర్స్ వంటి ప్రముఖ సంస్థల్లో రియల్ ఎస్టేట్ సెక్యూరిటీస్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ విభాగాల్లో కీలక పాత్రలు పోషించారు.2016లో ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వెల్‌టవర్‌లో చేరి తన ప్రతిభతో ఉన్నత స్థానాలకు ఎదిగారు. చీఫ్‌ఆపరేటింగ్ ఆఫీసర్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి, 2020 అక్టోబర్‌లో కంపెనీకి సీఈఓగా నియమితులయ్యారు.

# ట్రెంట్ ఛైర్మన్ పదవికి నోయెల్ టాటా గుడ్‌బై



**ముంబయి,జూన్ 24:** టాటా గ్రూప్‌కు చెందిన రిటైల్ దిగ్గజం ట్రెంట్ చైర్మన్‌గా దాదాపు మూడు దశాబ్దాల పాటు సేవలందించిన ప్రముఖ వ్యాపారవేత్త నోయెల్ టాటా తన పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.కంపెనీ 47వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారులను ఉద్దేశించి మాట్లాడుతూ, చైర్మన్‌గా ఇదే తన చివరి సమావేశమని ఆయన స్పష్టం చేశారు. టాటా గ్రూప్ గవర్నెన్స్ మార్గదర్శకాల ప్రకారం.. నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పదవీ విరమణ వయసు 70 ఏళ్లుగా నిర్దేశించారు. ఈ ఏడాది నవంబర్‌లో నోయెల్ టాటాకు 70ఏళ్లు నిండనున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రిటైర్మెంట్ ప్రకటనతో టాటా గ్రూప్ రిటైల్ విభాగంలో ఆయన పోషించిన కీలక పాత్రకు ముగింపు పలికినట్లయింది. నోయెల్ టాటా ప్రస్థానం ట్రెంట్ కంపెనీతో విడదీయరానిది. ఆయన తల్లి సిమోన్ టాటా,ల్యాక్మేను విక్రయించిన తర్వాత ట్రెంట్ కంపెనీని స్థాపించారు.1998లో నోయెల్ టాటా ఈ కంపెనీ బోర్డులో డైరెక్టర్‌గా చేరారు.ఆమరుసటి ఏడాదే, 1999 జూన్‌లో కంపెనీకి తొలి ఎండీగా బాధ్యతలు స్వీకరించి, దేశంలో రిటైల్ వ్యూహాన్ని మార్చేసిన ఘనతను సొంతం చేసుకున్నారు.

# 300 నగరాలకు అమెజాన్‌నౌ విస్తరణ: ఆండీ జెస్సీ

**ముంబయి:** ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ క్విక్‌కామర్స్ విభాగంలో ప్రవేశపెట్టిన అమెజాన్‌నౌ సర్వీస్, దేశంలో అత్యంతవేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారంగా నిలిచిందని అమెజాన్ సీఈఓ ఆండీ జెస్సీ వెల్లడించారు. భారత పర్యటనలో ఉన్న ఆండీ జెస్సీ, ముంబైలోని అత్యంత రద్దీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అమెజాన్ నౌ మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. భారత్‌లో ఉండటం, ముంబైలోని మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించడం చాలా బాగుంది.ప్రజలకు తక్షణం అవసరమయ్యే కిరాణా సరుకులు, షాంపూలు,బేబీ ప్రొడక్టులు వంటివి ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే ప్యాక్ చేసి డెలివరీ చేస్తున్నారని ఆయన అన్నారు.ఈ మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను ప్రత్యేకంగా నిత్యావసర వస్తువులను వేగంగా ప్యాక్ చేసి, డెలివరీ చేసేందుకు వీలుగా డిజైన్ చేశారు. ఈ సేవను ఉపయోగించడం ప్రారంభించిన ప్రైమ్ మెంబర్లు, షాపింగ్ ఫ్రీక్వెన్సీని మూడు రెట్లు పెంచారని జెస్సీ గణాంకాలతో వివరించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.